www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 25-7-2024 | పేజీలు : 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 100 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 1.58 తదుపరి షష్ఠి; నక్షత్రం: పూర్వాభాద్ర సా. 4.16 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 1.09-2.38; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.04, మ. 3.21-4.12; అమృతఘడియలు: ఉ. 8.55-10.23; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎంత మంది బిడ్డలుంటే..

అంతమందికీ 'తల్లికి వందనం'

త్వరలో విధివిధానాలు జారీ చేస్తాం

ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులందరికీ వర్తింపు

లోటుపాట్లకు తావు లేకుండా పథకం అమలు: లోకేశ్

11



కిక్కు లెక్క తేలుస్తాం

ముడుపుల కిందే 3,113 కోట్లు నొక్కేశారు

ఖజానాకు మరో 18,860 వేల కోట్ల నష్టం

జగన్ లిక్కర్ దందాపై

శ్వేతపత్రం



ఏడు కంపెనీలకే దాదాపు అన్ని ఆర్డర్లు

వైసీపీ హయాంలో 38 కొత్త బ్రాండ్లు

డిస్టిలరీలను కబ్జా చేసి దందా

తయారీ, అమ్మకం అంతా వాళ్ల చేతిలోనే

పక్క రాష్ట్రాల మద్యంతోనూ దోపిడీ

ధరలు పెంచి పేదల జేబులు లూటీ

నాసిరకంతో అనారోగ్య సమస్యలు

అక్రమాలపై సీఐడీతో విచారణ

అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

వేల కోట్లు నష్టం చేస్తే శిక్షించకపోతే ఎలా: పవన్

ముడుపులు 3 వేల కోట్లు కావు.. 30 వేల కోట్లు: బీజేపీ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో మద్యం అమ్మకాల్లో భయంకరమైన అవినీతి జరిగిందని ప్రభుత్వం పేర్కొంది. కేవలం కమీషన్ల రూపంలోనే రూ.3113 కోట్ల దోపిడీ జరిగిందని స్పష్టంచేసింది. ఇవి వైసీపీ పెద్దలకు ముడుపులుగా చేరాయని తెలిపింది. వీటితోపాటు గత ప్రభుత్వం తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయంలో రూ.18,860 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించింది. ఫలితంగా పక్క రాష్ట్రాలకు మద్యం ఆదాయం పెరిగిందని, మనకు ఏర్పడిన నష్టంలో ఎవరి వాటా ఎంతనేది తేలాల్సి ఉందని తెలిపింది. మొత్తంగా గత ప్రభుత్వంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ మద్యంషాపుల్లో నగదు రూపంలో నాడు లావాదేవీలను అనుమతించడాన్ని అవసరమైతే ఈడీ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేసింది. 2019-24 మధ్య కాలంలో అమలైన మద్యం పాలసీలపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ఈసారి శాసనసభ వేదికగా శ్వేతపత్రాన్ని

మిగతా 11వ పేజీలో...



మద్యంలో మహా మాయ

ఢిల్లీ స్కామ్‌ను మించిన జగన్ మద్యం దందా

ప్రభుత్వ షాపులు కేంద్రంగా అక్రమాలపర్వం

డిస్టిలరీల నుంచి నేరుగా షాపులకు సీసాలు

వాటిపై వచ్చే పన్నులు వైసీపీ నేతలకు

641 షాపుల్లో ఎన్‌డీపీఎల్ అమ్మినట్లు నమోదు

అందుకే 4 రోజులు ఆలస్యంగా నగదు జమ

మొత్తం దోపిడీ 30 వేల కోట్లుగా అంచనా

మద్యం అమ్మకాల్లో మహా మాయ జరిగిందని ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. ఇప్పటివరకూ కమీషన్ల రూపంలోనే దోపిడీ జరిగిందని అంచనా వేయగా, కొత్తగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) విక్రయించిన విషయం వెలుగులోకి వచ్చింది. అంటే డిస్టిలరీలు, బ్రూవరీల్లో తయారైన మద్యాన్ని మద్యం డిపోలకు పంపకుండా నేరుగా షాపులకు పంపి, తద్వారా వచ్చిన నగదును దారిమళ్లించినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2934 ప్రభుత్వ

మిగతా 11వ పేజీలో...



హెచ్‌వోడీలు, కార్యదర్శులు, ఉన్నతాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వ్యవస్థలను కుప్పకూల్చారు!

2014లో కంటే దారుణ పరిస్థితులు

విభజన కంటే వైసీపీ పాలనలోనే ఎక్కువ నష్టం

రూ.లక్ష కోట్ల వరకు బిల్లులు, బకాయిలు పెండింగ్

13.5% వృద్ధి రేటు సాధించిన రాష్ట్రం పరిస్థితి ఇదీ!

కేంద్రం సాయం చేస్తామనడం శుభపరిణామం

గత ప్రభుత్వం కేంద్ర నిధులను దారిమళ్లించింది

యూసీలు కూడా ఇవ్వలేదని ఢిల్లీలో చెప్పారు

అధికారులు సెన్సిటివ్‌గా పనిచేయాలి

మీమీ శాఖల్లో వ్యవస్థలను క్రియాశీలం చేయండి

యంత్రాంగానికి చంద్రబాబు దిశానిర్దేశం

ప్రత్యేక సీఎస్‌లు, ముఖ్య కార్యదర్శులు, సెక్రటరీలు, హెచ్‌వోడీలతో బాబు భేటీ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్లలో వ్యవస్థలను కుప్పకూల్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వచ్చే ఐదేళ్లూ అధికారులందరూ కష్టపడి పని చేసి రాష్ట్రాన్ని నిలబెట్టాలని కోరారు. బుధవారం సాయంత్రం సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, సెక్రటరీలు, విభాగాధిపతు(హెచ్‌వోడీ)లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనేక అంశాలను ప్రస్తావించారు. తమ ప్రభుత్వ విధానమేంటో విశదీకరించారు. యంత్రాంగం ఎలా పని చేయాలో దిశానిర్దేశం చేశారు. 2014లో కంటే దారుణమైన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. రూ.లక్ష కోట్ల వరకు బిల్లులు, బకాయిలు

మిగతా 12వ పేజీలో...



పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ఇండియా కూటమి నేతలు

విపక్ష రాష్ట్రాలపై వివక్ష

భారత సమాఖ్య వ్యవస్థ పవిత్రతపై దాడి

కేంద్ర బడ్జెట్‌పై 'ఇండియా' ఆగ్రహం

పార్లమెంటు నుంచి వాకౌట్

ప్రాంగణంలో ఎంపీల నిరసన

'మాతాజీ' మాటల నర్సరీ

బీజేపీని తిరస్కరించిన రాష్ట్రాలకు బడ్జెట్‌లో మొండిచెయ్యి

ఆ రెండు రాష్ట్రాలకే విందు: ఖర్గే

రాష్ట్రం పేరు చెప్పకపోతే నిధులు రావా?

వ్యయ ప్రకటన చదివితే వాస్తవాలు తెలుస్తాయి: నిర్మలా సీతారామన్

27న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించనున్న కాంగ్రెస్ సీఎంలు

న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల ప్రకంపనలు పార్లమెంటును కుదిపేశాయి. ఇది 'కుర్చీ బచావో' బడ్జెట్ అని, ప్రధాని మోదీ తన పదవిని కాపాడుకునేందుకే మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ పాలిస్తున్న ఆంధ్ర, బిహార్‌లకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారని.. మిగతా రాష్ట్రాలపై ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలపై తీవ్ర వివక్ష చూపారని విపక్ష ఇండియా కూటమి ఆరోపించింది. దీన్ని సమాఖ్య వ్యవస్థ పవిత్రతపైనే దాడిగా అభివర్ణిస్తూ.. ఉభయసభల నుంచి కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. బుధవారం ఉదయం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో.. బడ్జెట్ కేటాయింపుల అంశాన్ని లేవనెత్తేందుకు విపక్ష సభ్యులు యత్నించారు. ప్రశ్నోత్తరాలను అడ్డుకోవద్దని స్పీకర్ ఓం బిర్లా కోరారు. సభ్యులు సభలోకి రాకుండా

మిగతా 2వ పేజీలో...

అమరావతికి చుక్..చుక్

రాజధానిని అనుసంధానిస్తూ రూ.2,047 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం ఓకే

ఏపీకి మొత్తం రూ.9,151 కోట్ల రైల్వే బడ్జెట్

భారీఎత్తున పట్టాలెక్కిన రాష్ట్ర ప్రాజెక్టులు

అమరావతి లైన్ పరిధి 56 కిలోమీటర్లు

విజయవాడ - ఎర్రుపాలెం నుంచి అమరావతి స్టేషన్, నంబూరు వరకు నిర్మాణం

నీతి ఆయోగ్ సమ్మతి.. డీపీఆర్ దశలో ప్రాజెక్టు

అనుమతులు లభించగానే పనులు మొదలు

గత ప్రభుత్వం వల్లే విశాఖ రైల్వే జోన్ ఆలస్యం

త్వరగా భూములు గుర్తించాలని బాబును కోరాం

అమరావతి లైన్ మ్యాప్ చూపిన మంత్రి వైష్ణవ్



న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో మంగళవారం ఏపీని మురిపించిన కేంద్ర ప్రభుత్వం, ఆ మరునాడే రాష్ట్రానికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పలు రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేసింది. రూ.2,047 కోట్లు రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే లైన్ కోసమే వెచ్చించనుండటం విశేషం. ఏపీలో రైల్వేల మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.9,151 కోట్లను కేటాయించామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009-14 మధ్య ఐదేళ్లకు సగటున రూ.886 కోట్లు కేటాయించగా, తాము ఈ ఒక్క ఏడాదే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అంతకు పది రెట్లకు పైగా నిధులు కేటాయించామని ఆయన వివరించారు. ఏపీలో మొత్తం రైల్వే విద్యుదీకరణ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం రూ.73,743 కోట్ల వ్యయంతో 5,329 కిలోమీటర్ల మేరకు

మిగతా 12వ పేజీలో...

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు

హెల్త్ వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ

ఏకగ్రీవంగా రాష్ట్ర శాసనసభ తీర్మానం

టైటిల్ చట్టం భయంకరమైనది

ప్రజలకిచ్చిన మాట మేరకు రద్దుచేశాం: సీఎం

అధికారమదంతో జగన్ బొమ్మలు: అనగాని

11



నామినేటెడ్ పోస్టులపై కూటమిలో ఒప్పందం!

టీడీపీ ఎమ్మెల్యేలున్న చోట 60% పదవులు ఆ పార్టీవారికే

30% జనసేనకు, మిగతా పోస్టులు బీజేపీకి

జనసేన ఎమ్మెల్యేలున్న చోటా ఇదే సూత్రం వర్తింపు

2

బీజేపీ సభ్యులున్న స్థానాల్లో ఆ పార్టీకి 50 శాతం.. మిగతావి టీడీపీ, జనసేనకు

ఢిల్లీలో ధర్నా చేస్తున్న వైసీపీ అధినేత జగన్‌తో ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్



ఢిల్లీ వీధుల్లో జగన్ ధర్నా

మేం ప్రతీకార చర్యలు ప్రోత్సహించలేదు

ఏపీలో హింసాకాండ అని ఆక్రోశం

కార్యక్రమం ఆసాంతం సమన్వయ లోపం

జనంలేకపోవడంతో జగన్ అసహనం

బీజేపీ వ్యతిరేక పార్టీల మద్దతు

న్యూఢిల్లీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి... అధికారం పోయిన ఆరు వారాలకే 'ఏపీలో హింసాకాండ' అంటూ ఢిల్లీ వీధుల్లో ధర్నాకు దిగారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ బుధవారం జంతర్‌మంతర్ వద్ద

మిగతా 11వ పేజీలో...



డొనాల్డ్ ట్రంప్‌పై కమల పైచేయి

ఓటర్లలో పెరుగుతున్న ఆదరణ

అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అవకాశం

వెల్లడిస్తున్న ప్రీ పోల్ సర్వేలు

వాషింగ్టన్, జూలై 24: అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోవటంతో ముందుకొచ్చిన కమలా హ్యారిస్.. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఓడించి చరిత్ర సృష్టించే అవకాశం ఉందని ప్రీపోల్ సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాయిటర్స్, ఇప్సాస్ సంస్థలు మంగళవారం నిర్వహించిన పోల్‌లో.. ట్రంప్‌నకు 42 పాయింట్లు లభించగా, కమలకు 44 లభించాయి. పీబీఎస్ న్యూస్, ఎన్‌పీఆర్,


మిగతా 2వ పేజీలో...

జాబిలిపై నీటి జాడలు!

చంద్రుడిపై నుంచి తెచ్చిన మట్టిలో గుర్తించిన చైనా శాస్త్రవేత్తలు



2



పెద్దిరెడ్డి ఖాతాలో 'అసైన్డ్'

భార్య స్వర్ణలత పేరిట 20 ఎకరాలు

రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే కొనుగోలు

మార్కెట్ విలువ 100 కోట్లకు పైనే

2022 సెప్టెంబరులో వ్యవహారం

చుట్టూ 100 ఎకరాల ప్రభుత్వ భూములు

దాని మధ్యలోనే అసైన్డ్ భూమి

3

ముమ్మరంగా విచారణ

మదనపల్లెలో మూడో రోజూ కొనసాగింపు

అక్కడే సిసోడియా మకాం

ఫైళ్లు కాలిన ప్రాంతంలో పరిశీలన

వీఆర్‌కు వన్‌టౌన్ సీఐ

12

మరో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఆర్డీవోల డ్రైవర్లు, మాధవరెడ్డి బంధువుల ఇళ్లలోనూ పోలీసుల సోదాలు

ఘటనపై ఆర్డీవోలు, సిబ్బందితో ఆరా

22వ సెక్షన్‌లో ఫైళ్లపై అధికారుల విచారణ



కుప్పకూలిన విమానం

నేపాల్‌లో దుర్ఘటన.. పైలట్ మినహా మిగిలిన 18 మంది దుర్మరణం

మృతులంతా శౌర్య ఎయిర్‌లైన్స్ సిబ్బంది

మెయింటెనెన్స్ చెకప్ కోసం ప్రయాణం

2

నామినేటెడ్ పోస్టులపై కూటమిలో ఒప్పందం!

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి టీడీపీ కూటమి పార్టీల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే టికెట్లు ఆశించి నిరాశకు లోనైన నాయకులు టీడీపీ, జనసేనల్లో చాలా మందే ఉన్నారు. వీరిలో పలువురు ఈ పోస్టుల కోసం పోటీపడుతున్నారు. అటు నియోజకవర్గాల స్థాయిలోని నామినేటెడ్ పదవులపైనా అనేక మంది ఆశలు పెట్టుకున్నారు. వీటి భర్తీపై మూడు పార్టీల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టీడీపీ ఎమ్మెల్యేలున్న చోట 60 శాతం నామినేటెడ్ పోస్టులు ఆ పార్టీ కార్యకర్తలకే దక్కుతాయి. 30 శాతం జనసేన శ్రేణులకు, మిగతా పదవులు బీజేపీ కార్యకర్తలకు ఇస్తారు. అలాగే జనసేన ఎమ్మెల్యేలున్న చోట 60 శాతం పోస్టులు ఆ పార్టీకే. 30 శాతం పోస్టులు టీడీపీకి, 10శాతం బీజేపీ వారికి కేటాయిస్తారు. బీజేపీ ఎమ్మెల్యేలున్న చోట ఆ పార్టీకి 50 శాతం పదవులు, మిగిలిన 50 శాతం టీడీపీ, జనసేనలకు దక్కుతాయని సమాచారం. జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు బుధవారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పోస్టుల సర్దుబాటుపై స్పష్టత ఇచ్చారు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేసిన నాయకులను గుర్తు పెట్టుకుంటామన్నారు. ఎమ్మెల్యేలంతా కష్టపడిన వారికి గుర్తింపు ఇవ్వాలని, పదవుల భర్తీలో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి, వారి వివరాలు పంపించాలని కోరారు. కాగా.. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై, ప్రజాసేవ చేయాలనే ఆలోచన ఉన్న వైసీపీ నాయకులను చేర్చుకునేందుకు నాగబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే టీడీపీ, జనసేన నాయకులపై కేసులు పెట్టని వారిని, వారిని ఇబ్బందులకు గురి చేయని వారిని గుర్తించి, పూర్తి స్థాయిలో విచారించిన తర్వాతే చేర్చుకోవాలని తేల్చిచెప్పారు. పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడంతో పాటు కేసులు నమోదైన వారి వివరాలూ పంపించాలని కోరారు.

సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు

» ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లను నామమాత్రం చేసిన గత పాలకులు, వారి అనుచరులు పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు గ్రామ సర్పంచ్ బూదూరు లక్ష్మి... మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ నాయకులు తనను బెదిరించి కులదూషణలు చేశారని, తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని పవన్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ముత్తుకూరు సర్పంచ్ తనకు ఎదురైన ఇబ్బందులు, అవమానాలను వివరించారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ దీనిపై వెంటనే పూర్తి వివరాలు తనకు అందించాలని అధికారులను ఆదేశించానన్నారు. సంతకాల ఫోర్జరీపై విచారణ చేపడతామని, కులదూషణలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైసీపీకి కిలారి రోశయ్య రాజీనామా

» గుంటూరు ఎంపీగా పోటీచేసి ఓడిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య వైసీపీకి రాజీనామా చేశారు. కేంద్ర మాజీ మంత్రి, శాసన మండలిలో వైసీపీ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు ఈయన స్వయానా అల్లుడు. రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచీ వైదొలగుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు పార్టీ అధినేత జగన్‌కు లేఖ రాశారు. 2019-24 నడుమ పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న రోశయ్య.. గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అవినీతి అక్రమాలతో అప్రతిష్ఠ మూటకట్టుకున్నారు. అక్రమ తవ్వకాలతో వందల కోట్లు ఆర్జించినట్లు అప్పట్లో టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పలుమార్లు ధ్వజమెత్తడమే కాకుండా అక్రమ తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. అయినా రోశయ్య ఆధ్వర్యంలో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగింది. అంతేకాకుండా ఉద్యోగుల నియామకాల సమయంలోనే కాకుండా వారి నెలవారీ ఆదాయంలో వాటా కోసం ఆయన ఒత్తిడి చేయడంతో ఆ నియోజకవర్గంలో పనిచేసేందుకు అధికారులు భయపడి పరారయ్యారు. తన మాట విననందుకు పలువురు ఉద్యోగులను కేసుల్లో ఇరికించడంతో సుమారు 30మంది సస్పెండై ప్రస్తుతం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పొన్నూరులో ఆయన గెలవరని భావించిన జగన్.. అయన్ను అక్కడి నుంచి మార్చి గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దించారు. రోశయ్యకు ముందు ఆయన బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణకు గుంటూరు ఎంపీ టికెట్ ఖరారు చేసినా.. గెలిచే అవకాశాల్లేవని ఆయనే పోటీకి నిరాకరించారు. ఎవరూ దొరకని పరిస్థితుల్లో రోశయ్యను పోటీచేయించారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అయన్ను చిత్తుచిత్తుగా ఓడించి 3.40 లక్షలకుపైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రోశయ్య ప్రస్తుతం టీడీపీ కూటమిలోని ఏ పార్టీలోనూ చేరే అవకాశం లేనప్పటికీ.. వైసీపీలో కొనసాగితే అక్రమ తవ్వకాల కేసులు వెంటాడతాయనే భయంతో ఆ పార్టీకి దూరమైనట్లు ప్రచారం జరుగుతోంది.

జగన్ డ్రామాలు జనం నమ్మరు

» క్రిమినల్స్‌ను వెంట పెట్టుకుని శాంతిభద్రతలపై మాట్లాడతారా?

» టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల, శబరి, కలిశెట్టి, నాగరాజు ఫైర్

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ ఢిల్లీలో ధర్నా చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై టీడీపీ ఎంపీలు మండిపడ్డారు. ఆయన నాటకాలను జనం నమ్మరని.. ఆయన ఐదేళ్ల విధ్వంసకర పాలనలోనే శాంతి భద్రతలు అస్సలు లేవని చెప్పారు. బుధవారమిక్కడ టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, నాగరాజు, బైరెడ్డి శబరి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు జగన్ ఎందుకు స్పందించలేదని దగ్గుమళ్ల ప్రశ్నించారు. ఆయనకు రాజ్యాంగంతో పాటు.. ప్రజాస్వామ్య విలువలపైనా గౌరవం లేదని విమర్శించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఏపీ అభివృద్ధి కోసం ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు చేసి ఉంటే బాగుండుండేమోనన్నారు. జగన్ తీరు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఎన్నాళ్లు శవరాజకీయాలు చేస్తారని శబరి నిలదీశారు. తండ్రి వివేకా దారుణహత్యకు గురైతే న్యాయం చేయాలని సొంత చెల్లెలైన సునీత ప్రాధేయపడినా జగన్ న్యాయం చేయలేదని విమర్శించారు. క్రిమినల్స్‌ను వెంట పెట్టుకుని లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడడమేంటని ఎద్దేవాచేశారు. వైసీపీకి చెందిన రౌడీషీటర్ల వ్యక్తిగత గొడవను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఆయనకు మానసికంగా ఏమైనా సమస్య ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. తన పార్టీకి చెందిన నేరస్థులను రక్షించేందుకే జగన్ సీఎంగా ఢిల్లీ పర్యటనలు చేశారని ఆరోపించారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో యావద్దేశం ఏపీ వైపు చూస్తోందని.. ఇందుకు వైసీపీ నాయకులు కూడా చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నారని చెప్పారు. వైసీపీ పాలనలో ఎంతటి విధ్వంసం జరిగిందో చరిత్ర తెలుసుకోవాలని జగన్‌కు అప్పలనాయుడు హితవు పలికారు. ఇకనైనా బూటకపు రాజకీయాలను మానుకోవాలని నాగరాజు సూచించారు. ప్రతిపక్ష హోదా కావాలని జగన్ కోర్టుకెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు.

ఎయిడెడ్ స్కూళ్లలో నకిలీ ఎన్‌రోల్‌మెంట్!

» తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ ఆదేశం

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో నకిలీ విద్యార్థుల నమోదు జరిగినట్లు పాఠశాల విద్యాశాఖ దృష్టికి వచ్చింది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులుగా చూపిస్తున్న విషయంపై విచారణ జరపాలని ఆర్జేడీలు, డీఈవోలను పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. అన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి విద్యార్థుల నమోదును పరిశీలించాలని, ఎక్కడైనా నకిలీ ఎన్‌రోల్‌మెంట్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

విపక్ష రాష్ట్రాలపై వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

విపక్ష ఎంపీలు మెట్ల వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్నారని ఆయనతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రస్తావించారు. కేటాయింపుల అంశాన్ని ప్రస్తావించనివ్వడం లేదంటూ విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. రాజ్యసభలోనూ విపక్ష పాలిత రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడంపై ఇండియా కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 267 నిబంధన కింద ప్రశ్నోత్తరాలు, ఇతర ఎజెండాను సస్పెండ్ చేసి ఈ అంశంపై చర్చించాలని నోటీసు ఇచ్చారు. దానిని సభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 2024-25 బడ్జెట్‌లో బిహార్, ఆంధ్రకు మాత్రమే నిధులు, పథకాలు ఇచ్చారు. మిగతా రాష్ట్రాల ప్రస్తావనే లేదు. ఈ బడ్జెట్ 'కుర్సీ బచావో డాక్యుమెంట్' అని ఆరోపించారు. ఈ వివక్షను కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలు ఖండిస్తున్నాయన్నారు. దీనిపై స్పందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు చైర్మన్ అవకాశమిచ్చారు. ఆమె మాట్లాడేందుకు లేవగానే విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. వారి ఆరోపణలు దారుణమని నిర్మలా సీతారామన్ ఆక్షేపించారు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించనంత మాత్రాన విస్మరించినట్లు అవుతుందా అని ప్రశ్నించారు. తమ రాష్ట్రాలకు మోదీ ప్రభుత్వం ఏమీ చేయలేదని ప్రజల్లో నాటేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తాజా బడ్జెట్‌లోనే కాదని.. ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు కూడా తాను చాలా రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదన్నారు. దానర్థం కేంద్ర పథకాలు ఆ రాష్ట్రాల్లో అమలు కావడం లేదనా అని నిలదీశారు. ఈ రెండు బడ్జెట్లలో మహారాష్ట్ర పేరును కూడా తాను ప్రస్తావించలేదని.. అయినా ఆ రాష్ట్రంలో రూ.76 వేల కోట్ల భారీ పెట్టుబడితో వధావన్ పోర్టు ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించిందని గుర్తుచేశారు. 'ఫలానా రాష్ట్రం పేరు బడ్జెట్‌లో ప్రస్తావించలేదని.. కేంద్రప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రపంచబ్యాంకు, ఏడీబీ, ఏఐఐబీ తదితర ఆర్థిక సంస్థల ద్వారా అమలు చేసే విదేశీ రుణ సాయం ప్రాజెక్టులు (ఈఏపీ) ఈ రాష్ట్రాలకు రావా? ప్రభుత్వం ఇచ్చిన వ్యయ ప్రకటన చూస్తే దేనికెంత కేటాయింపులు జరిపారో తెలుస్తుంది. దమ్ముంటే గతంలో కాంగ్రెస్ ఆర్థిక మంత్రులు చేసిన బడ్జెట్ ప్రసంగాలను ఇవ్వండి. వాటిలో ప్రతి రాష్ట్రం పేరును వారు ప్రస్తావించారా? ఇది దారుణమైన ఆరోపణ. ఆమోదనీయం కాదు' అని స్పష్టం చేశారు. వాకౌట్ చేసిన కొందరు టీఎంసీ ఎంపీలు ఇదే సమయంలో సభలోకి వచ్చారు. బెంగాల్‌కు ఏమీ ఇవ్వలేదని వారు ఆరోపించారని.. ప్రధాని మోదీ గత పదేళ్లలో ప్రారంభించిన చాలా పథకాలు ఆ రాష్ట్రంలో అమలు కావడం లేదని నిర్మల తెలిపారు. టీఎంసీ ఎంపీలు ఖండించారు. తమ రాష్ట్రానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బకాయి ఉందని ఆరోపించారు.



మాటల్లో మాతాజీ ఎక్స్‌పర్ట్

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా నిర్మలపై ఖర్గే విమర్శలు సంధించారు. ఆమెను 'మాతాజీ' అని సంబోధించారు. 'మాతాజీ మాటలు చెప్పడంలో నేర్పరి అని నాకు తెలుసు' అని ఎద్దేవాచేశారు. చైర్మన్ ధన్‌ఖడ్ స్పందిస్తూ.. నిర్మలను అమ్మలా కాకుండా కుమార్తెగా చూడాలని ఖర్గేకు సూచించారు. ప్రతిపక్ష నేత తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. దేశ అవసరాల కోసం కాకుండా.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం బడ్జెట్ పెట్టారని ధ్వజమెత్తారు. 'మోదీ సర్కారు బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ ప్రయోజనం కలుగలేదు. తమిళనాడు, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రధాన రాష్ట్రాలను విస్మరించారు. ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించిన రాష్ట్రాలకు ఏమీ ఇవ్వలేదు. ప్రతి వారి ప్లేటు ఖాళీ. రెండు రాష్ట్రాల ప్లేట్లలో మాత్రం పకోడీ, జిలేబీ పెట్టారు. ఇలాంటి బడ్జెట్ నేను ఇప్పటివరకు చూడలేదు' అని ఎద్దేవాచేశారు.

పార్లమెంటు మెట్ల వద్ద విపక్ష ఎంపీల నిరసన

బుధవారం పార్లమెంటు మకర ద్వారం మెట్ల వద్ద విపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. ఇతర రాష్ట్రాలను విస్మరించడం.. భారత సమాఖ్య పవిత్రతపైనే దాడి అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా విమర్శించారు. ఈ నిరసనలో ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీ, ఉభయసభల్లో ఆ పార్టీ ఉపనేతలు ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగోయ్, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ (ఎస్సీపీ) నాయకుడు శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్, టీఎంసీ, డీఎంకే, జేఎంఎం, ఆప్, సీపీఎం తదితర విపక్ష ఎంపీలు పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ భేటీ బహిష్కరణ

బడ్జెట్‌లో విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని, ఇది ప్రమాదకరమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరించిందని, ఇందుకు నిరసనగా శనివారం (27న) ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ భేటీని కాంగ్రెస్ రాష్ట్రాల సీఎంలు బహిష్కరిస్తారని చెప్పారు.

మాల్దీవులకు 'సాయం'లో కోత

» గతంలో రూ.770 కోట్లు.. ఇప్పుడు రూ.400 కోట్లే

న్యూఢిల్లీ, జూలై 24: కేంద్ర బడ్జెట్ 2024-25లో మాల్దీవులకు మోదీ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. 'పొరుగుకే మొదటి ప్రాధాన్యం' విధానం కింద అభివృద్ధి సాయం నిధుల్లో భూటాన్‌కు రూ.2,068 కోట్ల అత్యధిక వాటా కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో మాల్దీవులకు రూ.770.9 కోట్లు కేటాయించగా ఇప్పుడు దాన్ని రూ.400 కోట్లకు పరిమితం చేసింది. ఈ కేటాయింపు చేయడం ద్వారా గ్రేటర్ మాలే కనెక్టివిటీ ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులకు ఆ దేశంతో ఉన్న ఉద్రిక్తతలను కేంద్రం అడ్డంకిగా మారనివ్వలేదు. అలాగే మాల్దీవులకు కేటాయింపులన్నీ రుణంగా కాకుండా గ్రాంటు రూపంలో ఇచ్చింది. చైనా అనుకూలుడుగా ముద్రపడిన మయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడైన తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన విషయం తెలిసిందే. భూటాన్ తర్వాత అత్యధికంగా నేపాల్‌కు రూ.700 కోట్లు కేటాయించారు. మారిషస్‌కు రూ.370 కోట్లు, మయన్మార్‌కు రూ.250 కోట్లు, శ్రీలంకకు రూ.245 కోట్లు చొప్పున కేంద్రం బడ్జెట్‌లో అభివృద్ధి సాయం ప్రకటించింది. ఇరాన్‌లో చాబహార్ పోర్టు నిర్వహణకు రూ.100కోట్లు మంజూరు చేసింది. తాజా బడ్జెట్‌లో విదేశాలకు అభివృద్ధి సాయం కింద భారత్ మొత్తం రూ.4,883.56 కోట్లు కేటాయించింది.

ఎంపిక చేసిన హైవేలపై జీఎన్‌ఎస్ఎస్ టోల్ వసూలు

న్యూఢిల్లీ, జూలై 24: ఎంపిక చేసిన జాతీయ రహదారులపై టోల్ వసూలుకు ఫాస్టాగ్‌ను కొనసాగిస్తూనే గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (జీఎన్ఎస్ఎస్) విధానాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. బుధవారం కేంద్ర రోడ్డు రవాణా మంత్రి గడ్కరీ రాజ్యసభలో లిఖిత పూర్వక సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని ప్రయోగాత్మకంగా కర్ణాటకలోని ఎన్‌హెచ్-275లోని బెంగళూరు-మైసూరు సెక్షన్, హరియాణాలోని ఎన్‌హెచ్-709లోని పానిపట్-హిసార్ సెక్షన్‌లో అమలు చేసి దాని ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం' అని వివరించారు. మరో ప్రశ్నకు సమాధానిస్తూ.. '697 ప్రాజెక్టులు పూర్తి కావాల్సిన గడువు తేదీలను దాటాయి. భూసేకరణ సమస్యలు, అనుమతులు, ఆక్రమణల తొలగింపు, ప్రకృతి విపత్తులే ఇందుకు కారణం' అన్నారు.

లోకం తీరు



భారత్‌లోని దగ్గు మందులు నాసిరకం..!

నాణ్యతా పరీక్షల్లో 100కుపైగా శాంపిల్స్ విఫలం

న్యూఢిల్లీ, జూలై 24: భారత్‌లోని వందకుపైగా ఫార్మా సంస్థల నుంచి సేకరించిన దగ్గు మందు శాంపిల్స్.. నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయని ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. గాంబియా, ఉజ్బెకిస్థాన్, కామెరూన్‌లలో చిన్నారుల మరణానికి కారణమైన దగ్గు మందుల్లో కనిపించిన విషపూరిత పదార్థాలు వీటిలోనూ కనిపించాయని ఈ నివేదిక పేర్కొంది. ఈ దగ్గు మందుల్లో డైథిలీన్ గ్లైకాల్, ఇథలీన్ గ్లైకాల్, సూక్ష్మజీవుల పెరుగుదల వంటి సమస్యలను గుర్తించడంతో సీడీఎస్‌సీవో వాటిని ప్రామాణిక నాణ్యత లేని (ఎన్ఎస్‌క్యూ) మందులుగా వర్గీకరించింది. భారత్‌లో తయారైన దగ్గు మందుల కారణంగా వివిధ దేశాల్లో 141 మంది చిన్నారులు మృతిచెందారన్న ఆరోపణల నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా ఫార్మా కంపెనీల్లో శాంపిల్స్‌ను సేకరించి ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

జాబిలిపై నీటి జాడ గుర్తించిన చైనా

బీజింగ్, జూలై 24: చైనా శాస్త్రవేత్తలు చందమామపై నీటి జాడను గుర్తించారు. 2020లో చైనా చేపట్టిన చాంగ్‌ఈ-5 మిషన్‌లో భాగంగా చంద్రుడి ఉపరితలం నుంచి తీసుకొచ్చిన మట్టిలో నీటి అణువులను కనుగొన్నారు. ఆ మట్టిలో వెయ్యికి పైగా అణు నిర్మాణాలను గుర్తించిన శాస్త్రవేత్తలు వాటిల్లో స్ఫటికల్లా ఉన్న అన్‌నోన్ లూనార్ మినరల్(యూఎల్ఎం-1)లో నీటి అణువులను గుర్తించారు. ఆ నీటి అణువులు రాకెట్ల నుంచి వెలువడిన పొగ వంటి భూసంబంధ కారకాల వల్ల ఏర్పడినవి కాదని కూడా తేల్చారు. బీజింగ్ నేషనల్ ల్యాబొరేటరీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చంద్రుడి నుంచి తెచ్చిన మట్టిపై ఉమ్మడిగా చేసిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది.

పూజా ఖేద్కర్ అదృశ్యం!

» సెల్‌ఫోన్‌నూ ఆఫ్ చేసిన ట్రైనీ ఐఏఎస్



ముంబై, పుణె, న్యూఢిల్లీ, జూలై 24: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీలో మంగళవారంలోగా ఆమె రిపోర్టు చేయాలని గడువు విధించగా, గడువు ముగిసినా ఆమె అకాడమీకి రాలేదు. ఆమె సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో ఆమెపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే సివిల్ సర్వీస్ పరీక్షల దరఖాస్తులో తప్పుడు వివరాలతో మోసగించారంటూ యూపీఎస్‌సీ ఆమెపై క్రిమినల్ కేసు పెట్టింది. లెక్కల్లో చూపని ఆస్తులకూ ప్రభుత్వ చిహ్నాలను వాడుకోవడం ద్వారా నిబంధనలు ఉల్లంఘించిన కేసులు కూడా పూజ, ఆమె తల్లిదండ్రులపై నమోదయ్యాయి. కాగా, పూజాకు దివ్యాంగ సర్టిఫికెట్ ఇచ్చిన పుణెలోని యశ్వంత్‌రావు చవాన్ మెమోరియల్ ఆస్పత్రి ఇందులో తామేమీ తప్పు చేయలేదని ప్రకటించింది.

సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్

న్యూఢిల్లీ, జూలై 24: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్ కలిగిన దేశాల జాబితాలో సింగపూర్ మళ్లీ అగ్రస్థానం దక్కించుకుంది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ అనే సంస్థ తాజాగా విడుదల చేసిన ఈ జాబితాలో భారత్ మూడు స్థానాలు మెరుగై 82వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ 85వ స్థానంలో నిలిచింది. భారత పాస్‌పోర్టు ఉన్నవారిని వీసా లేకుండా 58 దేశాలకు అనుమతిస్తారు. భారత్‌తోపాటు సెనెగల్, తజికిస్థాన్ కూడా సంయుక్తంగా 82వ స్థానంలో నిలిచాయి. కాగా, ఈ జాబితాలో సింగపూర్ తన టాప్ ర్యాంకును నిలబెట్టుకుంది. సింగపూర్ పాస్‌పోర్టుతో ప్రపంచంలోని 195 దేశాలకు వీసా లేకుండా వెళ్లవచ్చు. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, స్పెయిన్ దేశాల పాస్‌పోర్టులు సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల పాస్‌పోర్టులతో 192 దేశాలకు వీసా లేకుండా వెళ్లి రావొచ్చు.

రైతుల డిమాండ్లపై కమిటీ వేయండి

మీ సర్కార్‌పై వారికి విశ్వాసం లేనట్టుంది.. రైతుల దగ్గరకు మీరు ఎందుకు వెళ్లరు?

» హరియాణా సర్కార్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న

» రైతులకోసం శంభు సరిహద్దు తెరవాలన్న హైకోర్టు ఉత్తర్వులపై వారంపాటు స్టే

న్యూఢిల్లీ, జూలై 24 : రైతుల పంటలకు ఇచ్చే కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించే అంశాన్ని పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటుచేయాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. పలు సాగు అంశాలపై ఈ రెండు రాష్ట్రాల రైతాంగం పోరాడుతున్న విషయం తెలిసిందే. ఢిల్లీ పొలిమేరల్లోని శంభు సరిహద్దు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి శిబిరాలు వేసుకుని రైతులు ఉంటున్నారు. అక్కడి సరిహద్దులను అదే రోజున హరియాణా ప్రభుత్వం మూసివేసింది. దీనిపై రైతులు న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. అడ్డంగా పెట్టిన బారికేడ్లను తొలగించి రైతుల కోసం సరిహద్దులను తెరవాలని ఈ నెల 10న పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హరియాణా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాల అమలును సుప్రీంకోర్టు ఒక వారంపాటు నిలుపుదల (యథాతథ స్థితి) చేసింది. హరియాణా తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. "సరిహద్దులు తెరిచి ఆందోళన చేస్తున్న రైతులను ఢిల్లీలోకి అనుమతిస్తే శాంతిభద్రతలు అదుపు తప్పే ప్రమాదం ఉంది. దాదాపు 500-600 ట్యాంకులు శంభు సరిహద్దుల్లో నిలిపి ఉంచారు. అవి సాయుధీకరించిన ట్యాంకులు" అని తెలిపారు. అయితే, ట్యాంకులు, ట్రాక్టర్లు లేకుండా రైతులు ఢిల్లీకి వెళితే సరిపోతుందా అని కోర్టు ప్రశ్నించింది. రైతులకు, ప్రభుత్వానికి మధ్య విశ్వాసం సమస్యగా ఉన్నట్టు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. రైతుల వద్దకు ప్రభుత్వం వెళితే..వాళ్లెందుకు ఢిల్లీ దాకా వస్తారని ప్రశ్నించింది.

రాహుల్‌ను కలిసిన రైతులు



కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సహా పలు సాగు అంశాలపై ఉద్యమిస్తున్న రైతులు బుధవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్‌గాంధీని కలిశారు. రైతుల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ తొలినుంచీ మద్దతు ఇస్తోందని వారికి రాహుల్ తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాకు చెందిన ప్రతినిధులు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో, రైతుల డిమాండ్లపై 'ఇండియా' పార్టీలతో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

అన్నపై కక్షతో తమ్ముడి ఉన్మాదం

» వదినను, ఆమె ఇద్దరు కుమార్తెలను నరికి చంపిన టెకీ.. ఆపై ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), జూలై 24: తిరుపతిలో దారుణం చోటుచేసుకుంది. అన్నపై కక్షతో ఓ తమ్ముడు ఉన్మాదిలా మారాడు. అన్న భార్యను, వారి ఇద్దరి కూతుళ్లను కత్తితో నరికి దారుణంగా హతమార్చాడు. అనంతరం తానూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి పద్మావతీ నగర్‌లో నివాసముంటున్న సునీత(35), కుమార్తెలు దేవిశ్రీ(13), నీరజ(11) దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో ఉన్న ఈ ముగ్గురినీ సునీత మరిది మోహన్ బుధవారం రాత్రి కత్తితో నరికి చంపాడు. ఆపై అదే గదిలో ఫ్యానుకు ఉరేసుకుని తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొలుత వదినపై దాడి చేసి కత్తితో నరకగా అక్కడే ఉన్న పిల్లలిద్దరూ భయంతో అరిచి కేకలు పెట్టినట్టు తెలిసింది. కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా తలుపులు లోపలి నుంచి లాక్ చేసిన మోహన్.. పిల్లలిద్దరినీ నరికి చంపినట్టు సమాచారం. స్థానికులు తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లే సరికి సునీత, ఆమె ఇద్దరు పిల్లలు రక్తపు మడుగులో విగత జీవులై పడివుండగా మోహన్ ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయి కనిపించాడు. కాగా, మోహన్ అన్న దాసు 2019లో మోహన్‌కు పెళ్లి చేశాడని, ఆ సంబంధం మోహన్‌కు నచ్చకపోయినా దాసు నచ్చజెప్పి బలవంతంగా పెళ్లి చేశాడని సన్నిహితులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మోహన్‌కు పెళ్లయ్యాక ఓ బిడ్డ కలిగిందని, తర్వాత భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వారు విడిపోయారని అంటున్నారు. తనకు ఇష్టం లేని పెళ్లి చేసినందునే తాము విడిపోయామని మోహన్ తరచూ అన్నతో గొడవ పడేవాడని చెబుతున్నారు. తనకు భార్యాబిడ్డలు లేకుండా పోగా తన అన్న మాత్రం భార్యాబిడ్డలతో సంతోషంగా వుండడం చూసి కక్ష పెంచుకుని, ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు చెబుతున్నారు.



భర్త దాసుతో సునీత, ఇద్దరు పిల్లలు(ఫైల్)

నేపాల్‌లో కుప్పకూలిన విమానం



విమానం కూలిన స్థలంలో శకలాలు

» 18 మంది దుర్మరణం.. పైలట్‌కు తీవ్ర గాయాలు

» ప్రమాదం సమయంలో విమానంలో 19 మంది

» బాధితులందరూ శౌర్య ఎయిర్‌లైన్స్ సిబ్బందే

» మెయింటెనెన్స్ చెకప్ కోసం విమానంలో ప్రయాణం

కాఠ్మాండూ, జూలై 24: నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. కాఠ్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ విమానం టేకాఫ్ అవుతుండగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది అక్కడికక్కడే చనిపోయారు. పైలట్ మనీశ్ ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన కళ్లకు, నుదురుకు గాయాలయ్యాయని, ప్రాణానికి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. నేపాల్‌లోని శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ సీఆర్‌జే-200 విమానం బుధవారం ఉదయం 11.15 గంటలకు త్రిభువన్ ఎయిర్‌పోర్టు నుంచి పొఖారాకు బయల్దేరింది. టేకాఫ్ అయిన క్షణాల్లోనే అదుపుతప్పి కూలిపోయింది. విమానం నేలను తాకగానే మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో ఉన్నవాళ్లంతా శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన సిబ్బందేనని ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ చీఫ్ అర్జున్ చాంద్ తెలిపారు. వీరిలో ఇద్దరు విమాన సిబ్బంది కాగా, 17 మంది టెక్నీషియన్లని పేర్కొన్నారు. రొటీన్‌గా చేసే నిర్వహణా పరీక్షల(మెయింటెనెన్స్ చెకింగ్) కోసం వారు ఆ విమానంలో ఎక్కారని తెలిపారు. విమానం కూలిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, విమానం ఎగరగానే ఎడమవైపు తిరగాల్సి ఉండగా అదుపు తప్పి కుడివైపు తిరిగిందని, వెంటనే కూలిపోయిందని త్రిభువన్ ఎయిర్‌పోర్టు సిబ్బంది తెలిపారు. నేపాల్‌లో గడిచిన 30 ఏళ్లలో 720 విమాన ప్రమాదాలు జరిగాయి. గేతడాది పొఖారా విమానాశ్రయంలో యతి ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం కూలిపోయి 72మంది దుర్మరణం పాలయ్యారు. కాగా, తాజా విమాన ప్రమాదానికి ఎయిర్‌పోర్టులోని టేబుల్ టాప్ రన్‌వేనే కారణమని నిపుణులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టుల్లోనే ఎత్తైన ప్రదేశంలో ఉండే రన్‌వేలను టేబుల్ టాప్ రన్‌వేలు అంటారు. వీటిపై టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో పైలట్లు అప్రమత్తతతో వ్యవహరించాలి. నేపాల్‌లో జరిగిన విమాన ప్రమాదాల్లో ఎక్కువగా టేబుల్‌టాప్ రన్‌వేలపైనే జరిగినట్లు గణాంకాలు చెప్తున్నాయి.

డొనాల్డ్ ట్రంప్‌పై కమల పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

మారిస్ట్ సంయుక్తంగా నిర్వహించిన మరో సర్వేలో ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనబోతోందని వెల్లడైంది. ఈ సర్వేలో ట్రంప్‌నకు 46% మంది మద్దతు లభించగా, కమలకు 45% మంది ఓటర్లు మద్దతు తెలిపారు. పోటీ నుంచి బైడెన్ తప్పుకోవటం సరైన నిర్ణయమని పార్టీలకు, వయసులకు అతీతంగా పలువురు ఓటర్లు పేర్కొన్నట్లుగా ఈ సర్వే తెలిపింది. బైడెన్ నిర్ణయం వల్ల డెమోక్రటిక్ అభ్యర్థి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అవకాశాలు పెరిగాయని దాదాపు 41% మంది అభిప్రాయపడినట్లు వెల్లడించింది. కాగా, బరి నుంచి వైదొలుగుతున్నట్లు బైడెన్ ఆదివారం ప్రకటించిన తర్వాత కేవలం 2 రోజుల్లోనే కమలకు ఈ స్థాయిలో ప్రజాదరణ లభిస్తే.. ఎన్నికల నాటికి ట్రంప్‌పై ఆమె పూర్తి ఆధిపత్యం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. వయసు పరంగా కూడా 78 ఏళ్ల ట్రంప్ కంటే 59 ఏళ్ల కమల వైపు ఎక్కువ మంది ఓటర్లు మొగ్గు చూపే అవకాశం ఉంది. మరోవైపు, దేశాధ్యక్షుడు బైడెన్ ఎన్నికల ప్రచారం కోసం సేకరించిన నిధుల్ని కమలా హారిస్ ఉపయోగించుకోవడం చట్టబద్ధం కాదంటూ ట్రంప్ ప్రచార బృందం ఫెడరల్ ఎలక్షన్ కమిషన్(ఎఫ్ఈసీ)కు ఫిర్యాదు చేసింది. బైడెన్ సేకరించిన 91.5 మిలియన్ డాలర్లను ఎన్నికల ప్రచార నిధుల్ని కమల వినియోగించుకోవాలనుకుంటున్నారు.


విద్యార్థులను కర్రలతో కొడుతున్న సీనియర్లు





ర్యాగింగ్ పేరిట పైశాచికం

- జూనియర్లను కర్రలతో చితకబాదిన సీనియర్లు
- నరసరావుపేటలో దారుణం
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్
- రంగంలోకి పోలీసులు.. ఆరుగురు విద్యార్థులపై కేసు

నరసరావుపేట టౌన్, జూలై 24: ర్యాగింగ్ పేరిట జూనియర్లపై సీనియర్ విద్యార్థులు పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. హాస్టల్ గదుల్లో జూనియర్లను కర్రలతో చితకబాదారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల బాయ్స్ హాస్టల్‌లో జరిగిన దారుణం వెలుగుచూసింది. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన విద్యార్థి ఒకరు ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ విద్యార్థి ఎస్‌సీసీలో చేరి.. కొన్ని రోజులకే మానేశాడు. అతని తల్లిదండ్రులు ఎన్‌సీసీ చేస్తే ఉపయోగం ఉంటుందని, మళ్లీ అందులో చేరాలని ఆ విద్యార్థిపై ఒత్తిడి చేశారు. దీంతో ఆ విద్యార్థి ఎస్‌సీసీ జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ పేరిట వేధిస్తున్నారని, హాస్టల్ గదుల్లో పడేసి చితకబాదుతున్నారని చెప్పాడు. అందుకు సంబంధించిన వీడియోలను వారికి చూపించాడు. ఆ తల్లిదండ్రులు ఆ వీడియోలను తెలిసిన వారికి చూపించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అదికాస్తా పోలీసు అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు దాన్ని సీరియస్‌గా తీసుకొన్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ చింతల కృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. ఈ వీడియోలోని దృశ్యాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగినవని తెలిసిందని చెప్పారు. దీనిపై హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరగా ఆయన స్పందించేందుకు నిరాకరించారు. ర్యాగింగ్ ఘటనకు సంబంధించి ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


నందమూరులో ఎర్ర కాలువ ఉధృతికి నడుము లోతు మునిగిన వరి పొలంలోకి వెళ్లి రైతుల గోడును వింటున్న వైఎస్ షర్మిల

'హోదా' కోసం పోరాడలేదు.. ప్రతిపక్ష హోదా కావాలట!

- జగన్ కోర్టుకు వెళ్లడంపై పీసీసీ చీఫ్ షర్మిల ఎద్దేవా

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 24: 'జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం, పోలవరం కోసం ఏనాడైనా ధర్నా చేశాడా? కానీ ఇప్పుడు ప్రతిపక్ష హోదా కావాలని కోర్టుకు వెళ్లాడు. నిజంగా ప్రజల పక్షాన నిలవాలంటే అసెంబ్లీకి వెళ్లాలి. అలాకాకుండా పార్టీ మనుగడ కోసం ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడం హాస్యాస్పదం' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని నందమూరులోని ఎర్ర కాలువ వరద ముంపు బారిన పడిన పంట చేలను ఆమె పరిశీలించి మాట్లాడారు. వైఎస్ మానస పుత్రికగా రైతుల కోసం ప్రారంభించిన జలయజ్ఞం కార్యక్రమానికి జగన్ పాలనలో సమాధి కట్టారు. పాత మంచినీటి ప్రాజెక్టులకు మరమ్మతులు కూడా చేయకపోవడం దారుణం. అందువల్లే రైతులు రాష్ట్రంలో వరదలకు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటి ప్రభుత్వమైనా రాబోయే రోజుల్లో ఈ పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుని, రైతులకు నష్టపరిహారం అందించాలి' అని డిమాండ్ చేశారు. మొలలోతు నీటిలో దిగి కుళ్లిన నారును పరిశీలించి రైతుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

టీచర్ల అక్రమ బదిలీలు రద్దు: విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు హడావిడిగా చేసిన అక్రమ బదిలీలను రద్దుచేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. దీనికి సంబంధించిన రాటిఫికేషన్ ఫైలును ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు తిరస్కరించారు. ఆ ఆదేశాలను అమలుచేయాలంటూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో 917 మంది టీచర్ల బదిలీలు రద్దు అవుతాయి. ఎన్నికలకు ముందు బదిలీ చేస్తూ ఆర్డర్లు ఇచ్చినా ఎన్నికల కోడ్ రావడంతో వారిని రిలీవ్ చేయలేదు. అలాగే అప్పటి సీఎం జగన్ ఆ ఫైలును రాటిఫై చేయలేదు. తాజాగా ఆ ఫైలును సీఎం తిరస్కరించారు.

ఎక్సైజ్ ఏకీకృతం నిర్ణయంపై హర్షం

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రెండుగా విభజించిన ఎక్సైజ్ శాఖను తిరిగి ఏకీకృతం చేస్తామంటూ సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి.నర్సింహులు హర్షం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ఎవరితోనూ చర్చించకుండా శాఖను రెండు ముక్కలు చేసిందన్నారు. దానివల్ల అక్రమ మద్యం పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతిందని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడిన విషయాన్ని సీఎం స్వయంగా చెప్పారన్నారు. తమ సమస్య పరిష్కరించిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్రకు ధన్యవాదాలు తెలిపారు.

సజ్జల, పేర్నిపై కేసులు నమోదు చేయాలి

- ఐపీఎస్ సీతారామాంజనేయులు, డీటీసీ శివరాంప్రసాద్‌పై కూడా..
- అనంత ఎస్పీ మురళీకృష్ణకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు


అనంతపురం ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

అనంతపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధికార గర్వంతో తనతోపాటు తన కుమారుడు, కుటుంబ సభ్యులపై అక్రమంగా కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేసిన అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పేర్నినాని, ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు, అప్పటి అనంతపురం డీటీసీ శివరాంప్రసాద్‌పై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడిపత్రిలోని తన నివాసం నుంచి భారీ కాన్వాయ్‌తో, అనుచరులతో బుధవారం ఆయన అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి డీఎస్పీతో చర్చించారు. తనపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అక్రమంగా కేసులు నమోదయ్యాయని, వాటి వెనుక సూత్రధారులు, పాత్రధారులపై చర్యలు తీసుకోవాలని ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సజ్జల, పేర్ని నాని, సీతారామాంజనేయులు, శివరాం ప్రసాద్‌పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి తనకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీ మురళీకృష్ణకు వివరించారు. ఆ నలుగురిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు పత్రాన్ని ఎస్పీకి అందజేశారు. ఆ తర్వాత ఆయన అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చట్టం మేరకే తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరానని, న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. 15 రోజుల్లో వారిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతానని ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

పెద్దిరెడ్డి ఖాతాలో 'అసైన్డ్'

భార్య స్వర్ణలత పేరిట 20 ఎకరాలు రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే కొనుగోలు

- మార్కెట్ విలువ 100 కోట్లకు పైనే
- 2022 సెప్టెంబరులో వ్యవహారం
- చుట్టూ 100 ఎకరాల ప్రభుత్వ భూములు
- దాని మధ్యలోనే అసైన్డ్ భూమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వివిధ కంపెనీలు కొలువుతీరాయి. ఆ భూమి మధ్యలో 20.5 ఎకరాల అసైన్డ్ పొలం ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత పేరిట ఇప్పుడు ఆ భూమి ఉంది. దీని మార్కెట్ విలువ 100 కోట్ల పైమాటే. రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా సెటిల్ చేశారు. ఇప్పుడు దాని గురించి తమకు ఏమీ తెలియదంటున్నారు. 100 ఎకరాల ప్రభుత్వ భూమి మధ్యలో 20 ఎకరాల అసైన్డ్ భూమి ఎలా వచ్చి చేరింది? అది పెద్దిరెడ్డి ఇంటి పేరిట ఎలా మారింది? అంతా పరమ రహస్యం. నాటి తిరుపతి జిల్లా కలెక్టర్‌కు, జిల్లా రెవెన్యూ అధికారులకే తెలిసిన రహస్యం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏర్పేడు మండలంలో వికృతమాల గ్రామం ఉంది. ఇది రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే ఉంది. ఎయిర్‌పోర్టు భూములు, వికృతమాల భూములు పక్కపక్కనే ఉన్నాయి. వికృతమాల గ్రామ పరిధిలో 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వివిధ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలకు భూములు కేటాయించారు. అక్కడ కంపెనీల ఆఫీసులు ఏర్పాటయ్యాయి. దానిపక్కనే 524-1 సర్వే నంబరులో 2.5 ఎకరాల భూమిని 2022లో పెద్దిరెడ్డి స్వర్ణలత కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక 2022 సెప్టెంబరులో ఆ భూమి మ్యుటేషన్ చేశారు. 533, 534, 535, 536, 537 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో అనూహ్యంగా అసైన్డ్ భూమి పుట్టుకొచ్చింది. 533 సర్వే నంబరలో 5 ఎకరాలు (2007)లో, 534లో 5 ఎకరాలు 2005లో అసైన్ చేసినట్లుగా రికార్డులు తెరమీదకు తీసుకొచ్చారు. ఈ రెండు సర్వే నంబర్లలోని 10 ఎకరాల భూమి 2022 సెప్టెంబరులోనే స్వర్ణలత పేరిట మ్యుటేషన్ చేశారు. ఆ సర్వే నంబర్ల పక్కనే ఉన్న 535 నంబర్‌లో 5.1 ఎకరాల ప్రైవేటు భూమి ఉన్నట్లుగా, దాన్ని కూడా పెద్దిరెడ్డి కొనుగోలు చేసినట్లుగా రికార్డులు చూపిస్తున్నాయి. చుట్టూ ప్రభుత్వ భూమి, దాని మధ్యలో ప్రైవేటు భూమి ఉంది. ఇది ఎలా వచ్చిందో ఇక్కడ మిస్ అయిన లాజిక్. అయినా సరే పెద్దిరెడ్డి కొన్నారు. ఆయన భార్య స్వర్ణలత పేరిట రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ చేశారు. ఆ వెంటనే మరో మూడు సర్వే నంబర్లలో 536-1లో 2.86 ఎకరాలు, 537లో 5.1 ఎకరాలు, 537-1లో 2.14 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు తెరమీదకు తీసుకొచ్చారు. ఆ మూడు సర్వే నంబర్లలోని అసైన్డ్ భూమిని 2022 సెప్టెంబరులో పెద్దిరెడ్డి స్వర్ణలత పేరిట మ్యుటేషన్ చేశారు. అంటే... వికృతమాలలో 100 ఎకరాల ప్రభుత్వ భూమిలో సర్వే నంబరును మార్చి సబ్ డివిజన్ చేసి బిట్లుబిట్లుగా చేశారు. ప్రైవేటు, అసైన్డ్ భూములకు ఖాతా నంబరు (2414) ఒక్కటే. కానీ సర్వే నంబర్లు వేరుచేశారు. మొత్తం 27.7 ఎకరాల భూమి మ్యుటేషన్ చేశారు. ఇందులో 524-1 అనేది ప్రైవేటు భూమి అనుకున్నా, మిగతావన్నీ ప్రభుత్వం సేకరించి రిజర్వ్ చేసుకున్న భూములు. 533 సర్వే నంబర్‌లో అసైన్డ్ భూమిని చూపించడమే పెద్ద ట్విస్ట్. ఇదెలా సాధ్యపడింది? పైగా అసైన్డ్ భూముల మధ్య మరో 5.1 ఎకరాల భూమి ప్రైవేటుదని చూపించారు. ఇదెలా సాధ్యమైంది? మొత్తం 100 ఎకరాలు రిజర్వ్ చేసుకున్న దాంట్లో 20 ఎకరాలు అసైన్డ్ భూమి ఎక్కడి నుంచి వచ్చిందో, ఎవరి పేరిట అసైన్డ్ చేశారో రెవెన్యూ శాఖ హడావుడిగా ఏవో కొన్ని రికార్డులు తెరమీదకు తీసుకొచ్చింది. అంతే.. ఆ మొత్తం భూమి కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక పెద్దిరెడ్డి హస్తగతమయ్యాయి. నాటి తిరుపతి కలెక్టర్ ఆ భూములను 22(ఏ) నుంచి తొలగించడం, వెంటనే రెవెన్యూ అధికారులు వాటికి మ్యుటేషన్ చేయడం చకచకా జరిగిపోయాయి. ఆ భూమిని పెద్దిరెడ్డి కోరుకున్నారని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో అసైన్డ్ భూమిని పుట్టించారా? లేక అధికార బలంతో ఆ భూములను దక్కించుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది. ఇంతకుముందు ఇదే వికృతమాల గ్రామంలో ఇనాం భూమి పేరిట 120 ఎకరాల ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు పెద్దలు ప్రయత్నించగా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు భూమి చేతులు మారిన తర్వాత విషయం వెలుగులోకి వచ్చింది.

పెద్దిరెడ్డి ఎన్నిక రద్దు చేయండి

- హైకోర్టులో బీసీవై అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పిటిషన్
- ఆయన భార్యకు 142 ఆస్తులున్నాయి
- అఫిడవిట్‌లో వాటిని ప్రస్తావించలేదు
- టీడీపీ అభ్యర్థిని కూడా ప్రతివాదిగా చేర్చాలని న్యాయమూర్తి ఆదేశం
- విచారణ ఈ నెల 31కి వాయిదా

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఆయన సతీమణికి సంబంధించిన 142 ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచలేదని తెలిపారు. బుధవారం ఈ వ్యాజ్యాన్ని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తర్వాత అత్యధిక ఓట్లు పొందిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని ప్రతివాదుల జాబితాలో చేర్చకపోవడంపై అభ్యంతరం తెలిపారు. ఈ వ్యాజ్యంలో ఏం జరుగుతుందో తెలుసుకునే హక్కు ఆయనకు ఉందని.. ఆయన్ను ప్రతివాదిగా చేర్చాలని సూచించారు. మరోవైపు పెద్దిరెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో తన సతీమణికి చెందిన 142 ఆస్తులు వివరాలను ప్రకటించలేదన్న వాదనను ధ్రువీకరిస్తూ.. సివిల్ ప్రొసీజర్ కోడ్‌కు అనుగుణంగా ఆస్తుల వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని ఆదేశించారు. విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

మైనింగ్ చేసి... గుంతలు పూడ్చరా?

- కంపెనీలు, వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందే
- సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేస్తే సరిపోదు
- లీజు పొందకుండా నిషేధించడంపై తగిన ఆదేశాలివ్వాల్సిందే
- సంబంధిత కంపెనీలు, వ్యక్తుల వివరాలు మా ముందుంచండి
- గనులశాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మైనింగ్ తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చకుండా వదిలేస్తుండడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిని పూడ్చని కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పింది. తవ్వకాలు జరిపి గుంతలను పూడ్చకుండా వదిలేసిన కంపెనీలు, వ్యక్తుల సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేస్తే సరిపోదని, అలాంటివారి లీజు గడువును పొడిగించకుండా, మైనింగ్ లీజు పొందకుండా నిషేధం విధించడం పై తగిన ఆదేశాలు ఇస్తామంది. గుంతలు పూడ్చని కంపెనీలు, లీజుదారుల వివరాలను కోర్టు ముందు ఉంచాలని అధికారులను ఆదేశించింది. వారిపై ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారో చెబుతూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దానిని పరిశీలించి సదరు కంపెనీలు, వ్యక్తులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేరుస్తామంది. ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారిగా సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తిని అమికస్ క్యూరీగా నియమించింది. ఇసుక గుంతల విషయంలో ఏవి ఎం చేస్తే బాగుంటుందో చెప్పాలని అమికస్ క్యూరీని కోరింది. విచారణను ఆగస్టు 14కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామదాసుపేట, సింహాచలంనగర్, సుబ్బారావు నగర్‌లోని పలు సర్వే నెంబర్లలో స్టోన్ క్వారీయింగ్ చేసిన తరువాత ఏర్పడిన గుంతలను పూడ్చలేదని, వీటి వల్ల చిన్నారులు వాటిలో చనిపోతున్నారని పేర్కొంటూ సామాజిక కార్యకర్త బర్రె కొండబాబు 2013లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా ధర్మాసనం రాజమండ్రి గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దాఖలు చేసిన కౌంటర్‌ను పరిశీలించింది. గుంతలు పూడ్చని వారి సెక్యూరిటీ డిపాజిట్‌ను జప్తు చేస్తే సరిపోదని వ్యాఖ్యానించింది. చట్టనిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. మైనింగ్ తవ్వకాల అనంతరం గుంతలు పూడ్చకుంటే ఏమి చర్యలు ఉంటాయో టెండర్ డాక్యుమెంట్‌లో స్పష్టంగా పొందుపర్చాలని అభిప్రాయపడింది.

కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఊరట

- సీఐడీ విచారణకు ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం స్టే

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ లింగంగుంట సుమలతకు ఊరట లభించింది. అర్హతలేని 48 కాలేజీలకు అటానమస్ హోదా కల్పించారన్న ఆరోపణల విషయంలో ఆమెపై సీఐడీ విచారణకు ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల పై ధర్మాసనం స్టే విధించింది. ఈ తరహా ఉత్తర్వులు మనజాలవని పేర్కొంది. విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హతలేని 48 ఇంజనీరింగ్ కాలేజీలు అటానమస్ హోదా పొందేందుకు వీలుగా కాకినాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీలు జారీ చేశారని, ఈ వ్యవహారంపై సీబీఐ/ఈడీ తదితర వ్యవస్థలతో విచారణ జరిపించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన జోసెఫ్ శ్రీహర్ష అండ్ మేరీ ఇంద్రజ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి.కె.రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన సింగిల్ జడ్జి నోటీసులు అందుకున్నప్పటికీ వ్యక్తిగతంగా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కానీ, ఆమె తరఫున న్యాయవాది కానీ హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి కేసు నమోదు చేయాలని సీఐడీని ఆదేశించారు. కేసు దర్యాప్తు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రిజిస్ట్రార్ ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌ను ధర్మాసనం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించి విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు పై స్టే విధించింది.

శాంతిస్తున్న గోదావరి!

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కూడా వరద ఉధృతి తగ్గుముఖం
- నేటి ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం
- గోదావరికి వరద తగ్గినప్పటికీ ముంపులోనే లంక గ్రామాలు
- కుళ్లిపోయిన నారుమళ్లు.. వేల ఎకరాల్లో నీట మునిగిన వరినాట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


చింతూరు మండలంలో నాటు పడవపై వెళ్లి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

గోదావరి శాంతిస్తోంది. జోరు వానలు, ఎగువన కురిసిన వర్షాలతో కొద్దిరోజులుగా ఉగ్రరూపం దాల్చి భయాందోళనకు గురిచేసిన గోదారి వరద నెమ్మదిగా తగ్గుతోంది. భద్రాచలం వద్ద బుధవారం మధ్యాహ్నాం రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఇక్కడ నీటిమట్టం 51.60 అడుగుల వరకూ చేరి మంగళవారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టింది. బుధవారం రాత్రి 8 గంటలకు 45.10 అడుగులుగా నమోదైంది. పోలవరంలో గోదావరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 24.267 మీటర్లకు చేరుకుంది. 48 గేట్ల ద్వారా 11,82,837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద వరద ఉధృతి తగ్గుతోంది. బుధవారం రాత్రి 8 గంటలకు బ్యారేజీ నీటి మట్టం 14.50 అడుగులుగా ఉంది. బ్యారేజి నుంచి సముద్రంలోకి 13,89,724 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయానికల్లా ఈ హెచ్చరికను ఉపసంహరించే అవకాశం ఉంది. గోదావరికి వరద తగ్గినప్పటికీ ఇంకా లంకల్లో నీరు ఉంది. పోలవరం ఎగువ భాగంలో విలీన మండలాల్లో అనేక గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కోనసీమలో పరిస్థితి ఇంకా ఆందోళన రేపుతోంది. బురద కాలువ, ఎర్రకాలువ, జెల్లకాలువ, కొవ్వాడ కాలువ ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాను ఇంకా ముంపు వీడలేదు. తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, యలమంచిలి మండలాల్లోని పంట పొలాల్లో వరద నీరు తిష్ట వేసింది. నారుమడులు కుళ్లిపోతున్నాయి. దాదాపు 40 వేల ఎకరాల్లో నాట్లు ముంపు బారిన పడ్డాయి. కొత్తగా మళ్లీ సాగు చేయాలంటూ వ్యవసాయ శాఖ ప్రణాళిక చేసింది. మరోవైపు ఆచంట, యలమంచిలి మండలాల పరిధిలో లంకలకు నీరు చేరుకుంటోంది. కూరగాయల పంటల సాగు వరద నీటిలో మునిగిపోయింది. అల్లూరి జిల్లా చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గెడ్డలు, వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వరదల నేపథ్యంలో ఆరు రోజులుగా జిల్లావ్యాప్తంగా విద్యాలయాలకు సెలవులు ప్రకటించారు.


నీట మునిగిన శబరి కొత్తగూడెం

నేడు, రేపు ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో కోస్తాలో అనేక ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారాయి. దీంతో బుధవారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయి. ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్ బలంగా ఉన్నందున తీరం వెంబడి గాలులు వీస్తున్నాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

తుంగభద్రకు పెరిగిన వరద

- పది గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- ఇన్‌ఫ్లో 87,700 క్యూసెక్కులు.. నిల్వ 98.961 టీఎంసీలు


గేట్లు దాటి పరుగులు పెడుతున్న తుంగభద్రమ్మ

కర్నూలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. బుధవారం సాయంత్రం గంటల సమయంలో హోస్పేటలోని డ్యాం పది గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయానికి 18,686 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1627.21 అడుగుల వద్ద 98.961 టీఎంసీలు నిల్వ ఉంది. 87,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. తాగు, సాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీ కర్ణాటక, ఏపీ ఇంజనీర్లు ఇచ్చిన ఇండెంట్ మేరకు 388 క్యూసెక్కులు విడుదల చేశారు.

సీలేరులో రోజుకు 5-6 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి: ఏపీ జెన్‌కో

సీలేరు, జూలై 24: సీలేరు కాంప్లెక్స్ పరిధిలో గల జల విద్యుత్ కేంద్రాల్లో రోజుకు 5 నుంచి 6 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేస్తున్నట్టు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాల్లో నీరు భారీగా వచ్చి చేరుతోందన్నారు. ఈ నీరు వృథాగా పోకుండా గ్రిడ్ అధికారులకు ఇక్కడ జలాశయాల పరిస్థితిని వివరించి విద్యుత్ ఉత్పత్తి చెయ్యడానికి అనుమతులు వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంప్లెక్సు పరిధిలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్నామని, అలాగే డొంకరాయిలో కూడా 12 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుందన్నారు. సీలేరు కాంప్లెక్సులోని జలాశయాల్లో వర్షాల ప్రారంభం నాటికి 12 టీఎంసీల నీటి నిల్వలు ఉండేవని, ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు 40 టీఎంసీలకు పెరిగాయని చీఫ్ ఇంజనీర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కోటా కలహంలో బంగ్లా

పది రోజులపాటు తీవ్ర హింసనీ, రక్తపాతాన్ని చవిచూసిన బంగ్లాదేశ్ ప్రస్తుతం కర్ఫ్యూ కారణంగా నివురుగప్పిన నిప్పులాగా ఉంది. మళ్ళీ అగ్గిరాజుకుంటుందో, ప్రశాంతతనెలకొంటుందో ఇప్పుడే చెప్పలేం కానీ, రిజర్వేషన్ల రద్దుకోసం పోరాడిన యువకులమీద పోలీసులు, మిలటరీ అమానుషంగా విరుచుకుపడిన ఆ దృశ్యాలు మనసు కలిచివేస్తాయి. దాదాపు రెండువందలమంది యువకులు మరణించారు, వేలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు. భద్రతాదళాలు అంత అరాచకంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

బంగ్లాదేశ్ స్వాతంత్ర్యపోరాటంలో ప్రాణత్యాగం చేసినవారి కుటుంబీకులకు ప్రభుత్వోద్యోగాల్లో ముప్పైశాతం కోటానిచ్చే అంశం తిరిగి తెరమీదకు రావడం ఈ రక్తపాతానికి ప్రధాన కారణం. ఆరేళ్ళక్రితం ఇదే తరహా ఉద్యమాలవల్ల ఆ విధానాన్ని నిలుపుదలచేసిన హసీనా, ఇటీవల హైకోర్టు తీర్పు మేరకు మళ్ళీ దానిని పునరుద్ధరించేందుకు సిద్ధపడుతూండటంతో విద్యార్థులు రగిలిపోయారు. పాత రిజర్వేషన్ వ్యవస్థను పునరుద్ధరించమంటూ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు వెనుక హసీనా హస్తం ఉన్నదని వారు పరిపూర్ణంగా విశ్వసించారు. మిగతా రిజర్వేషన్లన్నీ కలుపుకుంటే యాభైఆరుశాతాన్ని దాటిపోయి, ఓపెన్ కాంపిటేషన్‌లో దక్కే ఉద్యోగాలు కుంచించుకుపోతాయి కనుక, విద్యార్థిలోకం ఈ కోటాకు వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడింది. ఉద్యమం యూనివర్సిటీలను దాటి అన్ని నగరాలకు విస్తరించింది. భద్రతాదళాలన్నీ ఏకమై విరుచుకుపడినా ప్రాణాలకు వెరవకుండా, తోటివారు కళ్ళముందే పిట్టల్లారాలిపోతున్నా జడవకుండా యువత పోరాడింది. దేశ స్వాతంత్ర్యపోరాటంలో ప్రాణత్యాగాలు చేసినవారి కుటుంబీకులను ఈ రీతిన ఆదుకోవాల్సిన బాధ్యత సమాజం మీద ఉన్నదని ప్రధాని షేక్ హసీనా వాదన సముచితమైనదే. ఆమె తండ్రి ముజిబూర్ రహ్మాన్ నాయకత్వంలో, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా, బంగ్లాదేశ్ సాగించిన విముక్తి పోరాటంలో లక్షలాదిమంది మరణించారు, వేలాదిమంది స్త్రీలు అత్యాచారాలకు గురైనారు. పాకిస్థాన్ సైన్యమూ, దానికి అండగా నిలిచిన శక్తులు కలసిచేసిన అకృత్యాలకు అంతేలేదు. చివరకు భారతసైన్యం ప్రవేశంతో కానీ తూర్పుపాకిస్థాన్‌కు విముక్తి దక్కలేదు. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్యానంతరం 1972నుంచి బంగ్లాదేశ్‌లో ఈ కోటా విధానం అమలులోకి వచ్చింది. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పోరాడిందీ, ప్రాణాలు కోల్పోయిందీ ముజిబూర్ రహ్మాన్ సారథ్యంలోని శక్తులే కనుక, ఈ కోటా విధానం ఆయన అనుచరణగణానికీ, పార్టీకే మేలుచేసిందన్న విమర్శలు సహజం. ఈ కోటాద్వారా ప్రభుత్వంలోని సమస్తవ్యవస్థల్లోనూ అవామీలీగ్ మనుషులు తిష్టవేశారని విపక్షనేతల విమర్శ. నిజానిజాలు అటుంచితే, ఇప్పటి విద్యార్థి ఉద్యమానికి విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ మద్దతు ఇచ్చినంత మాత్రాన, కోటాకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నవారినంతా రజాకార్లుగా హసీనా అభివర్ణించడం ఉద్రిక్తతలను పెంచింది. పాకిస్థాన్‌తో అంటకాగి, తూర్పుపాకిస్థాన్‌లో స్థానికులపై అఘాయిత్యాలకు, ఊచకోతలకు కారకులైన రజాకార్ల పేరిట ఈ విమర్శలు చేయడం వారికీ, ప్రభుత్వానికీ మధ్య అగాధాన్ని పెంచింది. దీనికితోడు, హసీనా ప్రభుత్వాన్ని ఎన్నికలతో సహా సమస్త సందర్భాల్లోనూ కంటికిరెప్పలాగా కాపాడుకొచ్చే అవామీలీగ్ విద్యార్థివిభాగం కూడా ఈ సందర్భంలో సైనికబలగాలతో కలసి విద్యార్థులపై దాడులు సాగించింది.

ఈ తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో, స్వాతంత్ర్యసమరయోధుల కోటాను 5శాతానికీ, మొత్తం రిజర్వేషన్లన్నీ ఏడుశాతానికీ పరిమితం చేస్తూ ఆదివారంనాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కోటా వ్యతిరేక విద్యార్థి ఉద్యమకారులకు అమితబలాన్నిచ్చింది. కానీ, హసీనా ప్రభుత్వం ఈ ఆదేశాలను వమ్ముచేయడానికి ప్రయత్నిస్తుందన్న అనుమానం వారిని ఇంకా వెంటాడుతోంది. ఈ కొత్త రిజర్వేషన్ల విధానాన్ని యథాతథంగా అమలులోకి తెచ్చేవరకూ పోరాటాన్ని ముగించబోమని, తాత్కాలికంగా నిలుపుదలచేస్తామని వారు ప్రకటించారు. హసీనా ప్రభుత్వం కూడా ఈ వ్యవహారాన్ని సాగదీయకుండా తక్షణమే పరిష్కరించడం సముచితం. బంగ్లాదేశ్‌లో ప్రతీ ఉద్యమంలోనూ, ప్రజాపోరాటాల్లోనూ విపక్ష బీఎన్పీతో పాటు దానికి మద్దతునిచ్చే ఇస్లామిక్ శక్తులు చేరడం, ప్రతిగా హసీనా తీవ్రంగా విరుచుకుపడటంతో అవి హింసాయుతంగా మారిపోతున్నాయి. హసీనా అభద్రత, పరిస్థితి తెలిసిందే కానీ, వరుసగా నాలుగుసార్లు గెలిచి, ఇటీవలే ఐదోసారి ప్రధాని అయిన ఆమె ఇంకా అదే అణచివేత ధోరణితో, అమానుషంగా వ్యవహరిస్తూ తీవ్రమైన అప్రదిష్ట మూటగట్టుకుంటున్నారు.

'యాప్'లతో ఉపాధ్యాయులకు తిప్పలు!

విద్యాశాఖ, పాఠశాలలు, ఉపాధ్యాయులు, బోధన- అనుసంధాన అంశాలు. పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులు బోధన మీద ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలి. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని అనేక విద్యా కమిషన్లు కూడా చెప్పాయి. దీంతోనే విద్యార్థుల్లో సాధించాల్సిన సామర్థ్యాలు సులభతరమవుతాయని వారి అభిప్రాయం. కానీ గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర యాప్‌ల ద్వారా బాధ్యత పెంచింది. దీంతో విద్యా లక్ష్యాలు అడుగంటిపోయాయి. బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించాలని అనేకసార్లు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా పరిస్థితుల్లో మార్పు లేదన్న ఆవేదనలో ఉపాధ్యాయ వర్గం ఉంది.

బోధనేతర పనులకు అనేక యాప్‌ల గోలే కారణం. పాఠశాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆన్‌లైన్ బోధనేతర సేవలకు ఉపాధ్యాయులు అంకితం కావలసి వస్తున్నది. ఉదయం 9:30 లోపలే పాఠశాలల్లోని బాత్‌రూమ్‌లను ఉపాధ్యాయులు పరిశీలించి, శుభ్రత అపరిశుభ్రత మీద ఫోటోలు ఐఎంఎంఎస్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అపరిశుభ్రంగా ఉంటే శుభ్రం చేయించాలి. తరువాత వెంటనే తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల ఆన్‌లైన్ హాజరును స్కూల్ అటెండెన్స్ యాప్ ద్వారా నమోదు చేయాలి. దీంతోపాటు విద్యార్థులకు సరఫరా చేయాల్సిన గుడ్లు, చిక్కీలు, రాగి జావ వివరాలు కూడా నమోదు చేయాలి. అలాగే విద్యార్థి గైర్హాజరుకు కారణాలు కూడా ఆన్‌లైన్‌లో చెప్పాలి. దీంతో బోధనకు పది నిమిషాలు మేర ఆటంకం కలుగుతోంది. ఒకవేళ యాప్ మొరాయిస్తే ఎంతైనా ఆలస్యం అవుతుంది. మధ్యాహ్నం బెల్లు కొట్టిన వెంటనే భోజన విరామ సమయాన్ని కూడా ఉపాధ్యాయులు స్వీయ అవసరాలకు ఉపయోగించుకోలేకపోతున్నారు. విద్యార్థులకు వడ్డించే తినుబండారాలను ఒక్కొక్కటి ఫోటోలు తీసి, శుభ్రతను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తనిఖీ చేసిన ఉపాధ్యాయుని ఫోటో కూడా అప్‌లోడ్ చేయాలి. దీంతోపాటు ఎంతమంది గుడ్లు, చిక్కీలు తీసుకున్నారనే వివరాలను కూడా నమోదు చేయాలి.

ఈ పనులతో పాటు నాడు-నేడు పనుల బాధ్యతలను ఉపాధ్యాయులకే అంటగట్టారు. నిర్మాణపరమైన నిపుణత లేకపోయినా ఉపాధ్యాయులు వీటిని పర్యవేక్షించి సంబంధిత యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేయించాలి. ఇప్పటికీ కూడా నాడు-నేడు పేరు మార్చి స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంటూ కొత్త పేరుతో సదరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యా కానుక పేరుతో విద్యార్థులకు ఇచ్చే కిట్లను సైతం మానిటరింగ్ చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై పెట్టారు. ఈ కిట్ల వివరాలను యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ చేయకపోతే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి.

బయోమెట్రిక్ అంటూ స్కూల్ అటెండెన్స్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. అప్పుడప్పుడు ఇవి మొరాయిస్తే కూడా ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వమైనా ఈ బాధల నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగించి, వారిని బోధనకు మాత్రమే పరిమితం చేయాలి.

యాప్‌ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను నియమించాలి. బోధనేతర కార్యక్రమాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మాతృశాఖకు పంపాలి. నాడు-నేడు పనుల నాణ్యతకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరి కాదు. మధ్యాహ్నం భోజనం నిర్వహణ గ్రామ సచివాలయాలకు అప్పచెప్పాలి. ప్రతి పాఠశాలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలి. విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో సంస్కరించాలి. ఉపాధ్యాయులను నాన్ ఒకేషనల్ డిపార్ట్‌మెంట్‌గా గుర్తించాలి.

– సివి ప్రసాద్
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏపీటీఎఫ్


తూటాలతో మాటలను ముడిపెట్టవచ్చునా?

డొనాల్డ్ ట్రంప్ మీద కాల్పులు జరిగి పదిరోజులు దాటిపోయింది. దుండగుడు చనిపోయాడు. అతను ట్రంప్ పార్టీ సభ్యుడే. దాడికి కారణాలేమిటో ఇంకా తెలియదు. ఈ ఏడాది చివర జరిగే ఎన్నికలకు ముందస్తుగా పార్టీల స్థాయిలో జరిగే ప్రచారకార్యక్రమంలో జరిగిన సంఘటన అది. ఒక మాజీ అధ్యక్షుడు, రానున్న ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి అయిన నేత మీద దాడి జరగడం చిన్న విషయం కాదు. అమెరికన్ సమాజమే కాదు, యావత్ ప్రపంచమే నివ్వెరపోయిన సంఘటన అది. కానీ, ఇటువంటి దాడి సంఘటనలు భారత్ వంటి వర్ధమాన దేశాలలోనే కాదు, గొప్ప నాగరికత, ప్రజాస్వామిక చైతన్యం కలిగిన దేశంగా చెప్పుకునే అమెరికాలోనూ ఇంత బలంగా రాజకీయ ప్రభావం వేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

అక్కడి రెండు ప్రధాన పార్టీలలోనూ, ఎక్కువ మితవాదంతో ఉండే రిపబ్లికన్ పార్టీ, 2016 ఎన్నికల్లో ట్రంప్ వంటి తీవ్ర మితవాద నాయకుడి నాయకత్వంలో పోటీపడినప్పుడు, అక్కడి రాజకీయ సంవాదం కూడా ఒక కొత్త క్షీణతకు దిగజారింది. ట్రంప్ పాలనను చవిచూసిన తరువాత, 2020 ఎన్నికల్లో దేశంలోని ఉదారవాద, వామపక్ష, మధ్యేవాద మితవాద శ్రేణులన్నీ ఏకమై, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోబైడెన్‌ని బలపరచి గెలిపించాయి. ఓడిపోయి, తన ఓటమిని ఒప్పుకోకుండా, రాజధానిలోని కేపిటల్ హిల్‌పై దాడికి తన అభిమానుల్ని ప్రేరేపించి, ట్రంప్ బాగా చెడ్డ పేరు తెచ్చుకున్నారు. అతను దిగిపోయినా, దేశంలో తీవ్ర మితవాద శక్తులు బలంగానే మిగిలాయి. రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ ఆధిక్యమూ కొనసాగింది. అప్పుడు ఓడినా, ఇప్పుడు రెండో దఫా గెలవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నానికి, బైడెన్ జరాభారం ఒక సానుకూలత కల్పించింది. ట్రంప్‌కూ బైడెన్‌కూ వయస్సులో పెద్ద తేడా ఏమీ లేదు. కానీ, వృద్ధాప్య బలహీనతలు ప్రస్ఫుటంగా వ్యక్తమవుతున్న బైడెన్ మొదటి వాగ్యుద్ధంలో నవ్వులపాలయ్యారు. అభ్యర్థిత్వం నుంచి తప్పుకోవలసిందిగా డెమొక్రాటిక్ పెద్దలు పోరుపెట్టారు. సరిగ్గా అప్పుడే ఈ దాడి జరిగింది. ట్రంప్ రేటింగ్ రివ్వున ఎగిసింది. కొవిడ్ మాటున బైడెన్ తప్పుకున్నారు. కమలా హారిస్ అభ్యర్థిత్వ అవకాశాలు పెరిగాయి.

దూకుడు మీద ఉన్న రిపబ్లికన్లకు ట్రంప్ మీద జరిగిన దాడి ఒక రాజకీయ అవకాశం ఇచ్చింది. దానితో, బైడెన్ కల్పించిన వాతావరణం వల్లనే దాడి జరిగిందన్న విమర్శ మొదలయింది. ట్రంప్ మీద గురిపెట్టాలి (ఇట్స్ టైమ్ టు పుట్ ట్రంప్ ఇన్ ఎ బుల్స్ ఐ), అని పార్టీ డోనర్లతో బైడెన్ ఫోన్‌లో అన్నారట. ఆ సందేశం తెలిసి, దుండగుడు నిజంగానే తుపాకీ గురిపెట్టాడట. ఫాసిస్టు ట్రంపును తిరిగి అధికారంలోకి రాకుండా ఎట్లాగైనా నివారించాలని డెమొక్రాటిక్ పార్టీ పదే పదే చేస్తున్న ప్రచారం అతన్ని భౌతికంగా నిర్మూలించాలన్న ప్రేరణ కలిగించిందని అనేకమంది రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదం అంటూ వామపక్షీయులు, మీడియా కలిసి చేసిన ప్రచారమే ఈ దాడికి కారణమని, బైడెన్ దీనికి బాధ్యుడని ఆరోపించారు. ఆ సాయుధుడిని పంపింది బైడెనే అని అన్నవారూ ఉన్నారు. ట్రంప్ మిత్ర దేశం రష్యా కూడా అదే అభిప్రాయం చెప్పింది. ట్రంప్ మీద దాడి వెనుక ఉన్నదనడం లేదు కానీ, బైడెన్ ప్రభుత్వమే దాడికి కావలసిన భావ వాతావరణాన్ని కల్పించిందని రష్యా వ్యాఖ్యానించింది.

రాజకీయ ప్రత్యర్థుల మీద విమర్శ భౌతిక దాడులకు కారణమవుతుందా? ఆ పేరుతో విమర్శలకు పాల్పడవద్దని, నిందించవద్దని రాజకీయపక్షాలను కోరవచ్చునా? భౌతిక దాడులు ప్రజాస్వామ్యంలో అవాంఛనీయాలని, విభేదాలతో వ్యవహరించడానికి హింస సాధనం కాదని పదే పదే చెప్పనక్కరలేదు. కానీ, ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు ఏవో సంఘటనలు జరుగుతాయి. వాటిని అనుమతించబోమని చెప్పడం, ఆ సంఘటనలకు నేపథ్యకారణాలను సరిదిద్దడం వంటి నివృత్తిచర్యలను చేయవలసి ఉంటుంది తప్ప, తీవ్రమైన రాజకీయ విమర్శలను నిషేధించడం ప్రజాస్వామ్య మౌలికతకే చేటు చేస్తుంది. ట్రంప్‌కు మిత్ర దేశమైన రష్యా స్పందనలకు అనుగుణంగానే, ట్రంప్‌కు, పుతిన్‌కు సన్నిహిత పక్షమైన భారతీయ జనతాపార్టీ కూడా వైఖరి తీసుకోవడం గమనించవలసిన పరిణామం.



ప్రధాని మోదీ మీద ప్రతిపక్షం హింసను ప్రేరేపించే భాషను ఉపయోగిస్తోందని భారతీయ జనతాపార్టీ ఐటీ విభాగం అధినేత అమిత్ మాలవీయ, రాజ్యసభ సభ్యుడు, పార్టీ అధికారప్రతినిధి అయిన సుధాంశు త్రివేది ఆరోపించారు. ట్రంప్ మీద హత్యాయత్నం నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం 'హింస', 'హత్య' వంటి మాటను ప్రధానిని ఉద్దేశించి వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు అడిగారు. రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే మాటలతో మోదీని విమర్శిస్తున్నారని వారు అన్నారు. ట్రంప్‌ను బైడెన్ వంటి వారు నియంత అన్నట్టుగానే, మోదీని కూడా రాహుల్‌గాంధీ అటువంటి భాషలో నిందిస్తున్నారని అమిత్ మాలవీయ విమర్శించారు. అంతర్జాతీయ వామపక్షీయుల దాడిని తట్టుకుని భారత ప్రజాస్వామ్యం నిలబడిందని, మోదీ మూడోసారి ప్రధాని అయ్యారని మాలవీయ ఒక కొత్త సూత్రీకరణ చేశారు.

నిజానికి రాజకీయ భాషలో విమర్శ, నింద, అభియోగం వంటివి అన్ని సందర్భాలలో ఒకే విధంగా ఉండవు. భూస్థాపితం చేస్తాం, ఓడిస్తాం, నిర్మూలిస్తాం, నామ రూపాలు లేకుండా చేస్తాం వంటి ప్రయోగాలు వాస్తవంలో ప్రత్యర్థుల చర్యలను, సంస్థలను, లేదా, వారి విధానాలను ఉద్దేశించి చేస్తారు. వాటిని వాచ్యార్థంలో తీసుకోగూడదు. అటువంటి మాటల్లో కొన్నిటిలో సభ్యత లేదని అనవచ్చును కానీ, అవి నేరపూరితాలని అన్వయించలేము. కేసీఆర్, రేవంత్‌రెడ్డి వంటి వారి రాజకీయ భాషలో ఈ ప్రయోగాలు ఎక్కువగా గమనించవచ్చు. అన్ని ప్రాంతాల్లో, భాషల్లో కూడా ఈ యుద్ధభాష రాజకీయ సంవాదంలో కనిపిస్తుంది. సాధారణంగా అటువంటి ప్రయోగాలు ప్రత్యర్థులను అధికారంలోకి రానివ్వకుండా నిరోధించడం, బలహీనపరచడం, అక్రమాలకు బాధ్యులను చేయడం, చట్టపరంగా శిక్షించడం వంటి అర్థాలనే ఇస్తాయి. ఆలంకారికప్రయోగాలు సానుకూల అర్థాలలోనే కాదు, ప్రతికూల అర్థాలలోనూ ఉంటాయి. తుపాకీ పేల్చడం సాధన చేసేవారు, వలయాల మధ్య ఉండే బిందువును లక్ష్యంగా పెట్టుకుంటారు. ఆ బిందువునే 'బుల్స్ ఐ' అంటారు. లక్ష్యంగా ఒకరిని పెట్టుకోవడం అంటే, తుపాకీ గురి పెట్టమని కాదు.

ఆ మాటకు వస్తే, తీవ్రమితవాద, తీవ్రజాతీయవాద పక్షాలు వాడినంత హింసాత్మక భాష ఇతరులెవరూ వాడరు. ఆ పక్షాలు ఆ మాటలను జనసామాన్యం దగ్గర, వారి ఉద్వేగాలను ప్రేరేపిస్తూ వాడతాయి కాబట్టి, అవి నిజంగా ప్రమాదకరం. ఆ మాటలను నిజంగా ఆచరణలో పెడుతూ దాడులు జరుగుతాయి. అటువంటి దాడిభాష మాట్లాడడంలో ట్రంప్ ఆరితేరినవాడు. 2020 జనవరిలో కేపిటల్ హిల్ మీద దాడి జరగడానికి ముందు, ట్రంప్ తన అనుచరులకు ఇచ్చిన పిలుపు ఏమిటి? "దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోండి" (టేక్ ద కంట్రీ బ్యాక్). ఆ ఎన్నికను తన నుండి అపహరించారని వాదించడమే కాక, దాన్ని తిరిగి పొందడానికి జనాన్ని రాజధానికి నడిపించాడతను.

తన ప్రచార ర్యాలీలలో నిరసన తెలిపే ప్రతిపక్ష కార్యకర్తలను "ఈడ్చిపారేయండి" అనడం ట్రంప్‌కు అలవాటు. "ఎవరన్నా విసరడానికి చేతిలో టమాటా పెట్టుకుని కనిపించారా వదలకండి, తొక్కిపారేయండి", అది మరో సందేశం! 2016 ప్రచారంలో ట్రంప్ తన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా 'జైలుకు పంపండి ఆమెని' (లాక్ హర్ అప్) అని అరిచేవారు. ఇక మెక్సికన్లకు, ముస్లిములకు వ్యతిరేకంగా సభల్లో ఆయన చేసిన బెదిరింపులు, నినాదాలు, వ్యంగ్య వ్యాఖ్యలు అనేకం. అధికారంలోకి వచ్చాక కూడా అతని పద్ధతేమీ మారలేదు. సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినప్పుడు వాటిని ఖండించడానికి ఆయనకు మనసొప్పేది కాదు. జార్జి ఫ్లాయిడ్ మరణం తరువాత, హింసాకాండ, లూటీలు జరుగుతున్నప్పుడు, నిరసనకారులు బందిపోట్లని, 'లూటింగ్ మొదలైతే షూటింగ్ మొదలవుతుంది' అనీ చేసిన వ్యాఖ్యలకు ఎంతో నిరసన వ్యక్తమైంది. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ వంటి నేతలు మైనారిటీల మీదా, వలసదారుల మీదా చేసే విద్వేషపూరిత వ్యాఖ్యలు సమాజాన్ని హింసాత్మకంగా మార్చాయి. భారతదేశంలో కూడా 2024 ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తూ ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు ఎంతటి విస్ఫోటన శీలంగా ఉన్నాయో తెలిసిందే.

తమ తీవ్ర విధానాల కారణంగా, వ్యక్తిగతంగా దూకుడు స్వభావం వల్లా ఎంతో అతిశయంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించే నాయకులు, ఎంతో కొంత బాధితులైనప్పుడు, ఆ సందర్భంలో ఎంతో బేలగా కనిపిస్తారు. నిన్నటి వరకు తమ అవక్రపరాక్రమంతో ప్రయోజనం పొందినవారు, ఇప్పటి బలహీనత నుంచి కూడా లాభం పొందాలని చూస్తారు. ట్రంప్‌ను చూడండి, ఆ క్షణంలో దేవుని దయ వల్ల నేను తప్పుకుని ఉండకపోతే, మీ ముందు ఇట్లా నిలబడేవాణ్ణి కాదు అని కనీసం నాలుగైదు సార్లన్నా సమావేశాల్లో అని ఉంటారు. ఓట్లు తగ్గిన ప్రాభవం తగ్గిన మోదీని చూడండి, తనను రెండున్నర గంటలు మాట్లాడనివ్వలేదని, తనతో పాటు పార్లమెంటు సభ్యుల హక్కులన్నీ హననం అయ్యాయని ఆవేదన ప్రకటిస్తున్నారు. నేను గెలిచాను, మూడోసారి ప్రధాని అయ్యాను, అయినా ఎందుకు ఈ వాస్తవాన్ని గుర్తించరు? అని పదే పదే బాధ పడుతున్నారు.

మాటలతో, నికరమైన ప్రజాస్వామిక ఆచరణలతో రాజకీయ విభేదాలను, ప్రత్యామ్నాయాలను సాధన చేసే అవకాశం ఉన్నప్పుడు, ఎంతటి తీవ్ర విమర్శ కూడా అవాంఛనీయ రూపం తీసుకోదు. విసుగుచెందినవారో, నిస్పృహ చెందినవారో, తీవ్రబాధితులో చేసే చర్యలకు కారణాలను తమ చర్యలలో, వైఫల్యాలలో కాక, రాజకీయ ప్రతిపక్షంలో వెదకడం సమంజసం కాదు.



■ కె. శ్రీనివాస్

సందర్భం

> తమ తీవ్ర విధానాల కారణంగా, వ్యక్తిగతంగా దూకుడు స్వభావం వల్లా ఎంతో అతిశయంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు కనిపించే నాయకులు, ఎంతో కొంత బాధితులైనప్పుడు, ఆ సందర్భంలో బేలగా కనిపిస్తారు. నిన్నటివరకు తమ అవక్రపరాక్రమంతో ప్రయోజనం పొందినవారు, ఇప్పటి బలహీనత నుంచి కూడా లాభం పొందాలని చూస్తారు. ట్రంప్‌ను చూడండి, ఆ క్షణంలో దేవుని దయ వల్ల నేను తప్పుకుని ఉండకపోతే, మీ ముందు ఇట్లా నిలబడేవాణ్ణి కాదు అని కనీసం నాలుగైదు సార్లన్నా సమావేశాల్లో అని ఉంటారు. ఓట్లు తగ్గిన, ప్రాభవం తగ్గిన మోదీని చూడండి, తనను రెండున్నర గంటలు మాట్లాడనివ్వలేదని, తనతో పాటు పార్లమెంటు సభ్యుల హక్కులన్నీ హననం అయ్యాయని ఆవేదన ప్రకటిస్తున్నారు.

> దూకుడు మీద ఉన్న రిపబ్లికన్లకు ట్రంప్ మీద జరిగిన దాడి ఒక రాజకీయ అవకాశం ఇచ్చింది. దానితో, బైడెన్ కల్పించిన వాతావరణం వల్లనే దాడి జరిగిందన్న విమర్శ మొదలయింది. ట్రంప్ మీద గురిపెట్టాలి (ఇట్స్ టైమ్ టు పుట్ ట్రంప్ ఇన్ ఎ బుల్స్ ఐ), అని పార్టీ డోనర్లతో బైడెన్ ఫోన్‌లో అన్నారట. ఆ సందేశం తెలిసి, దుండగుడు నిజంగానే తుపాకీ గురిపెట్టాడట.

చారిత్రక సంపదను తరలించండి!

ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) విడిపోయి దశాబ్దికాలం దాటిపోయింది. రెండు రాష్ట్రాల మధ్య జరగాల్సిన ఆస్తులు, అప్పులు వగైరాల విభజనలకు తోడు, సమాజ శ్రేయస్సు కోరే పెద్దలు తెలుసుకోవాల్సినవి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యల గురించి- ముఖ్యంగా చరిత్ర పరిశోధనకు సంబంధించి కొన్ని విషయాలు ప్రస్తావించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత, చారిత్రక ఆధారాల గురించి- ఆర్కైవ్స్ (Archives), ఆర్కియాలజీ, ఇప్పుడు చలామణిలో లేని అపూర్వ చారిత్రక గ్రంథాలున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో- గ్రంథాలయం, ఈ మూడిటికి సంబంధించి, ఇరు రాష్ట్రాలకు చెందిన, ఎంపిక చేసిన చరిత్రకారుల కమిటీలు ఏర్పర్చారు. ఈ కమిటీలు, పైన చెప్పిన మూడు చారిత్రక కేంద్రాల్లో ఉన్న చారిత్రక సంపద- రికార్డులు, గెజిటీర్లు, గ్రంథాలు, పురావస్తు చారిత్రక ఆనవాళ్లు- వీటిలో ఇరు రాష్ట్రాలకు చెందిన వాటిని విడదీసి, ఆయా రాష్ట్రాలకు కేటాయించాలన్నది కమిటీ నిర్ణయిస్తుంది.

ఇరు రాష్ట్రాలకు చెందిన కమిటీలు పలుసార్లు సమావేశమై, కూలంకషంగా చర్చించి, ఒక ఒప్పందానికి వచ్చాయి. ఇందులో పేర్కొనదగిన ముఖ్యాంశం, ఆర్కైవ్స్, ఆర్కియాలజీ శాఖల్లో ఉన్న రికార్డులు, పురావస్తు శాసనాలు, నాణేలు, కళాకృతులు- వీటితో పాటు గ్రంథాలయాలు. వీటిలో అపురూపమైన, ఇప్పుడు లభ్యం కాని అనేకానేక చారిత్రక గ్రంథాలుండడం విశేషం. రెండు కాపీలు ఉంటే ఇరు రాష్ట్రాలు చెరొకటి పంచుకోవడం, ఒక కాపీ ఉంటే, జెరాక్స్ చేయించి ఇవ్వడంగా నిర్ణయం జరిగింది. ఇది పదేండ్ల నాటి ముచ్చట.

ఇప్పుడు పరిస్థితి ఏమిటి? ఆర్కైవ్‌లోని రికార్డులను, గెజిటీర్లను- కొంతభాగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలించి ఒక అద్దె భవనంలో భద్రపరిచారు. కాగా తరలించాల్సిన రికార్డులు మరెన్నో మిగిలివున్నాయి. మేము కనుక్కొంటే, మరొక నలభై లోడ్‌లు ఉన్నాయి. ఒక్కొక్క కిత్తాలో 650 కట్టల రికార్డులుంటాయి. రికార్డులను భద్రపరిచే సదుపాయాలు కానీ వస్తుసామగ్రి కానీ లేవు. వీటిని తరలించే కార్యక్రమం త్వరితగతిన చేపట్టాలి. తరలింపు, అమర్చడం ఎంతో నేర్పుతో, జాగరూకతతో జరగాలి. వీటిని శాశ్వతంగా ఉంచేందుకు ఢిల్లీలో ఉన్న నేషనల్ ఆర్కైవ్స్ నమూనాలో మరిన్ని సదుపాయలతో నాలుగు కాలాల పాటు మన్నికగా ఉండేట్టు నిర్మించాలి. దీన్ని ఎక్కడ నిర్మించాలన్నది ముఖ్యాంశం. సామాన్యంగా రాజధాని నగరంలో నిర్మిస్తారు. ఇంతవరకు రాజధాని నిర్మాణం కాలేదు. అదలావుంచి- చరిత్రకారులకు, పరిశోధక విద్యార్థులకు, ఔత్సాహిక చరిత్ర రచయితలకు అనువుగా ఉన్న ప్రదేశంలో (రాజధానిలోనే నిర్మించాల్సిన అవసరం లేదు) నిర్మాణానికి త్వరితగతిన పూనుకోకుంటే, ఇప్పటికే జరిగిన నష్టం (అధ్యయన, పరిశోధనల పరంగా) రెట్టింపవుతుంది. ఇదే క్రమంలో ఆర్కియాలజీకి కావాల్సిన భవన నిర్మాణాలు కూడా చేపట్టాలి.



– వకుళాభరణం రామకృష్ణ
ఆంధ్ర చరిత్ర కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు

కొత్త ప్రభుత్వానికి 'పంచాయతీ' సవాళ్లు!

గ్రామ ప్రాంతాల ప్రజల పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం నిమిత్తం... మూడు అంచెల్లో అంటే గ్రామ పంచాయతి, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌లు ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసింది. నిధులు, విధులు, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు గుర్తింపు లేక అవి ఉనికిని కోల్పోయాయి. అలా అని వీటిని పూర్తిగా విస్మరించడం కుదరదు. ఇవి రాజ్యాంగ ప్రతిపత్తి కలిగిన ప్రాతినిధ్య ప్రజాస్వామిక వ్యవస్థలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో వీటి భాగస్వామ్యం అనివార్యం. ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థను దేశానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో ఉన్నట్లు వెల్లడించారు. అంటే ఆయన ముందుగా పంచాయతీ రాజ్ వ్యవస్థాగత నిర్మాణంలో ఉన్న మౌలిక సమస్యలను, పాలనా వ్యవస్థల్లో ఉన్న గందరగోళ పరిస్థితులను చక్కదిద్దాలి.

గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసినా, జిల్లా ప్రజాపరిషత్‌ల పునర్విభజన చేపట్టలేదు. జిల్లాల పునర్విభజన అనేది ప్రాంతాల అభివృద్ధి, సుపరిపాలన కోసం అని ప్రకటించిన గత ప్రభుత్వం, కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ప్రజాస్వామిక ప్రాతినిధ్య సంస్థలను నెలకొల్పే ప్రయత్నం చేయలేదు. పైగా ప్రస్తుత జిల్లా ప్రజాపరిషత్‌లే వాటి పదవీకాలం (23 సెప్టెంబర్, 2026) పూర్తి అయ్యేవరకూ కొనసాగుతాయని ఆదేశాలు జారీచేసింది. అయితే ఈ ఉత్తర్వులకు చట్టబద్ధతలేదు. కొత్తగా ఏర్పాటయిన జిల్లాల, ప్రస్తుత జిల్లా ప్రజాపరిషత్‌ల పరిధుల మధ్య పొంతన లేకపోవటంతో జిల్లా పాలనా వ్యవస్థల మధ్య గందరగోళం కొనసాగుతున్నది. దీంతో కొత్తగా ఏర్పడిన జిల్లాల జడ్పీటీసీ సభ్యులు వేరే జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో పాల్గొనాల్సి వస్తోంది. ప్రస్తుత జిల్లా ప్రజాపరిషత్‌లకు కొత్త ప్రాంతాలు చేర్చడంతో వాటిల్లో కూడా ఇదే సమస్య ఉంది. ఇలా సంవత్సరాల తరబడి కొనసాగించటం అంటే కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రజాప్రాతినిధ్యాన్ని అపహాస్యం చేయడమే. పర్యవసానంగా ఒక జిల్లా ప్రజాపరిషత్ సమావేశానికి మూడు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొనాల్సి వస్తోంది. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒక జిల్లా ప్రణాళికను... మూడు, నాలుగు జిల్లా ప్రజాపరిషత్‌లు ఆమోదించాల్సిన పరిస్థితి. అలాగే జిల్లా నియామక యూనిట్‌గా కలిగిన ఉపాధ్యాయుల, జిల్లా ప్రజాపరిషత్‌ల సిబ్బంది నియామకాలు, బదిలీలు రాష్ట్రపతి ఉత్తర్వులు ఉల్లంఘించి చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం జిల్లాల పునర్విభజన మరోసారి చేపట్టే ఉద్దేశ్యంతో ఉన్నట్లు ప్రకటించినందున, జిల్లాల పునర్విభజనతో బాటు, జిల్లా ప్రజాపరిషత్‌ల పునర్విభజన కూడా చేపట్టాలి. కొత్త జిల్లాలకు జిల్లా ప్రజాపరిషత్‌లు ఏర్పాటు చేయడానికి రాజ్యాంగపరమైన అడ్డంకులు ఏమీలేవు. కేవలం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేస్తే సరిపోతుంది.

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థల్లో ప్రస్తుత అధికార పార్టీల బలం నామమాత్రంగా ఉంది. పార్టీ ప్రాతిపదికగా ఎన్నికలు జరిగే జిల్లా ప్రజాపరిషత్‌లు, మండల ప్రజాపరిషత్‌లు అన్నీ వైసీపీ చేతిలో ఉన్నాయి. గ్రామపంచాయతీలకు పార్టీ ప్రాతిపదికన ఎన్నికలు జరగవు. మారిన రాజకీయ నేపథ్యంలో కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సభ్యులు సహకరిస్తారనే ఆశించవచ్చు. కానీ వారిని సమన్వయం చెయ్యాల్సిన అవసరం ఉంది. అందుకు నిబద్ధత, సమర్థత కలిగిన అధికారులను నియమించాలి.

రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు పంచాయతీరాజ్ పాలనా వ్యవస్థల నిర్మాణమే ఒక గందరగోళం. ప్రభుత్వ స్థాయిలో మూడు, నాలుగు శాఖలు, శాఖాధిపతుల స్థాయిలో ఒక అరడజనుకి పైబడి శాఖాధిపతులు, ఇక జిల్లా ఆ క్రింది స్థాయికి వెళ్తే ప్రజాప్రతినిధులు, పంచాయితీరాజ్ అధికారులు, జిల్లా కలెక్టరుతో పాటు పది, పదిహేను శాఖల జిల్లా అధికారులు నిత్యం పరస్పర విరుద్ధమైన ఆదేశాలతో గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. ఎవరి ఆదేశాలు పాటించాలో, అమలు చెయ్యాలో అర్థం కాక దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది హైరానా పడుతుంటారు. ఏ పనికి ఎవరు బాధ్యులు, ఎవరికి ఎవరు జవాబుదారో స్పష్టత ఉండదు. ఏదైనా తప్పు జరిగితే సంబంధం లేని వారిని బలి చేస్తుంటారు.

రాష్ట్ర స్థాయిలో అధికారికంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఒకే శాఖ. ప్రభుత్వ స్థాయిలో కార్యదర్శి ఒక్కరే. కమిషనర్ ఒక్కరే. కానీ విచిత్రమేమిటంటే పై నుండి క్రింద దాకా అవి వేర్వేరు శాఖలుగా వ్యవహరిస్తాయి. నిబంధనల ప్రకారం లేని శాఖను ఉన్నట్లుగా చెలామణి చేస్తున్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖని పంచాయతీరాజ్‌లో అంతర్భాగంగా కొనసాగించడం లేదా ప్రత్యేక శాఖగా ఏర్పాటుచేయడం అత్యవసరం. వీటికితోడు కొత్తగా గ్రామ/వార్డ్ సచివాలయం, వాలంటీర్ల కోసం ప్రత్యేకంగా ఒక శాఖను, కమిషనర్‌ను ఏర్పాటు చేయడంతో ఎవరి పరిధి ఏమిటో అర్థం కాదు. పంచాయతీరాజ్ వ్యవస్థకు గుండెకాయ పంచాయతీరాజ్ కమిషనరేట్. ఇది భ్రష్టుపట్టి ఉంది. ఇక్కడ పని చేసే అధికారులు, సిబ్బందికి క్షేత్రస్థాయి పరిస్థితుల మీద కనీస అవగాహన లేదు. చిన్న అవకాశం దొరికినా క్షేత్రస్థాయి సిబ్బందికి నరకం చూపిస్తారు. ఈ వ్యవస్థను సంస్కరించి ప్రాంతీయ కమిషనరేట్‌లు ఏర్పాటు చేయాలి.



> పంచాయతీరాజ్ సంస్థలు రాజకీయ వ్యవస్థలు. గ్రామపంచాయతీలకు తప్ప, వీటి ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరుగుతున్నాయి. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ్యులు జిల్లా ప్రజాపరిషత్‌లలోనూ, మండల ప్రజాపరిషత్‌లలోను సభ్యులు. వీటి సమావేశాల్లో వారు పాల్గొనవచ్చు, తీర్మానాలపై ఓటు వేయవచ్చు. అందువలన ఇక్కడ తీసుకునే ప్రతీ నిర్ణయం, చర్య ఆఖరికి సిబ్బంది నియామకాలు, బదిలీలు, క్రమశిక్షణా చర్యలు కూడా రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్యలన్నీ లోతుగా అధ్యయనం చేసి స్థానిక పాలనా వ్యవస్థలను చక్కదిద్దాలి.

ఇక జిల్లా స్థాయికి వస్తే పంచాయతీరాజ్ అధికార వ్యవస్థ రెండు విభాగాలుగా విడిపోయింది. ఒకటి అభివృద్ధి విభాగం- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నియంత్రణలో, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. రెండవది నియంత్రణా విభాగం- జిల్లా కలెక్టర్ నియంత్రణలో జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి, విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తుంటారు. ఇవికాక రెండు ఇంజినీరింగ్ విభాగాలు- పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలు. ఇక గ్రామీణాభివృద్ధి విభాగం పంచాయతీరాజ్ శాఖలో అంతర్భాగమైనా, ఎవ్వరితో సంబంధం లేనట్లుగా పనిచేస్తుంటుంది. ఈ సమాంతర పాలనా వ్యవస్థల్ని సంస్కరించి, సమన్వయంతో పనిచేసేలా మార్పులు చెయ్యాలి.

పంచాయతీరాజ్‌కు డివిజన్ స్థాయిలో ఏ రకమైన ప్రాతినిధ్య వ్యవస్థ లేదు. పంచాయతీ విభాగంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉన్నారు. గ్రామ పంచాయతీల తనిఖీలు, పైవారి ఆదేశాలు క్రిందికి, క్రింది వారి నివేదికలు పైవారికి పంపించటం తప్ప ఈయనకి వేరే విధులేమీ లేవు. ఈ మధ్య ప్రభుత్వం, ఎంపీడీవోలకు పదోన్నతుల అవకాశాలు పెంచటం కోసం జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి హోదాతో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టును కొత్తగా సృష్టించింది. ఇది రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కన్నా ఎక్కువ హోదా ఉన్న పోస్టు. ఈ పోస్టును, రెవెన్యూ డివిజనల్ అధికారుల మాదిరిగానే సాధారణ పరిపాలనా శాఖ క్రిందికి తెచ్చి నేరుగా జిల్లా కలెక్టరు పర్యవేక్షణలో ఉంచితే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చు.

మండల ప్రజాపరిషత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చాలా కీలకం. ప్రస్తుతం మండల ప్రజాపరిషత్‌లు వాటి ఉనికిని కోల్పోయాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పోస్టుకి అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చి జవసత్వాలు లేని వ్యవస్థగా తయారు చేశారు. ఈ పదోన్నతులు సమీక్షించి, కనీసం 50 శాతం తగ్గకుండా నేరుగా నియామకాలు చేపట్టాలి. గ్రామ స్థాయిలో జరిగిన మార్పుల కారణంగా ఒక్కో ఎంపీడీవో 500 నుంచి 1500 మంది ఉద్యోగుల పనితీరును నేరుగా పర్యవేక్షించాలి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పరుగులు పెట్టించాలి అంటే ఈ పోస్టులో యువ రక్తం ఎక్కించాలి.

గత ప్రభుత్వం గ్రామ పాలనా వ్యవస్థలో త్రిశంకుస్వర్గం సృష్టించింది. ఒక పక్క గ్రామ పంచాయతీలు, మరోపక్క గ్రామ సచివాలయాలు... ఈ రెండింటికీ అతీతంగా వాలంటీర్లు. పేరుకి సచివాలయం గ్రామ పంచాయతీ నియంత్రణలో ఉన్నట్లు పేర్కొన్నా, అవి అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే పని చేశాయి. ఎంతో ఆర్భాటంగా నియమించిన సచివాలయ సిబ్బందికి ప్రొబేషన్ ప్రకటించడానికి ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. సచివాలయ సిబ్బంది కేడర్‌ను కనీసం జూనియర్ అసిస్టెంట్ స్థాయికి పెంచి వారి పదోన్నతులకు మార్గాలు అన్వేషించాలి. విద్యాధికులైన, సమర్థులైన సచివాలయ సిబ్బందిని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలి. అలాగే పైకి ఎంతో ఆదర్శంగా, ప్రజాసేవ కోసమే ఏర్పాటు జరిగింది అని చెప్పిన వాలంటీర్ వ్యవస్థను అధికార పార్టీ కార్యకర్తలతో నింపేశారు. ఈ వ్యవస్థపై కూడా ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేసి, తగు మార్పులు చేసి కొనసాగించాలి. అలాగే గ్రామ పంచాయతీకి సచివాలయానికి మధ్య సంబంధాలను స్పష్టంగా నిర్దేశించాలి.

పంచాయతీరాజ్ సంస్థలు రాజకీయ వ్యవస్థలు. గ్రామపంచాయతీలకు తప్ప, వీటి ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన జరుగుతున్నాయి. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ్యులు జిల్లా ప్రజాపరిషత్‌లలోనూ, మండల ప్రజాపరిషత్‌లలోను సభ్యులు. వీటి సమావేశాల్లో వారు పాల్గొనవచ్చు, తీర్మానాలపై ఓటు వేయవచ్చు. అందువలన ఇక్కడ తీసుకునే ప్రతీ నిర్ణయం, చర్య ఆఖరికి సిబ్బంది నియామకాలు, బదిలీలు, క్రమశిక్షణా చర్యలు కూడా రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్యలన్నీ లోతుగా అధ్యయనం చేసి, ఈ వ్యవస్థలు చక్కదిద్దుతారని ఆశిద్దాం.

■ **పరదేశి కె. ఎరికిపాటి**
విశ్రాంత పంచాయతీరాజ్ అధికారి







లైన్ క్లియర్

ఎట్టకేలకు అమరావతి రైల్వేలైనుకు కదలిక

రూ.2,047 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం

- 56 కిలోమీటర్ల నిడివి కలిగిన డీపీఆర్ పూర్తి
- ప్రాజెక్టుకు నీతి ఆయోగ్ అనుమతి
- ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానం
- అమరావతి స్టేషన్ ఏర్పాటుకు చర్యలు
- విజయవాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు రెడీ



విజయవాడ-గూడూరు థర్డ్‌లైన్ పనులకు రూ.500 కోట్లు

ఆర్థిక బడ్జెట్‌లో రాజధానికి ప్రాధాన్యమిచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ మరనాడే అమరావతి రైల్వేకు వరాలు కురిపించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అమరావతి రైల్వేలైనుకు పచ్చజెండా ఊపడంతో పాటు విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు అంగీకరించడంపై రాజధానివాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి నూతన రైల్వేలైనుకు కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ.2,047 కోట్లు కేటాయించింది. మొత్తం 56 కిలోమీటర్ల నిడివితో కూడిన లైనుకు సంబంధించి డీపీఆర్ కూడా పూర్తయింది. ఈ ప్రాజెక్టుకు నీతి ఆయోగ్ అనుమతించింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్.. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ విషయాన్ని బుధవారం విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ తెలిపారు. రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు, తెలుగు రాష్ట్రాల డీఆర్ఎంలతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కేటాయింపులను వివరించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఏపీకి రూ.9,152 కోట్ల కేటాయింపులు జరిపారని తెలిపారు. విజయవాడ-గూడూరు థర్డ్‌లైన్‌లో భాగంగా విజయవాడ నుంచి గుంటూరు వరకు నిర్మిస్తున్న మూడో లైన్ పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ పనుల కోసం రూ.500 కోట్లు కేటాయించారని చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ డివిజన్‌లో 23 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రణాళికలు జరుగుతున్నాయన్నారు. ఆగస్టు 10 నాటికి అవసరమైన చోట పాసింజర్ రైళ్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో వంటశాలల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోందని, విజయవాడ పరిధిలో 27 వంటశాలలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. పూర్తిస్థాయిలో విద్యుదీకరణ, జనరల్ బోగీల తయారీకి జనరల్ బడ్జెట్‌లో కేటాయింపులు చేయటం జరిగిందన్నారు.

50 ఏళ్లకు అనుగుణంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి

ఎంపీ కేశినేని చిన్ని బుధవారం పార్లమెంట్‌లో అమృత్ భారత్ పథకానికి సంబంధించి అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ మరిన్ని వివరాలు వెల్లడించారు. అమృత్ భారత్ స్టేషన్ కింద విజయవాడ రైల్వేస్టేషన్‌ను రీ-డెవలప్ చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రద్దీగా ఉండే విజయవాడ రైల్వే స్టేషన్‌ను రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. అభివృద్ధి పనులతో పాటు అమరావతి రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు కూడా ఒకేసారి చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు.





రూ. కోటితో మోటార్ల పంపిణీ

రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

- కార్యక్రమానికి తరలివచ్చిన పలు జిల్లాల ఎమ్మెల్యేలు

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. సొంత నిధులు రూ.కోటితో రైతుల పొలాలకు నీటిని తోడేందుకు 50 మోటార్లను పంపిణీ చేశారు.

6లో..

ఇంద్రకీలాద్రి పటిష్టతకు శ్రీకారం

- కూలిన కొండభాగంలో పనులు ప్రారంభం
- పరిశీలించిన ఈవో




వన్‌టౌన్, జూలై 24 : ఇంద్రకీలాద్రి దిగువన దుర్గాఘాట్ ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన కొంతకాలం కిందట కూలిపోయిన కొండభాగాన్ని పటిష్టపరచనున్నారు. ఈ మేరకు బుధవారం పనులకు శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, అర్చకులు పాల్గొన్నారు. అనంతరం ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులు పనులను పరిశీలించారు. దుర్గాఘాట్‌లో పరిశుభ్రత, పంచహారతులు సమర్పించే ప్రాంతంలో ఏర్పాట్లను కూడా ఈవో పరిశీలించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్

అక్రమార్కులకు అక్షయపాత్రగా అనుమంచిపల్లి యార్డు

6లో..

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరాచకాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. పోలవరం మట్టి, బ్రహ్మయ్య లింగం చెరువు మట్టిని తవ్వి కోట్లాది రూపాయలు ఆర్జించిన వంశీ, ఆయన అనుచరులు చివరికి పట్టా భూములనూ వదలని విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తమ ఆవేదన చెబుతున్నారు.





వంశీ, ఆయన అనుచరులు కబ్జా చేసి తవ్వకాలు సాగించిన మల్లవల్లిలోని భూమి

పట్టా భూములనూ చెరపట్టారు

మల్లవల్లిలో మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుల నిర్వాకం

5.30 ఎకరాల పట్టా భూమిలో 40 అడుగుల తవ్వకాలు

- రూ.7 కోట్ల విలువైన మట్టి తరలింపు
- భూ యజమానులు టీడీపీ మద్దతుదారులు కావడం వల్లే..
- వైసీపీలోకి రావాలని హుకుం.. రాకపోవడంతో భూమి కబ్జా

స్పందించకపోవడంతో పొలంలో పాగా.. అడ్డగోలు తవ్వకాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెందిన మెస్సర్స్ శివ క్రెడిట్స్ అనే సంస్థ బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోని సర్వే నెంబరు 12-2ఏ1లో సుమారు 5.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మెట్ట పొలాన్ని 2015లో కొనింది. ఈ సంస్థకు చెందినవారు 2019 ఎన్నికల సమయంలో గన్నవరం ఎమ్మెల్యేగా పోటీ చేసిన వంశీకి మద్దతుగా నిలిచారు. ఆర్థికసాయం కూడా చేశారు. ఆ తర్వాత సీన్ మారింది. వంశీ టీడీపీ నుంచి వైసీపీలో చేరడం, టీడీపీలో బలంగా ఉన్న వారిపై కక్షసాధింపు చర్యలకు దిగడం మొదలుపెట్టారు. అందులో భాగంగా మల్లవల్లిలో సర్వే నెంబరు 12-2ఏ1లోని భూమిపై వంశీ, ఆయన అనుచరుల కన్ను పడింది. ఇక వారి అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. ఆ భూమిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న వంశీ అనుచరులు సుమారు 40 అడుగుల లోతున మట్టిని తవ్వేసి, తరలించారు. దీనిపై స్థల యజమానులు మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. పైగా అసలు ఆ స్థలమే వారిది కాదంటూ వంశీ అనుచరులు అడ్డగోలు వాదనకు దిగారు. దీంతో ఏ అధికారీ అటువైపు చూడలేదు.

రూ.7 కోట్ల దోపిడీ

ఎకరా విస్తీర్ణంలో 10 అడుగుల లోతున మట్టి తవ్వితే వెయ్యి లారీల మట్టిని తరలించవచ్చు. ఈ లెక్కన 40 అడుగుల లోతున తవ్వకాలకు ఎకరాకు 4 వేల లారీల మట్టిని తరలించవచ్చు. ఈ లెక్కన వంశీ అనుచరులు మల్లవల్లిలోని సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో 24 వేల లారీల మట్టిని తవ్వి తరలించారు. లారీ మట్టి తక్కువలో తక్కువ రూ.3 వేల చొప్పున విక్రయించినా మొత్తంమీద రూ.7.20 కోట్లు అక్రమంగా ఆర్జించారు. ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా ఈ తవ్వకాలు జరిగిపోయాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయలు గండిపడింది. స్థల యజమానికి చెందిన పొలం ఎందుకూ పనికిరాకుండా పోయింది.

తీరు మారని రెవెన్యూ

రాష్ట్రంలో వైసీపీ పాలన ముగిసి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినా గన్నవరం నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల తీరు మాత్రం మారలేదు. గతంలో ఇక్కడ ఏళ్ల తరబడి తహసీల్దార్‌గా ఉంటూ వంశీకి నవ్వినబంటుగా పేరున్న నరసింహారావు ఇలాంటి అక్రమాలకు పెట్టింది పేరుగా మారారు. ఎన్నికల సమయంలో ఆయన్ను బదిలీ చేసినా ఆయన అనుచరగణం ఇంకా వైసీపీ నాయకులకు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు. మల్లవల్లిలోని పొలానికి సంబంధించి ఎలాంటి వివాదం లేకపోయినా వంశీ అనుచరుల మాట మేరకు.. వివాదాస్పదంగా చూపుతున్నారు. తాము కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు, మ్యుటేషన్ వివరాలను శివ క్రెడిట్స్ కంపెనీ యజమానులు సమర్పించినా, తమ భూమిలో అక్రమంగా జరిగిన మట్టి తవ్వకాల కారణంగా సరిహద్దులు తెల్చుకోలేకపోతున్నామని, సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరుతున్నా స్పందించడం లేదు. వైసీపీ నేతల ఒత్తిడితో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై కృష్ణాజిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కొలిక్కి..?

రెండు, మూడు రోజుల్లో జాబితా విడుదలయ్యే అవకాశం



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఊగిసలాటల మధ్య ఉన్న ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల్లో అధికారికంగా జాబితా విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సాధ్యమైనంత వరకు ఎమ్మెల్యేల సిఫార్సుల ప్రకారమే జాబితా రూపొందుతున్నట్టు సమాచారం. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఇన్‌స్పెక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంలో సీపీ ఉన్నారు. ఇప్పటికే సీపీని కలిసిన పలువురు ఎమ్మెల్యేలు తమ మనసులోని మాటను బయట పెట్టినట్టు తెలిసింది. ఏలూరు రేంజ్ నుంచి ఇక్కడికి వచ్చే వారి, ఇక్కడి నుంచి రేంజ్‌కు వెళ్లే వారి లెక్కలు తేలిపోయినట్టు సమాచారం. రెండు, మూడు రోజుల్లో బదిలీల జాబితా విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎవరెవరు..? ఎక్కడెక్కడికి..?

తూర్పు నియోజకవర్గంలో కీలకంగా ఉన్న పటమట పోలీస్‌స్టేషన్‌కు పవన్ కిషోర్ ఎస్‌హెచ్‌వోగా రాబోతున్నట్టు తెలిసింది. ఆయన ఇంతకుముందు ఇక్కడ పనిచేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కృష్ణాజిల్లాలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఆయన సూర్యలంక మెరైన్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనను పటమట ఎస్‌హెచ్‌వోగా నియమించడానికి ఆమోదముద్ర పడినట్టు తెలిసింది. ఇదే స్టేషన్ కోసం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ప్రయత్నాలు చేస్తున్నట్టు పోలీసువర్గాల్లో చర్చ నడుస్తోంది. ఆయనను కృష్ణలంక ఇన్‌స్పెక్టర్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో అత్యంత ప్రధానమైన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోటీ తీవ్రంగానే ఉంది. ఇంద్రకీలాద్రి ఈ స్టేషన్ పరిధిలోనే ఉండటంతో అమ్మవారి సేవలో పాల్గొనే అవకాశం ఉంటుందని ఇన్‌స్పెక్టర్లు భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ స్టేషన్‌కు దుర్గాశేఖర్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. ఈయన ఎన్నికల బదిలీల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చారు. సెంట్రల్ జోన్‌లో ఉన్న ఒక ఇన్‌స్పెక్టర్, కమిషనర్ కార్యాలయంలో ఉండే ఒక ఇన్‌స్పెక్టర్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో పోస్టును కోరుకుంటున్నారు. ప్రస్తుతం భవానీపురం ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఉమామహేశ్వరరావుకు వన్‌టౌన్‌లో పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. విజయవాడలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్లలో అన్ని సామాజికవర్గాల ఇన్‌స్పెక్టర్లకు ఎస్‌హెచ్‌వో అవకాశాలు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. దీనిప్రకారం దుర్గాశేఖర్‌రెడ్డిని దసరా నవరాత్రుల వరకు ఇక్కడే కొనసాగించే ఆలోచన చేస్తున్నట్టు వినికిడి. ఇదే కనుక జరిగితే భవానీపురం పీఎస్‌కు అటాచ్‌మెంట్‌పై ఉన్న ఉమామహేశ్వరరావుకు ఆ స్టేషన్‌నే ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి.

సెంట్రల్‌లో మార్పులు

సెంట్రల్ నియోజకవర్గంలో ఆరు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. సూర్యారావుపేట, గవర్నరుపేట, అజిత్‌సింగ్‌నగర్, గుణదల, నున్న పోలీస్‌స్టేషన్లు సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఇందులో సూర్యారావుపేట, గవర్నరుపేట దక్షిణ మండలం ఏసీపీ పరిధిలో, అజిత్‌సింగ్‌నగర్, నున్న ఉత్తర మండలం ఏసీపీ పరిధిలో ఉంటాయి. గుణదల మాత్రం సెంట్రల్ జోన్ పరిధిలో ఉంటుంది. ఈ ఆరింటిలో ఐదు పీఎస్‌లలో ఇన్‌స్పెక్టర్లను ఎన్నికల ముందు నియమించారు. అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను మాత్రం ఏడాది క్రితమే నియమించారు. ఇప్పుడు ఈ ఆరు పీఎస్‌ల్లో ఉన్న ఇన్‌స్పెక్టర్లను మార్చుకోవాలన్న ఉద్దేశంలో ఎమ్మెల్యే బొండా ఉమా ఉన్నట్టు తెలుస్తోంది.



మేధో మధనం

సెర్ప్, డీఆర్డీవో ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన మేధో మధన సదస్సు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే మహిళలకు మంచి సూచనలిచ్చింది. అందుబాటులోని అధునాతన యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, స్వీట్ షాపుల నమూనా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటుచేసిన అతిపెద్ద వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

6లో..

ఆదమరిస్తే అంతే సం'గోతులు'

అడుగు తీసి అడుగేస్తే గోతులు.. ఆదమరిస్తే అంతే సంగతులు.. కానూరు మెయిన్ రోడ్డు చూస్తేనే భయపడి వెనక్కి పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాహనదారులకు పట్టపగలే చుక్కలు చూపిస్తూ.. వర్షం పడితే నరకకూపంలా మారే ఈ రహదారి దాటడం ఓ పద్మవ్యూహమే. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. తాడిగడప మున్సిపాలిటీ అధికారుల అలక్ష్యం.. వెరసి ఇటుగా రాకపోకలు సాగించే వారి ప్రయాణం ప్రమాదకరంగా మారింది.



కానూరులోని సూపర్‌విజ్ రోడ్డు దయనీయ స్థితి ఇదీ..



కొండాలమ్మకు సారె తెస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కొండాలమ్మకు సారె సమర్పణ

గుడ్లవల్లేరు, జూలై 24 : ఆషాఢమాసం సందర్భంగా వేమవరం కొండాలమ్మ అమ్మవారికి ఆషాఢం సారెను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమర్పించారు. బుధవారం సారెతో ఎమ్మెల్యే హోదాలో ఆయన ఆలయానికి విచ్చేశారు. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాము మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రైతులకు పాడి పంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శేషవస్త్రంతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

27 నుంచి సుబ్రహ్మణ్యేశ్వర పవిత్రోత్సవాలు



మోపిదేవి, జూలై 24 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పవిత్రోత్రవాలు ఈ నెల 27 నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు 27వ తేదీ శనివారం గో పూజతో ప్రారంభమవుతాయన్నారు. స్వామివారి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక మహోత్సవాలు పురస్కరించుకుని నిత్య పూజలు, నిత్య కళ్యాణం తాత్కాలికంగా నిలిపివేయటం జరుగుతుందని ఈవో తెలిపారు.



గణిత ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

విద్యార్థులకు జీవిత పాఠాలు బోధించాలి

▸ గణిత ఉపాధ్యాయుల శిక్షణలో దేవానంద్‌రెడ్డి

భవానీపురం, జూలై 24 : చదువంటే పరీక్షలు, ఫలితాలు ఎంత మాత్రం కాదని, జీవితాన్ని నేర్పేదే చదువుకు పరమార్థం అని ఎస్ఎస్‌సి ఎగ్జామినేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ డి. దేవానంద్‌రెడ్డి అన్నారు. భవానీపురంలోని ఓ పంక్షన్ హాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం, ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ సంయక్తంగా మారిన టెన్త్ సీబీఎస్సీ సిలబస్‌పై ఒక రోజు గణిత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి దేవానంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గణితంపై భయం పోయేలా ప్రాథమిక స్థాయి నుంచి అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపాధ్యాయుల్లో నూతన ఉత్తేజం తీసుకువస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ, ఏపీ మ్యాథమెటిక్స్ ఫోరం గత కొద్ది సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు గణితంలో ఆసక్తి కలిగేలా బోధిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా మల్లిఖార్జునరావు వ్యవహరించగా రిసోర్సు పర్సన్లు భాస్కర్‌రెడ్డి, రవిశంకర్, సోమశేఖర్, నజీర్ హుస్సేన్‌లు టెన్త్ నూతన సిలబస్, రాబోయే ప్రశ్నాపత్నం మోడల్స్, ఇంకా సాంకేతికంగా గణిత బోధనా అభ్యసన ఉపకరణాలపై కూలంకషంగా ఉపాధ్యాయులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డైట్ లెక్చరర్ పి.లలిత మోహన్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కరుణాకర్, విజయవాడ బాధ్యులు డీవీ మురళీ ప్రసాద్‌లు ఎన్టీఆర్ జిల్లా నుంచి 300 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన గణిత ఉపాధ్యాయులు 70 మందిని సత్కరించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన సీపీ



విజయవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విజయాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలో ఉన్న ఆయన కార్యాలయానికి బుధవారం వెళ్లారు. పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళలు, అమ్మాయిల అదృశ్యాల కేసులకు సంబంధించి వారి మధ్య చర్చ జరిగినట్టు తెలిసింది.



శ్రీకాకుళంలో హేచరీని పరిశీలిస్తున్న మత్స్యశాఖ ఏడీ ప్రతిభ, అధికారులు

ఫీడ్ మిల్లులు, హేచరీల తనిఖీ

చల్లపల్లి, జూలై 24 : మత్స్యశాఖ అవనిగడ్డ డివిజన్ ఏడీ ఆర్.ప్రతిభ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం ఫీడ్‌మిల్లులు, హేచరీలను తనిఖీ చేశారు. చల్లపల్లిలోని రెండు ఆక్వాఫీడ్స్ కర్మాగారాలను, శ్రీకాకుళంలోని రొయ్యపిల్లలను సరఫరా చేసే హేచరీని టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి తనిఖీ చేసినట్టు ఏడీ ప్రతిభ చల్లపల్లిలో తెలిపారు. హేచరీలో నిబంధనల మేరకు ఉత్పత్తి జరుగుతుందో లేదో పరిశీలించినట్టు చెప్పారు. నాణ్యమైన సీడ్‌ను రైతులకు అందించాలని హేచరీ నిర్వాహకులకు సూచించారు. ఆక్వాఫీడ్స్‌లో మేత తయారుచేసే విధానం, ముడిపదార్థాలు ఎక్కడి నుంచీ తీసుకువస్తున్నారో పరిశీలన చేసి శాంపిల్స్ సేకరించామని, వాటిని నెల్లూరులోని ఎంపెడా ల్యాబ్‌కు పంపనున్నట్టు చెప్పారు. పరిశీలనపై టాస్క్‌ఫోర్స్ బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపెడా ఏడీ సెబాషీస్ మహంతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బీగోపాలకృష్ణ, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ స్వామిశేఖర్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరు మారని పంచాయతీ అధికారులు!

▸ బకాయిల వసూళ్లలో ఉదాసీనత.. గ్రామస్థుల ఆవేదన

నందివాడ (పొలుకొండ), జూలై 24 : ప్రభుత్వం మారినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టు సిబ్బందికి గత 8 నెలలుగా జీతాలు లేని పరిస్థితి ఉందని, పంచాయతీ కార్యదర్శి చుట్టం చూపులా వెళ్లటం తప్ప రావాల్సిన నిధులు వసూలు చేయటం లేదని వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చెరువు పాటలో ఎవరు పాడకపోవటంతో ఎస్టిమేట్ మార్చి చేపల పాట పెట్టాలని గ్రామస్థులు కోరి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు దాని ఊసే లేదన్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ అధికారుల అండ పూర్తిగా ఉండటంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, గ్రామస్థులు, టీడీపీ నేతలు తాతినేని వెంకట కృష్ణారావు, పిన్నమనేని నరసింహారావు తదితరులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంచాయతీ బకాయిలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అసెంబ్లీ వాయిస్..

ఆర్బీకేలతో రైతుకు ప్రయోజనం శూన్యం

▸ గళం విప్పిన బోడె ప్రసాద్



పెనమలూరు, జూలై 24 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన రైతుల సమస్యలపై గళమెత్తారు. పంట కాల్వల మరమ్మతులు లేకపోవడం, వర్షపునీరు పొలాల నుంచి బయటికి వెళ్లకపోవడం, కాల్వల నీరు సక్రమంగా చేరకపోవడం తదితర కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారన్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారార్భాటం కోసమే ఆర్బీకేలను ఏర్పాటు చేసిందని, రైతులు లేనిచోట ఆర్బీకేలను లక్షలు పోసి నిర్మించి ప్రజాధనం వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు తేమ శాతం సాకుగా కనీస మద్దతు ధరను తగ్గించడం, ధాన్యం డబ్బును రైతులకు ఖాతాల్లో వేయకపోవడంతో వారు ఆందోళనలో ఉన్నారని ప్రభుత్వ దృష్టికి తెచ్చారు. ఇప్పటికీ మిల్లర్లు రైతులకు పదహారు వందల కోట్లు బకాయిలు ఉండటం దారుణమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి వ్యవసాయ మంత్రి కృషి చేయాలన్నారు.



తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో యంత్ర పరికరాలు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

▸ మేధో మధన సదస్సును ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన





యంత్ర పరికరాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, జూలై 24 : పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలని మహిళా సారధ్య పరిశ్రమలపై సెర్ప్, డీఆర్డీవో ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన మేధో మధన సదస్సును ప్రారంభించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ తదితర పథకాలలో రాయితీపై రుణాలు పొంది నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న యంత్రాలు, వ్యవసాయ డ్రోన్లు, స్వీట్ షాపులు తదితర నమూనాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సదస్సులో ఆమె మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు పేదరికాన్ని రూపుమాపి మహిళలను ఆర్థిక సాధికారిత దిశగా నడిపించేందుకు అనువుగా ఉన్నాయన్నారు. వాటిపై మహిళలను చైతన్యం చేయడం కోసమే సదస్సు లక్ష్యమని తెలిపారు. పీఎంఈజీసీ, పీఎంఎఫ్ఎంఈ, స్టాండప్ ఇండియా వంటి పథకాలలో ఆసక్తి ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో పదివేల యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు, వీటిలో ఐదువేల యూనిట్లు సెర్ప్, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటుకు ప్రోత్సహించనున్నట్టు చెప్పారు. లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మేధో మధన సదస్సు లక్ష్యాలను డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు వివరించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు(లింకేజీ) తదితర అంశాలను ఏపీ సెర్ప్ డీజీఎం ఎం.కేశవకుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. స్త్రీనిధి ఎండీ నాంచారయ్య, పీఎంఎఫ్ఎంఈ జోనల్ మేనేజర్ జనార్దన్, వ్యవసాయ శాఖ అధికారి సాకా నాగమణెమ్మ, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.విద్యాసాగర్, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏపీ ఎంఐసీ పీడీ పీఎం సుభాని, స్కిల్ సెంటర్ అధికారి నరేష్, కేవీఐపీ డైరక్టర్ గ్రీస్, అధికారులు, యూబీఐ రీజనల్ హెడ్ ఎం శ్రీధర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక ఎస్‌బీఐ ఉత్తర విభాగం ఆర్‌ఎం రాఘవరావు, పశ్చిమ విభాగం ఆర్‌ఎం నవీన్‌బాబు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాజేష్, ఎస్‌జీబీ ఆర్‌ఎం జీవీఎం ప్రసాద్, కెనరాబ్యాంక్ అధికారి కె.వి నీత, సెంట్రల్ బ్యాంక్ ఆర్‌ఎం సతీష్, బీఓబీ రీజియనల్ హెడ్ చందన్ సాహు, ఆప్కాబ్ జీఎం రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

▸ పొలంబడి కార్యక్రమాలతో రైతులకు అవగాహన

▸ కృష్ణా కలెక్టర్ బాలాజీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పంటలసాగులో మేలైన యాజమాన్యపద్ధతులు పాటించి, తక్కువపెట్టుబడితో అధికదిగుబడులు సాధించే విధంగా రైతులకు పొలంబడి క్యాక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో బుధవారం వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులకు పొలంబడి కార్యక్రమంలో ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలను రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా తెలియజేయాలన్నారు. విత్తనం నాటిన నాటినుంచి పంటలకు ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తే తక్కువ పెట్టుబడితోనే అధికదిగబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఖరీఫ్‌సీజన్‌లో 14వారాల పాటు రైతులకు పొలంబడి కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పంట మార్కెట్‌లో విక్రయించే సమయానికి వివిధ పంటలలో పురుగుమందులు, ఎరువుల అవశేషాలు ఎంతమేర ఉన్నాయనే అంశంపై నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు పరిశీలన చేస్తుందన్నారు. ఈ నివేదిక ఆధారంగా సేంద్రీయ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ పంటలలో నాణ్యతను నిర్ధారిస్తుందన్నారు. ఈ సర్టిఫికెట్ ఆధారంగా రైతులు పండించిన ఉత్పత్తులను 135 దేశాలలో రైతులు, లేదా రైతుసంఘాల ద్వారా అధిక ధరలకు విక్రయించుకునే వెసులుబాటు వస్తుందన్నారు. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. గతంలో మాదిరిగా కాకుండా పొలంబడి కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన అధికారులు గ్రామాలకు వెళ్లి రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించి నాణ్యమైన ఉత్పత్తులను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఎస్.పద్మావతి మాట్లాడుతూ, జిల్లానుంచి నాచురల్ ఫార్మింగ్ డీపీఎం కె.పార్థసారథి, గూడూరు, బంటుమిల్లి వ్యవసాయశాఖ అధికారులు జీవీ శివప్రసాద్, బి.శివరాం రాష్ట్ర స్థాయిలో పొలంబడి కార్యక్రమంలో శిక్షణపొంది మాస్టర్ ట్రైనర్లుగా ఉన్నారని తెలిపారు. వారు జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారని, ఇక్కడ శిక్షణ పొందినవారు క్షేత్రస్థాయిలోని సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ సుధారాణి, డీడీ మనోహరరావు, ఏడీలు, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి


▸ కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై జేసీ గీతాంజలి శర్మతో కలిసి వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంకా ప్రారంభం కాని పనులకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు. పెండింగ్‌లో, నిర్మాణ దశలో ఉన్న పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, జరగుతున్న పనులు, అసలు ప్రారంభం కాని పనుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం ఎస్ఈ విజయకుమారి, డ్రైనేజీ విభాగం ఈఈ విజయలక్ష్మీ, నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాసరావు, భూగర్భగనులశాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ. కోటితో మోటార్ల పంపిణీ

▸ రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

▸ కార్యక్రమానికి హాజరైన పలు జిల్లాల ఎమ్మెల్యేలు, నేతలు



రైతులకు మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, హాజరైన ఎమ్మెల్యేలు

గుణదల, జూలై 24 : ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి విజయం సాధించడం తనకు చేతకాదని.. దానికి నిదర్శనమే కోటి రూపాయలు సొంత నిధులు వెచ్చించి రైతులకు 50 మోటార్లు పంపిణీ చేయడం జరిగిందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పార్టీ కార్యాలయంలో రైతులకు మోటార్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి కూటమి ఎమ్మెల్యేలు 11మంది హాజరయ్యారు. ఆరుగాలం కష్టపడే నియోజకవర్గ రైతులకు మోటార్లు పంపిణీ చేస్తానని ఇచ్చిన హామీలో భాగంగా సొంత నిధులనుంచి కోటి రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని యార్లగడ్డ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. గతంలోనూ 2019లో సొంత నిధులతో 18 మోటార్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మోటర్ల కొరత ఉందని కొంతమంది రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఎన్నికల ప్రచారంలో రైతులను నీటి ఎద్దడి నుంచి ఆదుకుంటానని మాట ఇచ్చానని చెప్పారు. నియోజకవర్గం నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 37 వేల మెజరిటీతో తనను గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

పుచ్చలపల్లి, కాకాని అడుగుజాడల్లో..

నియోజకవర్గంలో ఎటువంటి అవినీతి చేయబోనని, పుచ్చలపల్లి సుందరయ్య, కాకాని వెంకటరత్నంల అడుగుజాడల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తానని యార్లగడ్డ హామీ ఇచ్చారు. మల్లవల్లికి అశోక్‌లేలాండ్ సంస్థను తీసుకువచ్చి రీఓపెనింగ్ చేయించినట్టు చెప్పారు. జీడిమెట్ల నుంచి 150మంది పారిశ్రామికవేత్తలు గన్నవరంలో పరిశ్రమలకు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో గన్నవరం నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా.. మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో 15వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే మళ్లీ ఓటు అడగనని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రామవరప్పాడు, ఎనికేపాడు గ్రామాల్లో ఏలూరు కాల్వపై వంతెనలు ఏర్పాటు చేయించనున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో భూదందాలు, సెటిల్మెంట్లు, ఆక్రమణలు అక్రమ వ్యాపారాలు చాలా జరిగాయన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ల రాము, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, రాజం ఎమ్మెల్యే కోండ్రం మురళీమోహన్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్, నియోజకవర్గ కూటవి ు నేతలు పాల్గొన్నారు.

క్వారీలో కృష్ణాజిల్లా వాసి మృతి



పెదకాకాని, జూలై 24 : పెదకాకాని పీహెచ్‌సీ సమీపంలోని ఓ క్వారీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పెదకాకాని పోలీసులు బుధవారం తెలిపారు. వినుకొండ మండలం తాగుకుంట్ల గ్రామానికి చెందిన కడియాల వెంకట కృష్ణారావు(58)గా అతడ్ని పోలీసులు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

మచిలీపట్నం టౌన్, జూలై 24 : పెడన శివారు వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన భట్టు నాగవిఘ్నేశ్వరరావుకు మచిలీపట్నం ఫోక్సో కోర్టు న్యాయాధికారి గాజుల వెంకటేశ్వరరావు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. పెడన గ్రామానికి చెందిన మైనర్ బాలిక నిందితుడి ఇంటికి ఆడుకునేందుకు వెళ్లగా అతను ఆ బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి హత్యాచారం చేశాడు. దీనిపై పెడన పోలీసు స్టేషన్‌లో 2015 జూన్‌లో కేసు నమోదైంది.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్



జగ్గయ్యపేట రూరల్, జూలై 24 : తెలంగాణాకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని గండ్రాయి వద్ద అడ్డుకుని నిందితులపై ఓల్టా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. పెనుగంచిప్రోలు మండలం తోటచర్ల గ్రామానికి చెందిన కుంటముక్కల వెంకట శివకృష్ణకు చెందిన టీఎస్ 29 టీఏ 0789 లారీలో ఇసుకను తరలిస్తున్న చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెంకు చెందిన డ్రైవర్ కుంచం మహేష్, క్లీనర్ తాళ్లూరి గోపీలపై ఓల్టా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా.. వెంకట శివకృష్ణకు చెందిన టీఎస్ 29 టీఏ 0789 లారీలో తెలంగాణాకు ఇసుక తరలిస్తుండగా శనివారం రాత్రి గరికపాడు వద్ద లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన సంగతి విదితమే. అదే యజమానికి చెందిన మరో లారీని మంగళవారం రాత్రి గండ్రాయి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు లారీలు ఒకరివే కావటం.. పోలీసులు కేసు నమోదు చేసినా మరల ఇసుక తరలిస్తూ పట్టుబడటం విస్మయం కలిగిస్తున్నది.

అనుమంచిపల్లి ఇసుక యార్డు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ ఎస్ఐ సునీల్‌కమార్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించగా ఎస్ఐ సతీష్ ఓల్టా కేసు నమోదు చేశారు.

అక్రమాలకు అక్షయపాత్రగా అనుమంచిపల్లి యార్డు!

ఇసుక అవసరం ఉన్న వారికే సరఫరా చేయాలనే నిబంధన లేకపోవటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ యాజమానులతో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఇసుకను ఒక చోట డంప్ చేసి అనంతరం లారీల్లో తెలంగాణాకు తరలిస్తు టన్నుకు అదనంగా రూ. 700లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. స్టాకు యార్డును ప్రైవేట్ వ్యక్తికి అప్పగించటంతో వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అనుమంచిపల్లి గ్రామం తెలంగాణాకు కూతవేటు దూరంలో ఉండటం కూడా కలిసొచ్చే అంశంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయటంతో పాటు నిజమైన లబ్ధిదారులను గుర్తించి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వాసులు డిమాండ్ చేస్తున్నారు.



తనిఖీలు చేస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

రూ. 26 లక్షల విలువైన రేషన్ బియ్యం స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, జూలై 24 : చిల్లకల్లు సమీపంలో జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ. 26 లక్షల విలువ చేసే రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని పెద్దవడ్లపూడి నుంచి లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేసి లారీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తులసీ గోల్డ్ పేరుతో 25 కిలోల సంచుల్లో వెయ్యి సంచుల్లో పాలిష్ బియ్యాన్ని ముంబైకు తరలిస్తున్నట్టు తెలిసిందని బియ్యం శాంపిల్స్ సేకరించి జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులకు పంపుతున్నామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. చిల్లకల్లు పోలీసుల అదుపులో లారీ ఉంది. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరుగుతుందన్నారు. లారీ వే బిల్లుల్లో మాత్రం రూ. 8.75 లక్షల బియ్యాన్ని ముంబైలోని రిషి ట్రేడింగ్ కంపెనీకి పంపుతున్నట్టు ఉందన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 24 : జవహర్ విద్యాలయలో 6వతరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయలో 6వ తరగతి నుంచి ఉచిత వసతి, చదువుతో పాటు ఆటపాటలతో వికాసం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వ అధీనంలో విద్యాలయాలను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6వతరగతిలో ప్రవేశానికి ప్రకటన వెలువడిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామీణప్రాంత విద్యార్థులకు 75శాతం, దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విదార్థులకు ప్రభుత్వ రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు.

అర్హత వివరాలు : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, 2013 మే 1 తేదీ నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జెన్వీ సెట్(జవహర్ నవోదయ సెలక్షన్ టెస్ట్)2025-26 ద్వారా నిర్వహించే ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు 16-09-2024 చివరితేదీ అని, ప్రవేశపరీక్ష ఫేజ్-1 18-01-2025న, ఫేజ్-2 12-04-2-25న జరుగుతాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ప్రకటనలో వివరించారు.

దుర్గమ్మకు సారె

చిట్టినగర్, జూలై 24: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి 48వ డివిజన్ ఆంజనేయవాగు కొండప్రాంత మహిళలు బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. ఆంజనేయవాగు నుంచి పెద్ద ఎత్తున మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి సారెను సమర్పించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం: భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్ల కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు టీచర్ల కాలనీ, అప్నా బజార్ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని కాలని, దర్గా ప్లాట్లు 400 అడుగుల బ్లాకుల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈ ఈ బీ మీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఠాగూర్ గ్రంథాలయంలో, రామ్మోహన్ గ్రంథాలయంలో అయ్యంకి జయంతి వేడుకలు

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు

గవర్నర్‌పేట, జూలై 24: గ్రంథాలయాల స్థాపనలో అయ్యంకి వెంకట రమణయ్య కృషి వెలకట్టలేనిదని సరస్వతీ సామ్రాజ్య సంస్థ అధ్యక్షుడు ఏ. మురళీకృష్ణ అన్నారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా గ్రంథాలయాల విస్తరణకు అయ్యంకి చేసిన సేవల్ని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు కోటా కృష్ణభగవాన్, జె. పద్మజ, ఎం.పవన్, పి. చిదంబరేశ్వరరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీటినే అందించండి

ఇన్‌చార్జ్ కమిషనర్ మహేష్

అజిత్‌సింగ్‌నగర్, జూలై 24 : ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీటినే అందించాలని ఇన్‌చార్జ్ కమిషనర్ ఏ. మహేష్ సంబంధిత అధికారులకు సూచించారు. 58వ డివిజన్‌లోని ఇందిరానాయక్ నగర్, నందమూరినగర్, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మంచినీటి విభాగపు అధికారులతో కలసి మంచినీటి పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం తాగునీటి పరీక్షలు నిర్వహించి ప్రజలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

కేదారేశ్వరపేటలో కమిషనర్ పర్యటన

పాత రాజరాజేశ్వరిపేట : కేదారేశ్వరపేటలోని పలు ప్రాంతాల్లో ఇన్‌చార్జ్ కమిషనర్ ఏ. మహేష్ బుధవారం పర్యటించారు. ముందుగా 225, 226 సచివాలయల్లోకి వెళ్లి సిబ్బంది అటెండెన్స్ రిజిస్ట్రర్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రీ వెలగపూడి లక్ష్మణ దత్తు ఎలిమెంటరీ పాఠశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి గణితంలో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కేదారేశ్వరపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం, రోజు వారి మెనూ పరిశీలించారు. ఎస్సీ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి అక్కడి విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్ రమ్య కీర్తన ఉన్నారు.



మంచినీటిని పరీక్షిస్తున్న కమిషనర్ మహేష్

కాచి చల్లార్చిన నీటినే తాగండి

భవానీపురం: నగరపాలక సంస్థ సరఫరా చేసే నీటిని ప్రజలు కాచి చల్లార్చి తాగాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విస్తారంగా వర్షాలు పడటానికి తోడుగా పోలవరం ప్రాజెక్టు నుంచి వరద నీరు రావడం వలన, వీఎంసీ అధికారులు నీటిని శుద్ధి చేసినా అది ప్రజలకు సరఫరా అయ్యే నీరు బురదగా ఉండటం వలన ప్రజలు కాచిన నీటినే తాగాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కరాటే విజేతలకు అభినందనలు



విజేతలతో స్కూల్ డైరెక్టర్ సూర్యారావు

చిట్టినగర్, జూలై 24: ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన ఓ. దుర్గా శేషు, పీ. ఆశ్రితా రత్న శ్రీ, ఐ యషిత, జి. కావ్యశ్రీలను బుధవారం చిట్టినగర్ స్కూల్లో అభినందన సభ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిట్టినగర్ గౌతమ్ స్కూల్ డైరెక్టర్ లయన్ ఎన్.సూర్యారావు మాట్లాడుతూ తమ స్కూల్లో నాణ్యతా ప్రమాణాలతో మంచి విద్యాబుద్ధులతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. కరాటే శిక్షకులు జేఎం. దాస్, ఎండీ ఆర్.బాషా, స్కూల్ ప్రిన్సిపాల్ పి.తులసీ, సునీత, కుందన, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఏకేటీపీఎం పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింగళి రాయల్



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

సత్యనారాయణపురం, జూలై 24: దాతల సహకారంతో చక్కగా చదువుకొని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఏకేటీపీఎం పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింగళి రాయల్ అన్నారు. సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 2023-24లో పాఠశాలలో 10వ తరగతిలో పాఠశాలలో ప్రథమ, ద్వీతీయ, తృతీయ స్థానాలో నిలిచిన విద్యార్థులకు, ప్రతీ సెక్షన్‌లో ప్రథమశ్రేణి పొందిన వారికి బుధవారం నగదు పారితోషికాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. ప్రభుత్వం పేద మధ్యతరగతి వారు చదువుకొనేందుకు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని,వాటితో పాటు దాతల సహకారంతో చక్కగా చదువుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థులు వసుంధర, సుబ్బరాయశర్మ, సత్యనారాయణమూర్తి, సాంబశివరావు, ఉప్పు రంగప్రసాద్, శరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులూ..స్క్రీన్ టైమ్ తగ్గించుకోండి

నలందా కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట, జూలై 24: నలంద డిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్యూస్ స్క్రీన్ టైమ్ డిజిటల్ వెల్‌నెస్ క్యాంపస్ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఇందిరా గాంధీ స్టేడియం నుంచి రెడ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు స్క్రీన్ టైమ్ తగ్గించుకుని ఇండోర్ అండ్ అవుట్‌డోర్ ఏక్టివిటీస్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ మన్నె వెంకటరత్నం విద్యార్థులకు స్క్రీన్ ఎక్కువ వాడటంవలన సంభవించే ఫిజికల్, సైకాలజికల్ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఫిరోజ్‌ఖాన్, కుమారి భార్గవి పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ మన్నె వెంకటరత్నం

చిన్నారులకు గొడుగుల పంపిణీ

గవర్నర్‌పేట, జూలై 24: సీవీఆర్ మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలోని బాలసదన్‌లోని 50 మంది చిన్నారులకు 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి సొంత నిధులతో గొడుగులను పంపిణీ చేశారు. బాలసదన్ నుంచి బిషప్ హజరయ్య స్కూల్‌కు వెళ్లేందుకు వర్షాకాలంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న బాలస్వామి స్పందించి బుధవారం బాలసదన్ సందర్శించి గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ సూపరింటెండెంట్ సూర్యకుమారి, బాలసదన్ సూపరింటెండెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 24 : తన కుమార్తె కనిపించడం లేదని ఓ వ్యక్తి బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బాలిక(17) ఇంటి దగ్గరలోని మదర్సాలో ఊర్దూ నేర్చుకుంటుంది. బుధవారం కుటుంబ సభ్యులు విధుల నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి బాలిక కనిపించలేదు. చుట్టుప్రక్కల ప్రాంతాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో వెతికిన బంధువులకు బాలిక ఆచూకీ తెలీలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 24 : బాలికను ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి తీసుకెళ్లిన యువకుడిపై బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం న్యూ ఆర్‌ఆర్‌పేటకు చెందిన బాలిక(14) మంగళవారం సాయంత్రం ప్రైవేట్‌కు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. అదే ప్రాంతానికి చెందిన సాల్మన్(19) బాలికకు మాయమాటలు చెప్పి ప్రైవేట్‌కు వెళ్లకుండా అడ్డుకుని తన ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఉదయానికి సాల్మన్ బాలికను ఇంటికి పంపించేశాడు. బాలికను ప్రశ్నించగా జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపుపై హర్షం

● బీజేపీ తూర్పు ఇన్‌చార్జి పోతంశెట్టి

పటమట, జూలై 24 : రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్ల కేటాయింపు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం బాధ్యతపై భరోసా, వైజాగ్-చెన్నై కారిడార్ నిర్మాణానికి కేంద్రం బడ్జెట్‌లో ఊతం ఇవ్వడంపై బీజేపీ తూర్పు ఇన్‌చార్జి పోతంశెట్టి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడిన జిల్లాలకు జిల్లాకు రూ.50 కోట్ల కేటాయింపు, స్టీల్‌ప్లాంట్‌కి రూ.690 కోట్లను, మధ్య తరగతి ప్రజలకు రూ. 3 లక్షలు వరకు ఆదాయం పన్ను మినహాయింపు ఇవ్వడంపై, ప్రపంచ బ్యాంకు ఆర్థికసాయంతో పలు ప్రాజెక్టులు ఏపీకి వస్తాయని, ఈ విషయంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాన నరేంద్రమోదీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పశ్చిమలో డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



జోనల్ కమిషనర్ రమ్యకీర్తనతో కలిసి పర్యటించిన డివిజన్ నాయకులు

విద్యాధరపురం, జూలై 24: పశ్చిమలో డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ చెప్పారు. బుధవారం జోనల్ కమిషనర్ బి రమ్యకీర్తనతో కలిసి 40వ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. బ్యాంక్ సెంటర్ కోళ్ళఫారం రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, బాలభాస్కరర నగర్‌లలో రోడ్లు, పారిశుధ్య నిర్వహణ, మురుగనీటిపారుదల, వీధిదీపాలు తదితర అన్ని అంశాలను పరిశీలించారు. బాలభాస్కర్‌నగర్‌లో వీధి దీపాలను త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని అన్నారు. చెత్తతొలగింపు, మురుగునీటి కాలువలలో పూడిక తీత తదితర అంశాలలో రమ్యకీర్తన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ సుబ్బయ్య, ఏఈ అహ్మద్, టౌన్ ప్లానింగ్ అధికారి గ్రంధం ప్రసాద్, ఏఈ రవీంద్ర తదతర కార్పోరేషన్ సిబ్బంది పాల్గొన్నారు,

వాంబేకాలనీలో చోరీ

పాయకాపురం, జూలై 24 : వాంబేకాలనీలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల ప్రకారం వెల్లట్ల పద్మ కాలనీలోని బీ బ్లాక్‌లో కుటుంబ సభ్యులతో ఉంటుంది. మంగళవారం రాత్రి పద్మ ఇంటి కింద పోర్షన్‌కు తాళం వేసి మొదటి అంతస్తులో నిద్రించింది. బుధవారం ఉదయం లేచి కిందకి వచ్చి చూడగా తాళం పగుల కొట్టి తలుపులు తెరచి ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం బీరువా తలుపులు తెరచి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే బీరువాలో ఉండాల్సిన రూ. 1.85 లక్షల నగదు, ఐదు కాసుల బంగారపు ఆభరణాలు, 80 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు నున్న రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కోంది.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్జీవో సంస్థలు ప్రచారం చేయాలి

● నేషనల్ హైవే ఆర్వో ఆర్.కె.సింగ్ సూచన

లబ్బీపేట, జూలై 24: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఎన్‌జీవో సంస్థలు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని నేషనల్ హైవే ఆర్వో ఆర్.కె.సింగ్ సూచించారు. బుధవారం నేషనల్ హైవే కార్యాలయంలో రోడ్డు భద్రతా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందని, రోడ్డు ప్రమాదాలలో వాహనదారులు మరణిస్తూ ఉన్నారని దీని నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఎన్‌జీవో సంస్థలు ముందుకు రావాలని అన్నారు. రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె. దుర్గ పద్మజ, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు బేతు రామమోహనరావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేషనల్ హైవే అధికారి సింగ్ తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన



విద్యాధరపురం, జూలై 24: సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమని, సైబర్ నేరాలు చేయొద్దు, నేరగాళ్ల పాలిట పడవద్దని భవానీపురంలోని ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం వెస్ట్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతాయి, వాటి పై అవగాహన లేక ప్రజలు ఎలా మోసపోతారన్న అంశాలను సోదాహరణంగా వివరించారు. వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు, సైబర్ క్రైం సీఐ శ్రీను, ఎస్ఐ మూర్తి, భవానీపురం ఎస్ఐ ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

● అడిషనల్ కమిషనర్ సత్యవతి



అజిత్‌సింగ్‌నగర్, జూలై 24 : ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని అడిషనల్ కమిషనర్ సత్యవతి అన్నారు. నగరంలో కాలుష్య నివారణకు నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో బుధవారం ఆమె మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ వీఎంసీ పరిధిలోని 36 డంపింగ్ స్టేషన్లలో 1000 మొక్కలు నాటుతున్నామని తెలిపారు. తద్వారా ప్రజలకు వాయువులో ఆక్సిజన్ శాతాన్ని పెంచి కార్బన్‌డయాక్సైడ్ శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలియజేశారు.



ప్యారిస్ వేదికగా శుక్రవారం నుంచి ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా లండన్ చేరుకున్నారు. అక్కడున్న హైడ్ పార్క్‌లో రామ్‌చరణ్, ఉపాసన, మనవరాలు క్లీంకారాతో ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గురువారం మెగా కుటుంబం పారిస్ వెళుతుంది.

గుర్తుండిపోయే పాత్ర



సందీప్ కిషన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తమిళ నటుడు ధనుశ్ స్వీయ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. కళానిధి మారన్ నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ధనుశ్ నటించిన 50వ చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తగ్గట్లే ఆయన ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డారు. అద్భుతమైన స్ర్కీన్‌ప్లేతో నడిచే ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకం. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఇది. సినిమాలో యాక్షన్ మాత్రమే కాకుండా మనసుకు హత్తుకునే భావోద్వేగాలు, అందరినీ అలరించే వినోదం ఉంటుంది. ఇది 'రాయన్' అనే ఇంటిపేరు గల ఓ ఫ్యామిలీతో ముడిపడిన కథ. సినిమాలో వచ్చే ప్రతీ పోరాట ఘట్టం ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు. ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు సినిమాకు అదనపు ఆకర్షణ" అని చెప్పారు.

అంతర్యుద్ధాన్ని ఆవిష్కరించేలా...



'పలాస 1978', 'నరకాసుర' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో ముచ్చటించారు.

"ఇది కొత్తతరానికి బాగా చేరువయ్యే థ్రిల్లర్. నాన్న వెంకట సత్యకు దర్శకుడిగా ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఈ సినిమా ప్రతీ మనిషిలో జరిగే ఆలోచనల అంతర్యుద్ధాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుంది. ఇందులో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఓ విభిన్నమైన ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులు తమ టికెట్‌కు వంద శాతం న్యాయం జరిగిందని భావిస్తారు" అని చెప్పారు.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. 'బీఎస్ఎస్ 12' వర్కింగ్ టైటిల్. లుదీర్ బైరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో కల్ట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోందని నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్ ఆర్.

హీరోగా రాజ్‌తరుణ్ అందుకే



రాజ్‌తరుణ్, హాసిని జంటగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వంలో డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్‌భీమన, నిర్మాత డా.రమేశ్ తేజావత్, హీరోయిన్ హాసిని మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు రామ్‌భీమన మాట్లాడుతూ "మా బడ్జెట్‌కు తగ్గ హీరో కోసం అన్వేషిస్తున్న క్రమంలో రాజ్‌తరుణ్ అయితే అన్ని విధాలా బావుంటుందనిపించింది. అందుకే ఆయన్ని హీరోగా తీసుకున్నాం" అని చెప్పారు. నిర్మాత డా. రమేశ్ తేజావత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబమంతా కలసి చూసేలా సినిమాను రూపొందించాం. ప్రతీ సన్నివేశాన్ని ఎంతో క్వాలిటీతో తెరకెక్కించాము" అని తెలిపారు. హీరోయిన్ హాసిని మాట్లాడుతూ "ఇందులో నాకు, రాజ్ తరుణ్‌కు మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అద్భుతంగా ఉంది. నేను పోషించిన పాత్ర అందరికీ నచ్చుతుంది. సినిమాలో ఏడు పాటలున్నాయి. వేటికవే ప్రత్యేకంగా ఉండే ఆ పాటలు తెరపై ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి" అని చెప్పారు.

పాటల రేవులో సాహితీ సంగమం



మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించే ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'రేవు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆగస్టు రెండో వారంలో విడుదల కోసం సిద్ధమైంది. ఈ సినిమా ఆడియో వేడుక బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. ఐదుగురు ప్రముఖ గీతరచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొనడం ఒక విశేషమైతే, చాలా ఏళ్ల తర్వాత క్యాసెట్ రూపంలో ఈ ఆడియోను విడుదల చేయడం మరో విశేషం.

గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'నవ్యత, నాణ్యత ఈ చిత్రంలో కనిపించాయి. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. 'కంటెంట్ ఉన్న వైవిధ్యమైన సినిమాలు రావాలంటే పర భాషల వైపు చూస్తుంటాం. కానీ 'రేవు' సినిమా పాటలు విన్నాక కొత్తతరం ప్రతిభావంతులపై నమ్మకం ఏర్పడుతోంది' అన్నారు రామజోగయ్య శాస్త్రి. తనలాగానే గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ పొందారని అనంత శ్రీరామ్ అభినందించారు. అక్షరాలన్నీ కలసినట్టుగా ఈ వేదిక ఉందని సుద్దాల అశోక్‌తేజ అభినందించారు. 'రేవు' చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు మాట్లాడుతూ 'ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేయడానికి ఇంతమంది గీత రచయితలు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు హరనాథ్ మత్స్యకారుల జీవన పోరాటాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాతలు, మిత్రులు మురళీ గింజుపల్లి,నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలా 'రేవు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళతాం' అని చెప్పారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



అనసూయ, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషించిన 'సింబా' చిత్రం ఆగస్టు 9న విడుదల కానుంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో దాసిర రాజేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ ' చాలా మంచి కాన్సెప్ట్‌తో 'సింబా' రూపుదిద్దుకుంది. జగపతిబాబు ఈ చిత్రానికి ప్రధాన బలం' అన్నారు. 'మా సినిమాకు కథే హీరో. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోండి. ముందు తరాల గురించి ఆలోచించండి... అని చెబుతున్నాం' అన్నారు నిర్మాత రాజేందర్‌రెడ్డి. సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదనీ, ఇంతవరకూ ఇండియన్ స్ర్కీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. ఈ సినిమాకు కథ, స్ర్కీన్‌ప్లే అందించిన సంపత్ నందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టులో డిమోంటీ కాలనీ 2



అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డిమోంటి కాలనీ 2'. బ్లాక్‌బస్టర్ హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌వర్మ ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తోంది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: హరీశ్ కన్నన్

చిరంజీవి పుట్టిన రోజున



బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, మోహన్ సేనాపతి కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న 'పరాక్రమం' చిత్రాన్ని విడుదల చేస్తున్నామని సరోజ్‌కుమార్ చెప్పారు.



దర్శకుడు మారుతి సమర్పణలో భారీ మ్యూజికల్ ఈవెంట్ 'జామ్‌జంక్షన్' సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

అనాథల కథ



సంజయ్ శ్రీరాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలు పోషించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే చాలా దారుణాలు ఎదుర్కోవలసి వస్తుంది అనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ దర్శకత్వంలో డాక్టర్ అరవేటి యశోవర్ధన్ నిర్మించారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.



బరిలో ధీరజ్, దీపిక

» ఆర్చరీ అర్హత రౌండ్ నేడు

(స్పోర్ట్స్ 18, జియో సినిమాలో)

పారిస్ : విశ్వ క్రీడల్లో భారత్ క్రీడాకారులు బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. గురువారం జరిగే ఆర్చరీ వ్యక్తిగత పోటీల అర్హత రౌండ్లలో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర, తరుణ్ దీప్ రాయ్, దీపికా కుమారి తదితరులు తలపడనున్నారు.

మహిళల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్: మ. ఒంటి గంటకు (దీపికా కుమారి, అంకితా భకత్, భజన్ కౌర్); **పురుషుల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్:** సా. 5.45 (ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్

ఆటలు మొదలయ్యాయ్!

పారిస్ : ఒలింపిక్స్ ప్రారంభానికి మరో రెండు రోజులుండగా..ఎప్పటి మాదిరే పోటీలు మాత్రం మొదలయ్యాయి. ఈమేరకు బుధవారం జరిగిన పురుషుల ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో స్పెయిన్-ఉజ్బెకిస్థాన్, అర్జెంటీనా-మొరాకో, న్యూజిలాండ్-గినీ, ఈజిప్ట్-డొమెనిక్ రిపబ్లిక్, ఇరాక్-ఉక్రెయిన్, జపాన్-పరాగ్వే జట్లు తలపడ్డాయి. అలాగే పురుషుల రగ్బీ సెవెన్స్‌లో ఆస్ట్రేలియా-సమోవా, అర్జెంటీనా-కెన్యా, ఫ్రాన్స్-అమెరికా, ఫిజీ-ఉరుగ్వే, ఐర్లాండ్-సౌతాఫ్రికా, న్యూజిలాండ్-జపాన్, ఆస్ట్రేలియా-కెన్యా, అర్జెంటీనా-సమోవా, ఫ్రాన్-ఉరుగ్వే ఢీకొన్నాయి.

ఐదుగురు ప్లేయర్లకు కొవిడ్ పాజిటివ్

పారిస్: ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆస్ట్రేలియా క్రీడాకారుల బృందంలో ఐదుగురికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. వాటర్ పోలో మహిళల జట్టు సభ్యులకు మాత్రమే కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, మిగిలిన ఆసీస్ క్రీడాకారులకే ఏ ఇబ్బందీ లేదని ఆస్ట్రేలియా చెఫ్ డి మిషన్ అన్నా మీరెస్ వివరణ ఇచ్చింది. పాజిటివ్‌గా తేలిన ఆ ఐదుగురు ప్లేయర్లు కూడా ప్రస్తుతం బాగానే ఉన్నారని, పోటీల సమయానికి వారు సిద్ధంగా ఉంటారని ఆమె తెలిపింది. కొవిడ్ కూడా ఇతర శ్వాసకోశ సంబంధిత అనారోగ్యం లాంటిదేనని, ఆందోళన చెందాల్సిన పని లేదని, అయితే స్పోర్ట్స్ విలేజ్‌లో ప్రొటోకాల్ పాటించేందుకు పరీక్షలు చేసి అప్రమత్తం చేస్తున్నారని చెప్పింది. 'మొత్తం ఆస్ట్రేలియా బృందానికి పరీక్షలు జరపగా ఐదుగురికి మాత్రమే పాజిటివ్‌గా తేలింది' అని మీరెస్ తెలిపింది. కొవిడ్ మహమ్మారి కారణంగా టోక్యో ఒలింపిక్స్, బీజింగ్ వింటర్ ఒలింపిక్స్ కఠినమైన నిబంధనలతో ప్రత్యేక బబుల్‌లో నిర్వహించడం తెలిసిందే.


సాల్ట్‌లేక్‌లో 2034 వింటర్ ఒలింపిక్స్

పారిస్: అమెరికాలోని సాల్ట్‌లేక్ నగరం రెండోసారి శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనుంది. 2002లో తొలిసారి ఇక్కడ విశ్వక్రీడలు జరిగాయి. మళ్లీ 32 ఏళ్ల తర్వాత..అంటే 2034లో సాల్ట్‌లేక్ నగరానికి ఆతిథ్య హక్కులు దక్కాయి. సాల్ట్ లేక్‌కు ఆతిథ్య హక్కులు కేటాయిస్తున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) బుధవారం వెల్లడించింది. వింటర్ ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు లభించడంతో సాల్ట్ లేక్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. ఇక, ఫ్రాన్స్‌లో ప్రభుత్వ మార్పు నేపథ్యంలో 2030 శీతాకాల ఒలింపిక్స్‌పై నెలకొన్న సందిగ్ధానికి కూడా ఐఓసీ తెరదించింది. తదుపరి వచ్చే ప్రధాని కూడా క్రీడల నిర్వహణకు కట్టుబడి ఉంటారని హామీ ఇవ్వడంతో ఆతిథ్య హక్కుల విషయంలో ఎలాంటి మార్పూ చేయడం లేదని ఐఓసీ తెలిపింది.

దశ తిరిగేనా!

కోటి ఆశలతో.. కొంగొత్తగా భారత్

- నీరజ్‌పై భారీ అంచనాలు
- నిఖత్ పంచ్ అదిరేనా?
- గన్స్ గర్జిస్తే పతకాల పండుగే



మహా క్రీడాసంగ్రామం ఒలింపిక్స్‌లో భారత్ భారీ అంచనాలతో బరిలోకి దిగుతోంది. టోక్యో విశ్వక్రీడల తర్వాత మన ఆటగాళ్లు, అభిమానుల్లో కొండంత ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. గత క్రీడల్లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రో పసిడి పతకాన్ని కొల్లగొట్టడం కొత్త జోష్ నింపింది. మనోళ్లలోనూ ప్రపంచ స్థాయి ప్రతిభ దాగుందన్న నమ్మకం కలిగించింది. ఇక, 40 ఏళ్ల తర్వాత భారత హాకీ జట్టు పతకం (కాంస్యం) నెగ్గడం యావద్దేశాన్ని మురిపించింది. టోక్యోలో 7 పతకాలు సాధించిన భారత్‌పై అంచనాలు అమాంతం పెరిగి పోయాయి. ఈ నేపథ్యంలో పారిస్‌లో పతకాల 'దశ' తిరుగుతుందని ఆశిద్దాం..



అంచనాలను అందుకొనేనా?

లండన్ ఒలింపిక్స్ నుంచి నిరాశపర్చకుండా పతకాలు అందిస్తున్న విభాగం బ్యాడ్మింటన్. 2012లో సైనా నెహ్వాల్ కాంస్యం తర్వాత.. రియో, టోక్యోల్లో పీవీ సింధు రజత, కంచు పతకాలను సాధించింది. అయితే, ఈసారి డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మెడల్ కొల్లగొడతారని లెక్కలు వేస్తున్నారు. రెండు ఒలింపిక్ మెడల్స్ సాధించిన సింధు ప్రస్తుతం అంతగా ఫామ్‌లో లేకపోయినా.. అత్యుత్తమ వేదికలపై అనూహ్య ప్రదర్శనలు చేయగల సత్తా ఆమెకు ఉంది. పురుషుల సింగిల్స్‌లో బరిలోకి దిగనున్న హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్‌ను అండర్ డాగ్స్‌గా అంచనా వేస్తున్నారు.

పక్కా అంటే పక్కా

పక్కాగా పతకం లభిస్తుందని చెప్పగలిగే విభాగం జావెలిన్ త్రో. గతంలో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకం అంటే.. కలలో ఊహించని విషయం. అయితే, బల్లెం వీరుడు నీరజ్ చోప్రా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. 2020 ఒలింపిక్స్‌లో ఏకంగా స్వర్ణం అందించాడు. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న చోప్రా మళ్లీ పతకం సాధిస్తాడనే అంచనాలు భారీగా పెరిగాయి. చోప్రాతోపాటు మెగా ఈవెంట్‌కు అర్హత సాధించిన కిశోర్ జనా కూడా పోడియం ఫినిష్ చేయగలడేమో చూడాలి.

రేపటి నుంచే పారిస్ ఒలింపిక్స్

నిఖత్‌పైనే ఆశలు..

బాక్సింగ్‌లో భారత పతక ఆశలన్నీ రెండుసార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ (50 కిలోలు), టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ (75 కిలోలు) పైనే ఉన్నాయి. నిఖత్‌కు సులువైన డ్రా ఎదురవడంతో ఆమె పతక రౌండ్‌కు చేరుకొనే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తుండగా.. లవ్లీనా పోరాడాల్సిన పరిస్థితి.



నిఖత్

గురి కుదిరితే..


భారీగా పతకాలు సాధిస్తుందనే అంచనాలున్న ఏకైక ఈవెంట్ షూటింగ్. అయితే, గత రెండు ఒలింపిక్స్‌లో మన గన్‌లు తుస్సుమన్నాయి. కానీ, ఈసారి 21 మందితో బరిలోకి దిగుతోంది. గత కొన్నేళ్లుగా ప్రపంచకప్ టోర్నీలలో రికార్డుల మోత మోగిస్తున్న మన షూటర్ల గురి కుదిరితే.. పతకాల పండుగే..! పిస్టల్ క్వీన్ మను భాకర్, రైఫిల్ 3 పొజిషన్‌లో వరల్డ్ రికార్డ్ సాధించిన షిఫ్ట్ కౌర్ పతకాలు తేగలరన్న అంచనాలు భారీగా ఉన్నాయి. హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కూడా సంచలనాలు సృష్టించగలదు.



మను భాకర్

వినేష్, అమన్‌కు చాన్సు

2008 నుంచి వరుసగా పతకాలు అందిస్తున్న విభాగం రెజ్లింగ్. గత ఈవెంట్‌లో రవి దహియా రజతం, బజ్‌రంగ్ పూనియా కాంస్యం సాధించారు. అయితే, అంతర్గత విభేదాల కారణంగా రెజ్లింగ్ విభాగం కుదేలైంది. వినేష్ ఫొగట్ (50 కిలోలు), అంతిమ్ పంగల్ (53 కిలోలు), అమన్ సెహ్రావత్ (57 కిలోలు)పై పతక ఆశలున్నాయి.



వినేష్ ఫొగట్

బోపన్న లాస్ట్ షాట్

టెన్నిస్‌లో రోహన్ బోపన్న జోడీ పతకం సాధిస్తారనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. 44 ఏళ్ల బోపన్నకు జోడీగా శ్రీరామ్ బాలాజీ బరిలోకి దిగుతున్నాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ కాంస్యం నెగ్గిన తర్వాత టెన్నిస్‌లో మళ్లీ పతకం గెలవలేదు. ఈసారి బోపన్న జోడీ పతకదాహం తీర్చుతుందని భావిస్తున్నారు. సింగిల్స్‌లో సుమిత్ నగాల్ బరిలో ఉన్నా...పతకం ఆశల్లేవు.



హాకీలో పోటీ తీవ్రం...



ఎట్టకేలకు హాకీలో పతక దాహం తీరింది. నాలుగు దశాబ్దాల తర్వాత గత క్రీడల్లో భారత జట్టు కంచు మోత మోగించింది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో స్వర్ణంతో పారిస్ బెర్త్ పట్టేసింది. అయితే, ఇటీవలి యూరోపియన్ టూర్‌లో పేలవ ప్రదర్శన కొంత ఆందోళన కలిగిస్తోంది. బెల్జియం, ఆస్ట్రేలియా లాంటి మేటి జట్లున్న పూల్-బిలో భారత్ ఆడనుంది. అయితే, మెరుగైన సాధన చేసిన భారత ఆటగాళ్లు ఈసారి ఫైనల్ చేరతామనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మీరాబాయి సింగిల్‌గా..

వెయిట్ లిఫ్టింగ్‌లో బరిలో ఉన్న ఏకైక అథ్లెట్ మీరాబాయి చాను. టోక్యోలో రజతం సాధించిన మీరా (49 కిలోలు) ఈసారి స్వర్ణం పట్టేయాలన్న పట్టుదలతో ఉంది. అయితే, గాయాలతో ఇబ్బందులు పడిన చానుకు ఈసారి గట్టిపోటీ ఎదురుకానుంది.



ఏంటీ డిజైన్లు?



న్యూఢిల్లీ: భారత బృందం ఒలింపిక్ దుస్తులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మన సంస్కృతి, కళా నైపుణ్యాలను ప్రదర్శించడానికి విశ్వక్రీడలు లాంటివి అత్యుత్తమ వేదికలు. అయితే, దుస్తులను డిజైన్ చేసిన తరుణ్ తహిల్యానీ, ఆదిత్య బిర్లా ఫ్యాషన్‌లు వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని నెటిజన్లు మండిపడుతున్నారు. సింథటిక్ వస్త్రాలు, ప్రింట్‌లతో భారత బృందం దుస్తులను తయారు చేయడం ఎంతో నిరాశపర్చిందన్నారు. మరోవైపు ప్రారంభ వేడుకల కోసం రూపొందించిన డిజైన్లు.. మంగోలియా యూనిఫామ్‌ను పోలినట్టున్నాయని ఎక్స్‌లో విమర్శలు వ్యక్తమయ్యాయి. మరికొందరు స్వాతంత్ర్య దినం రోజు స్కూల్ వేడుకల్లో ధరించే విధంగా ఉన్నాయన్నారు.

ఒలింపిక్స్ కోసం రూ. 470 కోట్ల ఖర్చు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని, క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు కేంద్ర క్రీడా శాఖ 2021 నుంచి 2024 వరకు సుమారు రూ.470 కోట్లు వెచ్చించినట్టు అంచనా. క్రీడా బడ్జెట్‌లో కేటాయించిన టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)తో పాటు సీఎస్ఆర్ నిధులు కింద వచ్చిన కొంత మొత్తాన్ని కూడా క్రీడాకారులు కోసం ఖర్చు చేశారు. ఈ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో పోటీ పడుతున్నారు. బెంగుళూరులోని 'సాయ్' కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న పురుషుల హాకీ జట్టుపై రూ.41.81 కోట్లు, 'సాయ్' పటియాలలో సాధన చేస్తున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపై రూ.5.72 కోట్లు, హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో ప్రాక్టీసు చేస్తున్న బ్యాడ్మింటన్ డబుల్స్ మాజీ వరల్డ్ నెంబర్ వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ద్వయంపై రూ.5.62 కోట్లు కేంద్ర క్రీడాశాఖ వెచ్చించింది. వీరితో పాటు ఏస్ షట్లర్ పీవీ సింధు (ప్రకాశ్ పదుకొనె అకాడమీ, బెంగుళూరు)పై రూ.3.13 కోట్లు, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయ్ చాను (సాయ్ పటియాల)పై రూ. 2.74 కోట్లు, షూటర్ అనీష్ భన్వాలా (సాయ్ ఢిల్లీ)పై రూ.2.41 కోట్లు, షూటర్ మనుభాకర్ (సాయ్ ఢిల్లీ)పై రూ.1.68 కోట్లు, టెన్నిస్ వెటరన్ స్టార్ రోహన్ బోపన్నపై రూ.1.56 కోట్లు, ప్యాడ్లర్ మనికా బాత్రాపై రూ.1.30 కోట్లు, ఆర్చర్ ధీరజ్‌పై రూ.1.07 కోట్లు, బాక్సర్లు నిఖత్ జరీన్‌పై రూ.91.71 లక్షలు, అమిత్ పంఘల్‌పై రూ.65.90 లక్షలు, రెజ్లర్లు వినేష్ ఫొగట్‌పై రూ.70.45 లక్షలు, అంతిమ్ పంఘల్‌పై రూ.66.55 లక్షలు, గోల్ఫర్ అదితి అశోక్‌పై రూ.63.21 లక్షలు కేంద్రం ఖర్చు చేసింది. ఇంకా హాకీ తదితర టీమ్ గేమ్‌లకు కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది.

ఐదేళ్లకోసారి వేలం?

ఐపీఎల్‌కు ఫ్రాంచైజీల సూచన

న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలాన్ని ఇకపై ఐదేళ్లకొకసారి నిర్వహించాలని ఫ్రాంచైజీలు డిమాండ్ చేస్తున్నాయి. 2025 వేలానికి ముందు జరిపిన అభిప్రాయ సేకరణలో ఫ్రాంచైజీలు అనేక సూచనలను ఐపీఎల్ అధికారుల ముందుంచాయి. వీటిపై వచ్చే వారం జరిగే సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మూడేళ్లకు బదులు ఐదేళ్లకోసారి వేలం నిర్వహించడం వల్ల బలమైన టీమ్‌ను తయారు చేసుకొనేందుకు అవకాశం ఉంటుందని ఫ్రాంచైజీలు భావిస్తున్నట్టు ఓ అధికారి తెలిపాడు. దీంతో సానబెట్టుకొన్న అన్‌క్యాప్డ్ ప్లేయర్లు జట్టును వదిలి వేళ్లే అవకాశం లేదు. అంతేకాకుండా వేలం పీరియడ్ మధ్యలో జీతాల విషయంలో ఆటగాళ్లతో ఫ్రాంచైజీలే నేరుగా బేరసారాలు చేసేలా అవకాశం కల్పించాలని కోరుతున్నాయి. అలా చేయడం వల్ల ఆయా క్రికెటర్లను రిటైన్ చేసుకోవడంతోపాటు సత్సంబంధాలు కూడా కొనసాగించే అవకాశం ఉంటుందని చెబుతున్నాయి. ఈ కారణంగా ప్లేయర్‌ను వదులుకోవడాన్ని ఫ్రాంచైజీలు నియంత్రించే చాన్సు లుంటాయి. కాగా, జట్టు కెప్టెన్‌ను మాత్రమే అట్టిపెట్టుకొని మిగతా ఆటగాళ్లను వేలంలో రిటైన్ చేసుకొనేలా నిబంధనలను సవరించాలని ఓ ఫ్రాంచైజీ సీఈవో కోరాడు. దీని వల్ల తమను తక్కువ ధరకు తీసుకొన్నారనే భావన ఆటగాళ్లలో తలెత్తదని అన్నాడు. ఎనిమిది మంది ఆటగాళ్లను రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం)గా తీసుకొనే అవకాశం కల్పించాలని కూడా కొన్ని ఫ్రాంచైజీలు ప్రతిపాదించాయి.



ఈ చాన్స్ మళ్లీ రాదు

శ్రీలంక కోచ్ జయసూర్య



పల్లెకెలె : టీ20ల నుంచి స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ జడేజా రిటైరయ్యారని..ఈ నేపథ్యంలో భారత్‌పై పొట్టి సిరీస్ గెలిచేందుకు ఇంతకుమించిన అవకాశం దక్కదని శ్రీలంక తాత్కాలిక కోచ్ సనత్ జయసూర్య జట్టు సభ్యులకు ఉద్బోధిస్తున్నాడు. ఈక్రమంలో ఐపీఎల్ జట్టు రాజస్థాన్ రాయల్స్ హై పెర్ఫామెన్స్ డైరెక్టర్ జుబిన్ భరూచాతో బ్యాటర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాడు. టీమిండియాతో మూడు టీ20ల సిరీస్‌లో శ్రీలంక తలపడనున్న సంగతి తెలిసిందే. తొలి మ్యాచ్ ఈనెల 27న ఇక్కడ జరగనుంది. భారత్‌తో తలపడే శ్రీలంక జట్టులోని పలువురు ఆటగాళ్లు లంక ప్రీమియర్ లీగ్‌లో ఆడారు. అయినా వారు జుబిన్‌తో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పాల్గొంటున్నారని జయసూర్య తెలిపాడు. టీ20లలో తమ జట్టు పరిస్థితి ఆశాజనకంగా ఏమీ లేదని జయసూర్య అంగీకరించాడు. కొత్త కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత్ బరిలో దిగుతోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తమ జట్టుకు సూచించాడు. 'రోహిత్, విరాట్ ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్లు. వారిద్దరితోపాటు జడేజాతో కూడిన టీమిండియా ఏ స్థాయిలో ఆడిందో గమనించాలి' అని జట్టుకు గుర్తు చేశాడు. 'వారి లేకపోవడం టీమిండియాకు లోటు. ఈ అవకాశాన్ని మావాళ్లు సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలి' అని జయసూర్య అన్నాడు. అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచ కప్‌లో శ్రీలంక జట్టు ఘోరంగా ఆడింది. లీగ్ దశతోనే టోర్నీ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. దాంతో కెప్టెన్ హసరంగ, హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్ ఉడ్, హై పెర్ఫామెన్స్ కన్సల్టెంట్ మహేల జయవర్దనే తమ పదవులకు రాజీనామా చేశారు. చరిత అసలంక సారథ్యంలో ఆ జట్టు బరిలో దిగుతోంది.

అనారోగ్యంతో చమీర అవుట్

మరో రెండు రోజుల్లో భారత్‌తో టీ20 సిరీస్ ఆరంభం కానుండగా శ్రీలంక జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ దుష్మంత చమీర శ్వాసకోశ వ్యాధి నుంచి కోలుకోకపోవడంతో టీ20లతోపాటు తర్వాత జరిగే మూడు వన్డే సిరీస్‌కూ దూరమైనట్టు శ్రీలంక క్రికెట్ బుధవారం ప్రకటించింది. అతడి స్థానంలో మరో పేసర్ అసిత ఫెర్నాండోకు స్థానం కల్పించినట్టు చీఫ్ సెలెక్టర్ ఉపుల్ తరంగ తెలిపాడు.

టీటీలో ఇచ్చేనా పోటీ?



మనికా బాత్రా

సియోల్ ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టినప్పటి నుంచే భారత ఆటగాళ్లు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారు. అయితే 2004 గేమ్స్ ముందు వరకు కూడా భారత పోరాటం తొలి రౌండ్‌కే పరిమితమైంది. ఇక మొదటిసారిగా టీమ్ ఈవెంట్స్‌లోనూ పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఆడబోతోంది. పురుషులు, మహిళల జట్లు రెండూ టాప్-16లో ఉండడంతో ఈ అవకాశం దక్కింది. ఆచంట శరత్ కమల్, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్‌తో పాటు రిజర్వ్‌గా జ్ఞానశేఖర్.. మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చన కామత్‌తో పాటు రిజర్వ్‌గా ఐహిక ముఖర్జీ పాల్గొంటున్నారు. మొత్తంగా నాలుగు ఈవెంట్స్ (సింగిల్స్, టీమ్స్)లో టీటీ ప్లేయర్స్ పోటీపడబోతున్నారు.

పతక చాన్స్ ఉందా?: ఒలింపిక్స్‌లో భారత ప్యాడ్లర్స్ ప్రదర్శన ప్రతిసారీ నిరాశాజనకంగానే ఉంటోంది. ఐదోసారి ఒలింపిక్స్‌లో ఆడనున్న శరత్ కమల్ 2004 ఏథెన్స్‌లో రెండో రౌండ్‌కు వెళ్లిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. అయితే టోక్యోలో కాస్త మెరుగైన ప్రదర్శనతో పురుషులు, మహిళల సింగిల్స్ నుంచి శరత్, మనికా బాత్రా మూడో రౌండ్‌కు వెళ్లగలిగారు. బాత్రా ఇటీవల ఎలీట్ డబ్ల్యూటీటీలో వరల్డ్ నెంబర్ 2 వాంగ్ మన్యును ఓడించి క్వార్టర్స్‌కు చేరిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. అలాగే కెరీర్‌లోనే అతి పెద్ద ఈవెంట్ ఆడబోతున్న ఆకుల శ్రీజ ఏమేరకు రాణించగలదో వేచిచూడాల్సిందే.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



శ్రీజ, శరత్

భారత్‌తో బంగ్లా ఢీ

పాక్‌తో లంక అమీతుమీ
ఆసియా కప్ సెమీస్



మలేసియాపై నెగ్గిన బంగ్లా అమ్మాయిలు

దంబుల్లా : మహిళల ఆసియా కప్ సెమీఫైనల్ స్థానాలు ఖరారయ్యాయి. శుక్రవారం జరిగే మొదటి సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో బంగ్లాదేశ్ తలపడనుంది. అదేరోజు జరిగే మరో సెమీస్‌లో పాకిస్థాన్ జట్టుతో ఆతిథ్య శ్రీలంక అమీతుమీ తేల్చుకోనుంది. ఇక బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 114 పరుగులతో మలేసియాను చిత్తు చేసింది. తొలుత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో రెండు వికెట్లకు 191 పరుగులు చేసింది. మహిళల టీ20లలో ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. ముర్షిద 80 పరుగులతో కెరీర్ బెస్ట్ స్కోరు నమోదు చేసింది. కెప్టెన్ నిగర్ సుల్తానా అజేయ హాఫ్ సెంచరీ (62) సాధించింది. అనంతరం మలేసియా 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 77 పరుగులే చేసి ఓడింది. మరో గ్రూప్ పోరులో శ్రీలంక 10 వికెట్లతో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. మొదట థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 93/7 స్కోరు చేసింది. ఛేదనలో శ్రీలంక 11.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 94 రన్స్ చేసి నెగ్గింది.

షమి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు!



ముంబై: తనపై వస్తున్న నిరాధారమైన వార్తలు, ఆరోపణల్ని భరించలేక టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమి ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడని అతడి ఆప్తమిత్రుడు ఉమేశ్ కుమార్ వెల్లడించాడు. ఇటీవల అతడు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ 2018లో షమి జీవితం ఊహించని ఆటుపోట్లకు గురైందని ఉమేశ్ చెప్పాడు. ఆ సమయంలో షమి తనతోనే ఉండేవాడని, ఒకరోజు రాత్రి 19వ అంతస్తులోని బాల్కనీ నుంచి కిందకి దూకి, ఆత్మహత్య చేసుకోవాలని షమి భావించినట్టు తెలిపాడు. 'భార్య హసీన్ జహా గృహ హింస కేసు పెట్టడం, దానిపై మీడియాలో వచ్చిన కథనాలు షమిని తీవ్రంగా బాధించాయి. ఆతర్వాత పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో ఫిక్సింగ్ చేశాడన్న ఆరోపణలు రావడం అతడిని మానసిక క్షోభకు గురి చేశాయి. ఈ ఆరోపణలను భరించలేకపోతున్నానని అతడు చాలా బాధపడ్డాడు. ఒక రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఒక్కడే బాల్కనీలో నిలబడి ఉన్నాడు. నేను అదే సమయానికి నీళ్లు తాగేందుకు లేచి, ఆవైపు చూస్తే షమి అక్కడ నుంచి దూకేలా కనిపించాడు' అని ఉమేశ్ వివరించాడు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకే అతడికి మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల విషయంలో క్లీన్ చిట్ రావడంతో తిరిగి గాడిన పడ్డాడని చెప్పుకొచ్చాడు.



ఉప్పొంగే కెరటం

చదువంటే ఇష్టం. నృత్యం అంటే ప్రాణం. సెయిలింగ్ కోసం అన్నిటినీ పక్కన పెట్టారు నేత్ర కుమనన్. ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా సెయిలర్‌గా చరిత్రకెక్కారు. ఇప్పుడు ప్యారిస్‌లో పతకాల పంట పండించడానికి సిద్ధమయ్యారు.

"ఎన్నో క్రీడలతో, కళలతో నాకు పరిచయం ఉంది. కొన్నిటిలో ప్రావీణ్యం కూడా ఉంది. కానీ అవేవీ సెయిలింగ్ స్థాయిలో సవాల్ విసరలేదు" అంటారు నేత్రా కుమనన్. తమిళనాడులోని చెన్నైకి చెందిన ఈ 26 ఏళ్ళ అమ్మాయి ప్యారిస్ ఒలింపిక్స్‌లో... సెయిలింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది ఆమెకు రెండో ఒలింపిక్స్. 2020లో టోక్యో ఒలింపిక్స్‌కు ఎంపికై, సెయిలింగ్‌లో భారత్ తరఫున పోటీ పడిన తొలి మహిళగా నిలిచారు. ఈసారి కూడా ఆ విభాగంలో మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళ ఆమే కావడం విశేషం.

అదే బాగా నచ్చింది...

"మా నాన్న వి.సి.కుమరన్ పారిశ్రామికవేత్త. అమ్మ శ్రీజ హెచ్‌ఆర్ రంగ నిపుణురాలు. ఏటా వేసవి సెలవుల్లో నన్ను, నా తమ్ముడు నవీన్‌ను ఏదో ఒక సమ్మర్ క్యాంపులో చేర్పేవారు. పన్నెండేళ్ళకే అనేక అంశాల్లో నేను ప్రావీణ్యం సాధించాను. 2009లో 'తమిళనాడు సెయిలింగ్ అసోసియేషన్' ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లో సెయిలింగ్ నాకు పరిచయమయింది" అంటున్న నేత్ర... రెండుసార్లు నేషనల్ ఛాంపియన్‌గా, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచారు. "అప్పటి నుంచే సెయిలింగ్‌ను ఒక కెరీర్‌గా తీసుకున్నాను. దాని కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచీ నేను మెరిట్ స్టూడెంట్‌ను. కానీ సెయిలింగ్‌వల్ల నా చదువుకు చాలాసార్లు బ్రేక్ పడింది. నా ఫ్రెండ్స్ కన్నా నాలుగేళ్ళు వెనుకబడ్డాను. ఈ మధ్యే మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఇప్పుడు ఎంబీఏ చేస్తున్నాను. అయితే.. ఒకటి సాధించాలంటే రెండోది వదులుకోవాలి. ఇక... భరతనాట్యం అంటే నాకు ప్రాణం. పద్మభూషణ్ అలర్మేల్ వల్లి దగ్గర ఆరేళ్ళకు పైగా శిక్షణ పొందాను. సింగపూర్, వియత్నాం, ఇండోనేషియాల్లో జరిగిన గ్లోబల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ కాంపిటిషన్స్‌లో బహుమతులు పొందాను. సెయిలింగ్ కోసం అది కూడా పక్కన పెట్టాల్సి వచ్చింది" అంటారు నేత్ర.

అదే ప్రధానం

భారత్‌లో సెయిలింగ్‌ను ఎంచుకొనే మహిళల సంఖ్య చాలా తక్కువ. ఈ కోణంలో చూసినప్పుడు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న నేత్ర ప్రత్యేకత ఏమిటనేది స్పష్టమవుతుంది. "ఒంటి చేత్తో, ఒక చిన్న డింగీ లాంటి బోటును నడిపే 'లేజర్ రేడియల్ కేటగిరీ' సెయిలర్‌ని నేను. సముద్రం, గాలి, ఉష్ణోగ్రత, అలలు... ఇలా ప్రకృతిలోని ప్రతదాన్నీ అర్థం చేసుకోవాలి. ఇది మానసిక క్రీడ. ఏదీ మన నియంత్రణలో ఉండదు. మనం ప్రకృతితో పోటీ పడలేం. క్షణాల వ్యవధిలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే గెలుపు, ఓటములను పెద్దగా పట్టించుకోను. మనం ఎంత పోటీ ఇస్తున్నామనేదే ప్రధానం"

స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్ లాంటి క్రీడలే కాదు, భరతనాట్యం, పెయింటింగ్ లాంటి కళలు, కరాటే, కలరిపయట్టు లాంటి యుద్ధ క్రీడల్లోనూ నేత్రకు ప్రావీణ్యం ఉంది.

అంటారు నేత్ర. 2021లో శిక్షణ ప్రారంభించిన ఆమె... 2014 నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. 2014, 2018 ఆసియా క్రీడల్లో వరుసగా ఏడు, అయిదు స్థానాల్లో నిలిచారు. 2015 క్లాస్ ఛాంపియన్‌షిప్‌లో, 2021, 2022 ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లలో రెండు స్వర్ణాలను, ఒక రజతాన్ని గెలిచారు. 2021లో అమెరికాలోని మియామీలో జరిగిన 'హెంపెల్ సెయిలింగ్ వరల్డ్ కప్ సిరీస్'లో కాంస్య పతకం గెలిచి, ఆ ఘనత సాధించిన మొదటి భారతీయురాలిగా నిలిచారు. 2022 'యూరోపా కప్'లో కాంస్యం సాధించారు.

అప్పుడు ఒత్తిడికి గురయ్యా...

సెయిలింగ్ అభ్యాసం ప్రారంభించిన రెండేళ్ళలోనే ఆమె పతకాలు గెలవడం మొదలెట్టారు. 2015, 2016ల్లో వరుసగా నేషనల్ టైటిల్స్ అందుకున్నారు. ఆ తరువాత మెరుగైన శిక్షణ కోసం ఇజ్రాయిల్, ఇటలీ తదితర దేశాలకు వెళ్ళారు. 2017లో 'యాచ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ఆమెను 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్'కు ఎంపిక చేసింది. "వివిధ దేశాల్లో పెద్దగా ప్రాచుర్యం లేని క్రీడల్లో యువతను, ప్రత్యేకించి మహిళలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన కార్యక్రమం ఇది" అని చెబుతారామె. 2020లో 'హెంపెల్ వరల్డ్ కప్ సిరీస్'లో కాంస్య పతకం సాధించాక... స్పెయిన్‌లోని 'గ్రాన్ కనారియా సెయిలింగ్ అకాడమీ'లో చేరి... తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. "ఆమెను చూస్తే ఉప్పొంగే కెరటంలా అనిపిస్తుంది. ఎంత కష్టమైనా లక్ష్యాన్ని సాధించాలనే తపన ఆమెలో కనిపిస్తుంది" అంటూ కోచ్‌ల ప్రశంసలు అందుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 35వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. "తీవ్రమైన ఒత్తిడికి గురి కావడమే దానికి కారణం. కానీ మన దగ్గర పెద్దగా ప్రాచుర్యం లేని ఈ క్రీడ మీద దేశం దృష్టిపడేలా చేసినందుకు సంతోషంగా ఉంది.. ఈసారి మరింత మెరుగ్గా రాణించడానికి శాయశక్తులా కృషి చేస్తాను" అని చెప్పారు నేత్ర. ఇప్పుడు ఆమెకు మరో అవకాశం రానే వచ్చింది. ఏప్రిల్‌లో జరిగిన క్వాలిఫయర్‌లో సత్తా చాటి... 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్' కోటాలో ప్యారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికయ్యారు. "ఇప్పుడు మరింత సన్నద్ధంగా ఉన్నాను. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనేది నా ఆశయం" అంటున్నారు నేత్ర.

పసరుమందుతో కామెర్లు తగ్గుతాయా?

కౌన్సెలింగ్



Q A

డాక్టర్! మా అబ్బాయికి 13 ఏళ్లు. కామెర్లు సోకడంతో బడి మాన్పించి ఇంటికే పరిమితం చేశాం. అలాగే ఉప్పు, కారాలు లేని చప్పని భోజనంతోనే సరిపెడుతున్నాం. పసరు మందు ఇప్పిస్తున్నాం. కాబట్టి సాధారణ వైద్యం అవసరం లేదని అంటున్నారు. పసరు మందు సరిపోతుందా లేదంటే అదనంగా ఇతరత్రా మందులేమైనా అవసరమవుతాయా?

కామెర్లకు కారణం కాలేయం జబ్బు పడడమే! అయితే కాలేయం ఎందుకు జబ్బు పడిందో కారణం తెలుసుకుని తగిన వైద్యం ఇప్పించడం అవసరం. హెపటైటిస్ బి, సి వైరస్‌ల వల్ల కూడా కాలేయం దెబ్బతింటుంది. ఈ వైరస్‌లను సమూలంగా నాశనం చేయాలంటే వైద్యులను కలిసి సమర్థమైన చికిత్స తీసుకోవలసి ఉంటుంది. సోకిన వైరస్‌నుబట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. మరీ ముఖ్యంగా కామెర్లకు నాటు మందులు వాడడం ప్రమాదకరం. వాటిలోని హెవీ మెటల్స్ కాలేయానికి కీడు చేసి, సమస్యను తీవ్రతరం చేస్తాయి. నాటుమందులు తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోగా, కాలేయం మరింత దెబ్బ తినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి నాటు మందుల జోలికి వెళ్లకుండా అవసరాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. ఒకవేళ పదే పదే కామెర్లు వేధిస్తున్నా, నిస్సత్తువ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తున్నా కాలేయ వ్యాధిగా పరిగణించి, వైద్యులను ఆశ్రయించాలి. తోచిన చికిత్సలకు, చిట్కాలకు స్వస్తి చెప్పి వైద్యులను కలిసి తగిన పరీక్షలతో కామెర్లకు మూల కారణాన్ని గుర్తించి సమర్థమైన చికిత్సలు అందించడం శ్రేయస్కరం. ఇక పత్యం విషయానికొస్తే, జబ్బుపడిన కాలేయం నుంచి ఎంజైమ్స్ స్రావం తగ్గుతుంది కాబట్టి తేలికగా అరిగే ఆహారం అందించాలి. అలాగని పోషకాల కొరతకు గురయ్యేలా పత్యం ఉంచవలసిన అవసరం లేదు. నూనె తగ్గించాలి. పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. కూరగాయలు, పప్పు, ఆకుకూరలు, పండ్లు, నట్స్ భోజనంలో ఉండేలా చూసుకోవాలి. బలవర్థకమైన ఆహారంతో కామెర్ల నుంచి త్వరగా కోలుకోగలుగుతారు. కాబట్టి మాంసాహారం మినహా మిగతావన్నీ మునుపటిలాగే తినిపించవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా పసరు మందులు మానేసి, వైద్యులు సూచించిన కామెర్ల మందులను వాడుకోవాలి.

డాక్టర్ రమేష్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హైదరాబాద్

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZOWQ1KSలో చదవండి.

బిజినెస్



కొలువుల కల్పనలో ప్రైవేటు రంగం బాధ్యత కీలకం

ఆనంద్ మహీంద్ర

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాల కల్పనలో ప్రైవేటు రంగానికి కూడా బాధ్యత ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర అన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన ప్రశంసించారు. ప్రభుత్వ చర్యలకు అనుగుణంగా, ప్రైవేటు రంగం కూడా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన దీనికి సంబంధించి తన అభిప్రాయాలు పోస్టు చేశారు. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా యువకుల నైపుణ్యాలకు సాన పెట్టాలని కోరారు. లేకపోతే మన అధిక జనాభా వరంగా గాక, పెద్ద విపత్తుగా మారే ప్రమాదం ఉందని ఆనంద్ మహీంద్ర హెచ్చరించారు. ప్రస్తుత సంక్షుభిత ప్రపంచంలో మన అధిక జీడీపీ వృద్ధిరేటు అందరికీ కన్ను కుట్టేలా ఉందన్నారు. అయినా మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక దేశాలు ఆసక్తితో ఉన్నాయన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,410 ▲	65,410 ▲	92,000 ▼
ముంబై	69,150 ▼	63,340 ▼	84,860 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	500
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	112
వరంగల్	112	గుంటూరు	115
కరీంనగర్	112	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	120
కర్నూలు	112	నెల్లూరు	120
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	112		

బీఎండబ్ల్యూ మోటోరాడ్ తొలి ఈ-స్కూటర్

భారత మార్కెట్లోకి ప్రవేశం



న్యూఢిల్లీ: జర్మన్ ఆటోమొబైల్ దిగ్గజం బీఎండబ్ల్యూకు చెందిన ద్విచక్ర వాహన విభాగం బీఎండబ్ల్యూ మోటోరాడ్ కూడా భారత ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్లోకి ప్రవేశించింది. 'బీఎండబ్ల్యూ సీఈ 04' పేరుతో ప్రీమియం ఈ-స్కూటర్‌ను బుధవారం లాంచ్ చేసింది. దీని ధర రూ.14.90 లక్షలు. ప్రస్తుతం దేశంలో ఇదే అత్యంత ఖరీదైన ఈ-స్కూటర్. అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఒకటి కూడా. ఇది గంటకు 120 కి.మీ వేగంతో ప్రయాణించగలదని, 2.6 సెకన్లలో సున్నా నుంచి 50 కి.మీ వేగాన్ని అందుకోగలదని కంపెనీ వెల్లడించింది. 8.5 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ వాహనం.. సింగిల్ చార్జింగ్‌తో 130 కి.మీ వరకు ప్రయాణించగలదని తెలిపింది. 10.25 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే విత్ స్ప్లిట్ స్క్రీన్ అండ్ బ్లూటూత్ కనెక్టివిటీ, మూడు రైడింగ్ మోడ్స్ ట్రాక్షన్ కంట్రోల్, ఏబీఎస్, కీ లెస్ రైడ్, రివర్సింగ్ ఎయిడ్ వంటి ఫీచర్లతో ఈ స్కూటర్‌ను డిజైన్ చేసినట్లు బీఎండబ్ల్యూ మోటోరాడ్ తెలిపింది. భారత్‌లోని ఎంపిక చేసిన మెట్రోపాలిటన్ నగరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నట్లు, సెప్టెంబరు నుంచి కస్టమర్లకు డెలివరీ అందించనున్నట్లు కంపెనీ తెలియచేసింది.

బీఎండబ్ల్యూ 5 సిరీస్ సరికొత్తగా..

బీఎండబ్ల్యూ ఇండియా బుధవారం మూడు కొత్త కార్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిలో సరికొత్త బీఎండబ్ల్యూ 5 సిరీస్ లాంగ్ వీల్ బేస్ (ఎల్‌డబ్ల్యూబీ) కారుతో పాటు అప్‌డేటెడ్ మినీకూపర్ ఎస్, ఆల్ ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ఉన్నాయి. ఎనిమిదో తరం బీఎండబ్ల్యూ 5 సిరీస్ ఎల్‌డబ్ల్యూబీ ధర రూ.72.90 లక్షలు కాగా.. మినీ కూపర్ ఎస్ రేటు రూ.44.90 లక్షలు, ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ ధర రూ.54.90 లక్షలుగా ఉంది.

ఎల్ అండ్ టీ లాభం రూ.2,786 కోట్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి ఎల్ అండ్ టీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.2786 కోట్లకు చేరుకుంది. ఆదాయం 15 శాతం పెరుగుదలతో రూ.55,120 కోట్లుగా నమోదైంది. భారీ ఆర్డర్‌బుక్‌తో కూడిన మాన్యుఫాక్చరింగ్ పోర్ట్‌ఫోలియోతో పాటు వేగంగా ప్రాజెక్టుల అమలు ఇందుకు దోహదపడిందని ఎల్ అండ్ టీ పేర్కొంది. ఈ క్యూ1లో అంతర్జాతీయ మార్కెట్ల నుంచి రూ.26,248 కోట్ల ఆదాయం లభించిందని, మొత్తం రెవెన్యూలో ఇది 48 శాతానికి సమానమని కంపెనీ వెల్లడించింది. గడిచిన మూడు నెలల్లో గ్రూప్ మొత్తానికి రూ.70,936 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయని, క్రితం సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే 8 శాతం అధికమని తెలిపింది. ముఖ్యంగా పశ్చిమాసియా నుంచి అధిక ఆర్డర్లు లభించాయంది. ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ప్రతికూలతలున్నప్పటికీ ఈ క్యూ1లో అన్ని విభాగాల్లో బలమైన పనితీరును కబరిచామని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గణనీయ మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బడ్జెట్ ప్రకటనలు వికసిత్ భారత్ లక్ష్యాలకు బాటలు వేయనుందన్నారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం రూ. 6,436 కోట్లు

న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంక్ మొదటి త్రైమాసికంలో రూ.6436 కోట్ల ఏకీకృత నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభంతో పోల్చితే ఇది 5.7 శాతం అధికం. స్టాండ్ అలోన్ లాభం రూ.6,035 కోట్లుగా నమోదైంది. గత ఏడాదిలో ఇదే సమయానికి ఆర్జించిన రూ.5,797 కోట్ల లాభంతో పోలిస్తే 4 శాతం పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12 శాతం వృద్ధితో రూ.13,448 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.05 శాతంగా నమోదైంది. ఇతర ఆదాయం 14 శాతం పెరుగుదలతో రూ.5783 కోట్లుగా ఉంది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా రూ.4,793 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయి. మొండి బకాయిల నష్టాలను పూడ్చుకునేందుకు జూన్ త్రైమాసికంలో బ్యాంక్ రూ.2,551 కోట్ల కేటాయింపులు జరిపింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో జరిపిన రూ.832 కోట్ల కేటాయింపులతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఇది. ఈ జూన్ చివరినాటికి బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (జీఎన్‌పీఏ) 1.54 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతానికి దిగివచ్చాయి.

బజాజ్ ఫిన్‌సర్వ్ లాభంలో 10% వృద్ధి

న్యూఢిల్లీ: బజాజ్ ఫిన్‌సర్వ్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.2,138 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి సంస్థ లాభం రూ.1,943 కోట్లుగా నమోదైంది. త్రైమాసికాదాయం రూ.31,480 కోట్లకు ఎగబాకింది. కిందటి ఏడాదిలో ఇదే సమయానికి ఆర్జించిన రెవెన్యూ రూ.23,280 కోట్లుగా ఉంది. కాగా, వ్యయాలు రూ.18,157 కోట్ల నుంచి రూ.25,514 కోట్లకు పెరిగాయి. బజాజ్ గ్రూప్‌లోని విభిన్న ఆర్థిక సేవల వ్యాపార హోల్డింగ్ కంపెనీయే బజాజ్ ఫిన్‌సర్వ్. దీని అనుబంధ విభాగమైన బజాజ్ అలియాన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ గడిచిన త్రైమాసికానికి రూ.576 కోట్ల లాభాన్ని, మరో అనుబంధ విభాగం బజాజ్ అలియాన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.104 కోట్ల లాభాన్ని నమోదు చేశాయి.

ఎస్‌బీఐ లైఫ్ ప్రాఫిట్ జూమ్

న్యూఢిల్లీ: జూన్ త్రైమాసికంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.520 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కిందటి ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.381 కోట్ల లాభంతో పోలిస్తే 36.48 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన మూడు నెలల్లో కొత్త ప్రీమియం వసూళ్లు రూ.7,033 కోట్లకు పెరగగా.. రెగ్యులర్ ప్రీమియం వార్షిక ప్రాతిపదిన 19 శాతం పుంజుకుంది. ఈ జూన్ 30 నాటికి ఎస్‌బీఐ లైఫ్ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ వార్షిక ప్రాతిపదికన 26 శాతం వృద్ధి చెంది రూ.4,14,772 కోట్లకు చేరుకుంది.

ప్రతి 10 మందిలో ఏడుగురికి నష్టాలే...

ఇంట్రా డే క్యాష్ ట్రేడింగ్‌పై సెబీ నివేదిక



న్యూఢిల్లీ: డెరివేటివ్స్ ట్రేడింగ్‌లోనే కాదు... ఈక్విటీ క్యాష్ విభాగంలోని ఇంట్రా డే ట్రేడింగ్‌లోనూ రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోతున్నారు. ఇలా ట్రేడింగ్ చేసే ప్రతి పది మంది రిటైల్ మదుపరుల్లో ఏడుగురు నష్టపోతున్నట్టు సెబీ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెబీ జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఇలా నష్టాలు వస్తున్నా ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసేందుకు మదుపరులు ఏ మాత్రం వెనకాడడం లేదు. 2018-19తో పోలిస్తే 2022-23లో ఇలా ట్రేడింగ్ చేసే మదుపరుల సంఖ్య మూడు రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. లాభాలు సంపాదించిన వారి కంటే, నష్టపోయిన వారే, మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మళ్లీ మళ్లీ ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ ట్రేడింగ్‌లోకి ప్రవేశిస్తున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

ప్రతి ముగ్గురిలో ఒకరు


ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసే ప్రతి ముగ్గురిలో ఒకరు ఇంట్రా డే ఈక్విటీ ట్రేడింగ్ చేస్తున్నట్టు సెబీ అధ్యయనంలో తేలింది. వీరిలో 48 శాతం మంది 30 ఏళ్ల కంటే తక్కువ వయస్కులే ఉన్నారు. 2018-19లో వీరి పాత్ర 18 శాతం మాత్రమే. కొవిడ్ తర్వాత యువకులు పెద్ద సంఖ్యలో స్టాక్ మార్కెట్ లావాదేవీల్లోకి ప్రవేశించడం ఇందుకు ప్రధాన కారణం. టెక్నాలజీతో బాగా పరిచయం ఉన్న వీరిలో ఎక్కువ మంది ఇంట్రా డే ఈక్విటీ క్యాష్ ట్రేడింగ్ సైతం చేస్తున్నారు. అయితే ఇలా ట్రేడింగ్ చేసే యువకుల్లో 76 శాతం మంది ఇంట్రా డే క్యాష్ ట్రేడింగ్‌లోనూ నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది.

నాలుగో రోజూ నష్టపోయిన మార్కెట్

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 280.16 పాయింట్ల నష్టంతో 80,148.88 వద్ద ముగియగా నిఫ్టీ 65.55 పాయింట్ల నష్టంతో 24,413.50 వద్ద ముగిసింది. బ్యాంకిం గ్, ఫైనాన్సియల్, ఆటోమొబైల్ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు హోరెత్తడంతో ఇంట్రా డేలో సెన్సెక్స్ 678.53 పాయింట్ల వరకు నష్టపోయింది.

రియల్టీ లాభాలకు ఢోకా లేదు: సీబీడీటీ చీఫ్

న్యూఢిల్లీ: ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్ ఎస్టేట్ లాభాలు ఏ మాత్రం తగ్గబోవని సీబీడీటీ చీఫ్ రవి అగర్వాల్ అన్నారు. మంగళవారం నాటి కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ద్రవ్యోల్బణం ఆధారంగా ఆస్తులపై పెట్టిన ఖర్చులను లెక్కించే ఈ ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని రద్దు చేశారు. దీంతో స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై మరింత పన్ను భారం పడుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. స్థిరాస్తులను కొన్న తర్వాత రెండేళ్లకు పైగా ఉంచుకుని అమ్మగా వచ్చే లాభాలపై దీర్ఘకాలిక మూల ధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) కింద ఇప్పటి వరకు ఇండెక్సేషన్ పోగా 20 శాతం పన్ను విధిస్తున్నారు. తాజా ప్రతిపాదనతో ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా 12.5 శాతం ఎల్‌టీసీజీటీ విధిస్తారు. దీన్ని సాధారణ గణాంకాల్లా చూడకుండా, మార్కెట్ ధరల ఆధారంగా చూడాలని సీబీడీటీ చీఫ్ అగర్వాల్ కోరారు. గత పదేళ్లలో ఇండెక్సేషన్ ప్రయోజనం మహా అయితే ఒకటిన్నర రెట్లు పెరిగితే, స్థిరాస్తుల మార్కెట్ ధరలు మూడు రెట్లకుపైగా పెరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.





ఏపీలోనే అతిపెద్ద లిక్కర్ స్కాం: బీజేపీ ఎమ్మెల్యే విష్ణు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ దేశంలోనే అది పెద్దదని, ఇందులో జగన్‌రెడ్డి ఒరిజినల్ ఓనర్స్‌ను తప్పించారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రూ.12కు వచ్చే క్వార్టర్ లిక్కర్‌ను రూ.220కి అమ్మి, రూ.కోటి లిక్కర్‌కు రూ.200కోట్ల చొప్పున కాజేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేవలం రూ.200కోట్లు కాగా, ఏపీలో రూ.30వేల కోట్ల దోపిడీ జరిగింది. దీనిపై సీఐడీ విచారణకు ఆదేశించడాన్ని బీజేపీ స్వాగతిస్తున్నాం' అని చెప్పారు. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ 'వైసీపీ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాంను స్కాన్ చేస్తే నిజాలు పూర్తిగా బయటకు వస్తాయన్నారు.

ఎంతమంది బిడ్డలుంటే..

అంతమందికీ 'తల్లికి వందనం'

● త్వరలో విధివిధానాలు జారీ చేస్తాం: లోకేశ్

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంఅమలుకు విధివిధానాలు రూపొందిస్తున్నామని, త్వరలోనే జారీ చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'తల్లికి ఎంత మంది పిల్లలు ఉంటే.. అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వర్తింపజేస్తాం. గత ప్రభుత్వ వైఫల్యం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో 72 వేల మంది విద్యార్థులు తగ్గారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖలో మంచి విధానాలు అమలు చేస్తాం. పాదయాత్రలో చాలా మందిని కలిసినప్పుడు రూ.30-40 వేలకు పాత కారు తీసుకుంటే తెల్లరేషన్ కార్డు రద్దై.. పథకాలు ఆపారని చెప్పారు. వీటన్నింటిపైనా మంత్రులందరితో చర్చిస్తున్నాం. అమ్మకు వందనం పకడ్బందీగా అమలు చేస్తాం. ఉపాధ్యాయ పోస్టులను కూడా భర్తీ చేస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి నియామక ప్రక్రియపూర్తి చేస్తాం. పక్క రాష్ట్రాల్లో కూడా ఏమి జరుగుతుందో చూస్తున్నాం. ఉత్తరప్రదేశ్, ఢిల్లీల్లో మోడల్స్ ఉన్నాయి. అధికారులు నివేదిక ఇచ్చారు. మేం కూడా వెళ్లి చూడాలనుకుంటున్నాం. మన రాష్ట్రానికి ఏ మోడల్ సూటవుతుందో చూసి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంఘాల ముందు పెట్టి వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తాం' అన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన టోఫెల్ విధానంపై ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకూ మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. 'టోఫెల్ శిక్షణలో ప్రధానమైన సమస్య అమెరికన్ యాక్సెంట్ ఉంటుంది. దాంతో మన పిల్లలకి అర్థం కావడంలేదు. ఉపాధ్యాయులు నేర్పలేకపోతున్నారు. ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అమలుకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఉపాధ్యాయులకు శిక్షణ లేకుండా నిర్ణయం తీసుకోవడం కరెక్ట్ కాదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నుంచి ప్రతికూల ప్రతిస్పందన దృష్ట్యా టోఫెల్‌పై సమీక్ష చేస్తాం' అని స్పష్టం చేశారు.

పోలీస్ శాఖలో 20 వేల సిబ్బంది కొరత: అనిత

రాష్ట్ర పోలీసు శాఖలో 20 వేల సిబ్బంది కొరత ఉందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. బుధవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల్లో సభ్యులడిగిన రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కోర్టుల్లో కేసుల కారణంగా పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ నిలిచిపోయిందని, త్వరలో వివాదం పరిష్కారం కాగానే సిబ్బంది నియామకాలు చేపడతామన్నారు. పోలీస్ నియామకాలు చేపట్టడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఫలితంగా సిబ్బందిపై పని ఒత్తిడి విపరీతంగా ఉందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెబుతూ.. తమ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు ఇబ్బందులు కలగనీయమన్నారు. మహిళా భద్రత విషయంలో దోషులెవ్వరినీ వదలబోమని చెప్పారు. కాగా, రాష్ట్రంలో 2024 నాటికి బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు 46,538 నమోదయ్యాయని మంత్రి అనిత తెలిపారు. వాటి నియంత్రణకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికీ ట్రేసవుట్ కానీ మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

కిక్కు లెక్క తేలుస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించి, ఎమ్మెల్యేలను చర్చలో భాగస్వాములను చేశారు. ఎమ్మెల్యేల సూచన మేరకు దీనిపై సీఐడీ విచారణ చేయిస్తామని ప్రకటించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

దోపిడీకి మద్యం పాలసీ

"మద్యపాన నిషేధం చేస్తామని 2019 ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి రాగానే కొత్తగా 458 మద్యం షాపులను పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. 840 బార్లలో ఒక్క దాన్ని కూడా తగ్గించలేదు. దోపిడీ కోసం ప్రత్యేకంగా మద్యం పాలసీ రూపొందించారు. ధరలు పెంచితే తాగేవారు తగ్గుతారని చెప్పి ఒకేసారి 75శాతం రేట్లు పెంచారు. అక్రమాలను అరికడతామని ఎక్సైజ్ శాఖను విడగొట్టి సెబ్ ఏర్పాటుచేశారు. కానీ అసాధారణ స్థాయిలో ధరలు పెంచడం వల్ల పక్క రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) వస్తోందని సెబ్ అధికారులే రిపోర్టు ఇచ్చారు. గత ఐదేళ్లలో 1.78కోట్ల అక్రమ మద్యం పట్టుబడింది. ఎన్‌డీపీఎల్ 66శాతం, మద్యం నేరాలు 64శాతం పెరిగాయి. వైసీపీ విధానాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పక్క రాష్ట్రాలకు వెళ్లింది. అయితే రాష్ట్రంలో ఆదాయం తగ్గడం వల్ల ఎవరికి మేలు జరిగింది, ఎవరి జేబులు నిండాయో తేలాల్సి ఉంది. 2014-19 మధ్య తెలంగాణతో పోలిస్తే ఏపీకి మద్యంపై ఆదాయం రూ.4186కోట్లు తగ్గింది. అదే 2019-24 మధ్య కాలంలో ఏకంగా రూ.42762 కోట్లు తగ్గిపోయింది. మొత్తంగా ఐదేళ్లలో ఏపీ ఖజానాకు రావాల్సిన ఆదాయంలో రూ.18860 కోట్ల నష్టం వచ్చింది. ఫలితంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆదాయం పెరిగింది"

మొత్తం వారి చేతుల్లోకి....

"లిక్కర్ సప్లై చెయిన్ మొత్తాన్ని వైసీపీ నేతలు తీసుకున్నారు. అంటే, ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు అన్నీ వారి చేతుల్లోకి వెళ్లాయి. ప్రైవేటు కంపెనీ కంటే అన్యాయంగా చేశారు. ప్రత్యేకంగా ఐఆర్‌టీఎస్ అధికారిని తీసుకొచ్చి ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా చేసి మరీ, వారికి కావాల్సిన పనులు చేసుకున్నారు. బెదిరించి డిస్టిలరీలు లాక్కున్నారు. మద్యంలో ఎంఎన్‌సీ కంపెనీలను తరిమేశారు. గతంలో ఆన్‌లైన్‌లో కంపెనీలకు ఆర్డర్లు ఇస్తే, దాన్ని మాన్యువల్ చేసి సొంత వాళ్లకు ఇచ్చుకున్నారు. చివరికి ఎంఎన్‌సీ బ్రాండ్లు మాయం చేసి లోకల్ బ్రాండ్లు తెచ్చారు. చీప్ లిక్కర్ అమ్మకాలను 99.97శాతం తగ్గించి, పేదలు రోజంతా కష్టపడి సంపాదించింది తాగుడుకే పెట్టేలా చేశారు"

తలసరి తాగుడు పెరిగింది

"తాగుడు తగ్గిస్తామని చెప్పి చివరికి తలసరి మద్యం వినియోగాన్ని పెంచారు. 2019-20లో తలసరి మద్యం వినియోగం 5.55లీటర్లుగా ఉంటే 2023-24 నాటికి అది 6.23లీటర్లకు పెరిగింది. సెబ్‌ను ఏర్పాటుచేసినా గంజాయి వినియోగం పెరిగింది. గత ఐదేళ్లలో గంజాయి స్వాధీనం 27శాతం పెరిగింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం చూస్తే మద్యం సంబంధిత నేరాలు రాష్ట్రంలో పెరిగాయి. 2022లో మద్యం, డ్రగ్స్ వల్ల వంద శాతం ఆత్మహత్యలు పెరిగాయి. 52శాతం లివర్ సమస్యలు, 54శాతం కిడ్నీ సమస్యలు పెరిగాయి. గుంటూరు జీజీహెచ్‌లోని డీఅడిక్షన్ సెంటర్‌లో కేసులు 1300 శాతం పెరిగాయి"

కొత్త కంపెనీలకే ఆర్డర్లు

"60శాతం డిస్టిలరీలను లాక్కున్నారు. విశాఖ, పీఎంకే, ఎస్‌పీవై డిస్టిలరీల్లో అదాన్, సన్‌రేస్, లీలా, ఎన్‌వీ డిస్టిలరీలకు సంబంధించిన బ్రాండ్లు ఉత్పత్తి చేసుకున్నారు. పెరల్, ఎస్వీఆర్ డిస్టిలరీలను బలవంతంగా ఆర్డర్లు లేకుండా అణచివేశారు. వైసీపీ హయాంలో 28 లిక్కర్ బ్రాండ్లు, 10 బీరు బ్రాండ్లు కొత్తగా వచ్చాయి. ఎస్ఎన్‌జే, అదాన్, లీలా, ఎన్‌వీ, బీ9, సోనా, మూనక్.. ఈ ఏడు కంపెనీలకు రూ.15,843 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చారు. ఎమ్మార్పీ రూ.150ఉన్న మద్యం ఆర్డర్లు 2020-21లో 63శాతం అదాన్, ఎస్ఎన్‌జే కంపెనీలకే వెళ్లాయి. మార్కెట్‌లో టాప్-5 బ్రాండ్లకు ఆర్డర్లు ఎందుకు ఇవ్వలేదు? అసలు వ్యాపారం లేని కొత్త బ్రాండ్లకు భారీగా ఆర్డర్లు ఎందుకు ఇచ్చారు? పైగా బూమ్ బూమ్ పేరుతో విచిత్రమైన బ్రాండ్లు తెచ్చారు. గత ప్రభుత్వంలో ప్రధానంగా రెండు రకాలుగా దోపిడీ జరిగింది. ఎన్‌డీపీఎల్‌ను తీసుకొచ్చి షాపుల్లో పెట్టి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి వెళ్లకుండా తీసుకున్నారు. అందుకే ఐదేళ్లలో రూ.99,413 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే అందులో కేవలం రూ.615 కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు చేశారు. డిజిటల్ లావాదేవీలు తీసుకోలేదు. మద్యం ఉత్పత్తి వ్యయం 16శాతం మాత్రమే. మిగిలిన 84శాతం పన్నుల రూపంలో ప్రభుత్వానికి వస్తుంది. అదే ఉత్పత్తి చేసిన మద్యాన్ని పన్నులు వేయకుండా ఎన్‌డీపీఎల్ రూపంలో విక్రయిస్తే ఆ 84శాతం ఆదాయం ఎటు పోయింది? ఇది ఎంత శాతం జరిగిందనేది తేలాలి. ఏపీఎస్‌బీసీఎల్‌పై విపరీతంగా అప్పులు చేశారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి, భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని కూడా ఫణంగా పెట్టి రూ.16,446 కోట్ల అప్పులు చేశారు. అలాగే వడ్డీ ఎక్కువ వస్తుందనే పేరుతో పది శాఖల డబ్బులు తీసుకొచ్చి బేవరేజెస్ కార్పొరేషన్‌లో పెట్టారు. ఇందుకోసం ఎస్క్రో ఖాతాలు తెరిచి మరీ అప్పులు చేశారు. ఒకవైపు ఈ అప్పులు తీరుస్తూనే ఆదాయం పెంచుకోవాలి. విధ్వంసానికి గురైన ఎక్సైజ్ శాఖను పునర్వ్యవస్థీకరించాలి. మొత్తం ఒకే గొడుగు కింద ఉండేలా చూడాలి. మద్యం షాపులు, బార్లకు కొత్త పాలసీలు రూపొందించాల్సిన అవసరం ఉంది" అని చంద్రబాబు అన్నారు.

నగదే ఎందుకు?: ఎమ్మెల్యేలు

మద్యంపై విడుదల చేసిన శ్వేతపత్రంపై మాట్లాడిన ఎమ్మెల్యేలు నాటి జగన్ అక్రమాలను ఎండగట్టారు. దాదాపు లక్ష కోట్ల వ్యాపారంలో మొత్తం నగదు లావాదేవీలే చేయడం వెనుక ఆంతర్యం ఏంటని రఘురామ కృష్ణంరాజు ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి వినియోగం భారీగా పెరిగిందని మాధవి రెడ్డి అన్నారు. మద్యం వ్యాపారంలో అత్యధికంగా లాభపడిన వ్యక్తి జగన్ ఒక్కరేనని బొలిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో అమ్మిన మద్యం వల్ల వితంతువులు పెరిగారని బుచ్చయ్య చౌదరి అన్నారు.

అక్రమార్కులకు శిక్ష పడాలి: పవన్ కల్యాణ్

మద్యంలో ఆదాయ నష్టం ఎందుకు వచ్చిందనే దానిపై లోతుగా విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. రూ.20వేలు లంచం తీసుకుంటే ఉద్యోగులపై ఏసీబీ విచారణలు చేస్తామని, రోడ్డుపై ట్రాఫిక్ కానిస్టేబుల్ తప్పు చేస్తే ప్రశ్నిస్తామని, అలాంటిది ఇన్ని వేల కోట్లు నష్టం చేస్తే శిక్ష పడకుండా ఎలా తప్పించుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం అనేది కష్టమని, అయితే నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టంలో కొంత శాతాన్ని డీ-అడిక్షన్ కేంద్రాలకు కేటాయించాలని సూచించారు. ఈ చర్చలో ప్రతిపక్షం కూడా ఉంటే బాగుండేదని, కానీ సభ నుంచి పారిపోయారని ఆరోపించారు. ఎక్కడికి పోయినా తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందేనన్నారు. ఈ నేరాలకు శిక్ష విధించకపోతే చిన్నవారినే శిక్షిస్తాం, పెద్దవాళ్లను వదిలేస్తాం అనే చెడ్డపేరు వస్తుందని తెలిపారు.

మద్యంలో మహా మాయ

(మొదటి పేజీ తరువాయి)

మద్యం షాపులుంటే అందులో 641 షాపుల్లో ఎన్‌డీపీఎల్ విక్రయాలు జరిగినట్లు అధికారులు ఇప్పటివరకూ అంచనా వేశారు. ఆ షాపుల్లో మద్యం విక్రయించిన సొమ్మును మరుసటి రోజు బ్యాంకుల్లో డిపాజిట్ చేయాల్సి ఉండగా నాలుగైదు రోజులు డిపాజిట్లు చేయలేదు. ఈ విరామంలో డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌లను వేరే చేసి ప్రభుత్వ ఖజానాకు కొంత, వైసీపీ నేతలకు కొంత పంపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇది కొన్ని షాపులకే పరిమితమైందా? లేక మొత్తం షాపుల్లో చేశారా? విచారణ జరగాలి. అన్ని షాపుల్లో ఇదే వ్యవహారం కొనసాగి ఉంటే మొత్తం దోపిడీ రూ.30వేల కోట్లఅవుతుందని అంచనా. ఢిల్లీ మద్యం స్కాంతో పోలిస్తే ఇది ఎన్నో రెట్లు ఎక్కువ!

ఇలా దారి మళ్లించారు

ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన పన్నులు వైసీపీ హయాంలో కొందరి జేబుల్లోకి వెళ్లాయనేది ప్రాథమిక అంచనా. ఒక కేసుపై నగటున రూ.200 కమీషన్ తీసుకున్నారు. ఒక కేసులో 48 సీసాలుంటాయి. అంటే ఒక్కో సీసాపై కమీషన్ రూపంలో వెళ్లింది నాలుగు రూపాయలే. అదే ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన పన్నులు దారిమళ్లిస్తే ఒక్క సీసాపైనే రూ.180 వస్తాయి. ఆ లెక్కన చూస్తే వేల కోట్లలో దోపిడీ జరిగే అవకాశం ఉంటుంది. దీనిపై ప్రాథమిక ఆధారాలు లభించడంతో ప్రభుత్వం ఇంకా లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించింది.

ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. కానీ మద్యం షాపుల్లో వైసీపీ ప్రభుత్వం చాలాకాలం వరకు డిజిటల్ లావాదేవీల విధానం ప్రవేశపెట్టలేదు. చివరికి దీనిపై హైకోర్టులో పిల్ దాఖలైతే అప్పుడు స్పందించి ప్రారంభించారు. ఆ విధానం షాపుల్లో ప్రారంభించిన తర్వాత కూడా నగదుకే మద్యం అమ్మారు. అందుకే ఐదేళ్లలో రూ.99వేల కోట్లకు పైగా మద్యం అమ్మితే అందులో కేవలం రూ.615 కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగాయి. అంటే మొత్తం అమ్మకాల్లో ఇది ఒక్క శాతం కూడా లేదు. వినియోగదారులు డిజిటల్ రూపంలో ఆ నగదు నేరుగా ప్రభుత్వానికి వెళ్తుంది. అప్పుడు ఎన్‌డీపీఎల్ విక్రయాల నగదు కూడా ప్రభుత్వానికే వెళ్తుంది. అందుకే ఆన్‌లైన్ లావాదేవీలు తీసుకోకుండా నగదుకే మద్యం అమ్మారని అర్థమవుతోంది. గతంలో దీనిపై ప్రతిపక్షాలు పెద్దఎత్తున ఆరోపణలు చేసినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు

● హెల్త్ వర్సిటీకి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ
● ఏకగ్రీవంగా రాష్ట్ర శాసనసభ తీర్మానం
● టైటిల్ చట్టం భయంకరమైనది
● ప్రజలకు ఇచ్చిన మాటమేరకు రద్దుచేశాం : సీఎం
● వ్యవస్థలను దారిమళ్లించారు: నాదెండ్ల
● ఎన్టీఆర్‌కు కులం ఆపాదించిన ఘనుడు జగన్: సత్యకుమార్

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతుల భూములకు ఉరితాడు బిగించే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ చట్టం-2022ను రద్దుచేస్తూ శాసనసభ తీర్మానించింది. రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టిన టైటిల్ చట్టం రద్దుబిల్లును సభలో కూటమి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ చట్టం రద్దయిపోయిందని, ఇందుకు సభ్యులంతా ఆమోదం తెలిపారని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహా కూటమి సభ్యులంతా కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా పేరుమార్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తిరిగి ఆ వర్సిటీకి ఎన్టీఆర్ పేరును పునరుద్ధరిస్తూ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా సభ ఆమోదించింది. కాగా, ఈ బిల్లుల ఆమోదానికి ముందు సభలో సభ్యులు స్పందించారు. టైటిల్ చట్టం రద్దుపై ముఖ్యమంత్రి మాట్లాడారు. "టైటిల్ చట్టం భయంకరమైనది. ప్రజలు, రైతులు, సామాన్యుల భూములను దోచుకునే దుర్మార్గమైన చట్టమిది. ఈ నల్లచట్టాన్ని రద్దుచేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం" అని ఆయన అన్నారు. తాత, ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించి ఇచ్చే పాస్ బుక్‌లో రాజముద్రకు బదులు జగన్ బొమ్మలు వేయడం దేనికనీ, ఇది ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోవడమేనని ఆయన ఆగ్రహించారు. ప్రచార ఆర్భాట పిచ్చి, అధికారమదంతో జగన్ పాస్‌పుస్తకాలపై తన ఫొటోలు వేసుకున్నారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సర్కారు తీసుకొచ్చిన టైటిల్ చట్టాన్ని తాము తొలి నుంచి వ్యతిరేకిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, న్యాయ వ్యవస్థలను దారిమళ్లించి, భూములను తమ నియంత్రణలో ఉంచుకొనేలా చట్టం తీసుకొచ్చారని, ఇది ప్రమాదకరమైనదని ఆయన అన్నారు. జగన్ ఫొటోలు పాస్‌పుస్తకాలపై వేయడం దరిద్రమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. భూములను దోచుకునేందుకు జగన్ తీసుకొచ్చిన టైటిల్ చట్టం రద్దుపై చర్చ జరుగుతున్నప్పుడు ఆయన సభలో లేరని మండిపడ్డారు. ఆయనకు ఫోన్‌చేసి వెంటనే సభకు పిలిపించాలన్నారు. టైటిల్‌చట్టంను రద్దుచేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీరామారావు అంటేనే ఒక బ్రాండ్అని, ఆయన పేరును హెల్త్‌వర్సిటీకి తొలగించి వైఎస్‌పేరు చేర్చడం దుర్మార్గమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ఎన్టీఆర్‌కు కులం ఆపాదించిన మొదటి వ్యక్తి జగనే అని మండిపడ్డారు. ఆరోగ్య వర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగింపును నిరసిస్తూ విజయవాడ నగరంలో విద్యార్థులు, యువకులు, 70-80 ఏళ్ల వృద్ధులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారని, వారిపై జగన్ సర్కారు అక్రమ కేసులు పెట్టిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. ఆ కేసులను రద్దుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నేనూ రీ సర్వే బాధితుడినే: గోరంట్ల

"టైటిల్ చట్టం, భూముల సర్వేకు నేను ప్రత్యక్ష బాధితుడిని. నాకు 1.60 ఎకరాల భూమి ఉంది. భూముల సర్వే తర్వాత, అందులో 1.12 ఎకరాలనే రికార్డు చేసి పట్టా ఇచ్చారు. ఇదెక్కడి న్యాయం? ఒక ఎమ్మెల్యే భూమి విషయంలోనే ఇలా చేస్తే పేదలు సామాన్యుల పరిస్థితిి ఏమిటి? జగన్ పాలనలో రూ.4 లక్షల కోట్లు దోచుకున్నారు. విశాఖ, రాజమండ్రి తోపాటు రాయలసీమలోనూ భూములు కొల్లగొట్టారు. జగన్ అక్రమాలపై విచారణ జరపాలి" అని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి డిమాండ్ చేశారు.

ఢిల్లీ వీధుల్లో జగన్ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ నేతలతో కలిసి ధర్నా చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో హింసాకాండ చెలరేగిపోతోంది. మేము అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకార చర్యలను ప్రోత్సహించలేదు. ఇప్పుడు దాడులు, దౌర్జన్యాలతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఏపీలో లోకేశ్ రెడ్ బుక్ పాలన సాగుతోంది" అని జగన్ ఆక్రోశించారు. ఈ నిరసన గజిబిజిగా సాగింది. భారీ జన సమూహంతో ఉదయం 11 గంటలకు ధర్నా చేద్దామని వచ్చిన జగన్.. ఆ ప్రాంగణాన్ని చూసి అవాక్కయ్యారు. అక్కడ 200 మంది కూడా లేరు. వారిలోనూ సగం మంది పోలీసులు, మీడియా ప్రతినిధులే. దీంతో కార్యక్రమ నిర్వాహకులపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి ఏర్పాట్లు చూసి వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధులే విస్తుపోయారు. జగన్ మీడియాతో మాట్లాడుతుండగా... మైకు సరిగా పనిచేయలేదు. తర్వాత... మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యవహరించిన తీరు పార్టీ నేతలకు ఇబ్బంది కలిగించింది. 'ఎవరూ స్టేజీ మీదికి రావొద్దు' అని ఆయన చెప్పడంతో కీలక నాయకులూ దూరంగా వెళ్లిపోయారు. జగన్ కలుగజేసుకుని అందరికీ సర్దిచెప్పారు. వేదికపై వసతులు, ఏర్పాట్ల తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమమంతా సమన్వయం లేకుండా సాగిందంటూ పార్టీ నేతలు పెదవి విరిచారు.

రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం..

జగన్ మంగళవారమే ఢిల్లీకి చేరుకున్నారు. గురు, శుక్రవారాలు సైతం ఇక్కడే ఉండనున్నట్టు సమాచారం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీతో పాటు కొందరు కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్ కోరగా, స్పందన రాలేదని తెలిసింది.

బీజేపీ వ్యతిరేకుల మద్దతు...

వైసీపీ ధర్నాకు బీజేపీ వ్యతిరేక పార్టీల నేతలను ఆహ్వానించడం గమనార్హం. కాంగ్రెస్ నేతలు దూరంగా ఉండగా.. సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తప్ప ఇతర పార్టీల ముఖ్యనేతలెవరూ రాలేదు. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీలు ప్రియాంక చతుర్వేది, సంజయ్ రౌత్, టీఎంసీ నేత నదీముల్ హక్, వీసీకే పార్టీ తమిళనాడు అధ్యక్షుడు తిరుమా వలనన్, ఆప్ నేత రాజేంద్ర పాల్ గౌతమ్, అన్నా డీఎంకే ఎంపీ చంద్రశేఖర్, డీఎంకే ఎంపీ తంబీదురై హాజరయ్యారు. జేఎంఎం, ఐయూఎంఎల్ కూడా మద్దతు పలికాయి. వినుకొండలో జరిగిన రషీద్ హత్యకు సంబంధించిన వీడియోను ఆయా నేతలకు జగన్ చూపించారు. చంపిందీ, చనిపోయిందీ తమ పార్టీ నాయకుడి గ్యాంగ్ సభ్యులేననే విషయాన్ని దాచిపెట్టారు. దీనికి రాజకీయ రంగు పులిమారు. తమకు మద్దతు పలికిన నేతలకు జగన్ ధన్యవాదాలు తెలిపారు.

ఒక పక్క ఏ1 ధర్నా.. మరోపక్క ఏ2 బాధితుడి ధర్నా...

ఢిల్లీ జంతర్ మంతర్‌లో 'ఏ1' వైఎస్ జగన్ ధర్నా చేస్తుండగా.. మరోపక్క ఏ2 విజయసాయి రెడ్డి బాధితుడు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్త మదన్ మోహన్ ధర్నాకు దిగారు. జగన్ ధర్నాకు హాజరైన వాళ్లు.. మదన్‌మోహన్ ధర్నా గురించి కూడా చర్చించుకున్నారు. ఇంకా చెప్పాలంటే.. బుధవారం జంతర్ మంతర్‌లో ఏపీలో శాంతిభద్రతల అంశం కంటే విజయసాయి రెడ్డి అంశంపైనే ఎక్కువ చర్చ జరిగింది.

అఖిలేశ్ కారుకు అడ్డంకులు

ధర్నా వేదిక వద్దకు అఖిలేశ్ యాదవ్‌ను వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తీసుకుని వచ్చారు. సమన్వయ లోపంకారణంగా వారి కారును కూడా చాలా సేపు లోపలికి వెళ్లనివ్వలేదు. అఖిలేశ్ మాట్లాడి తిరిగి వెళుతున్న సమయంలో... మాజీ జడ్జి రామకృష్ణతోపాటు మరికొందరు ఆయనను అడ్డుకున్నారు. "ఇదో బోగస్ ధర్నా. మీకు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారు. అసత్యాలు చెప్పి ఇక్కడకు తీసుకొచ్చారు. దీని గురించి మీరు మరోసారి ఆలోచించాలి" అని రామకృష్ణ సూటిగా చెప్పారు. ఒకసారి ఆఫీసుకు వస్తే కూలంకషంగా మాట్లాడుకుందాంటూ అఖిలేశ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ధర్నాకు కూడా తప్పుడు మార్గాల్లో అనుమతి తీసుకున్నారని రామకృష్ణ ఆరోపించారు. జగన్ పేరుమీద దాఖలు చేసిన అనుమతి పత్రాన్ని పోలీసులు తిరస్కరించారన్నారు.

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు

కాంట్రాక్టర్లకు 2,504 కోట్ల బకాయిలు

\- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అసమర్థ ప్రభుత్వం వల్లనే గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనక్కి వెళ్లిందని రోడ్లు భవనాలశాఖ మంత్రి బిసి. జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ హయాంలో రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, దీనివల్ల తక్కువ సమయంలోనే అవి పాడైపోయాయని తెలిపారు. ఆర్ అండ్‌బీలో 2,504 కోట్ల బిల్లులు చెల్లించలేదని, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం స్వార్థం కోసం కృష్ణపట్నం పోర్టు ఆదాయాన్ని వదులుకుందని ఆరోపించారు. పోర్టును అదానీకి ధారాదత్తం చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. కంటైనర్ పోర్టు మూతతో 12వేల మంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం మారిటైమ్ బోర్డును సున్నా చేసిందని, దీనిపై దృష్టిపెడతామన్నారు.

కేజీహెచ్‌లో సిబ్బంది కొరత..

\- మంత్రి సత్యకుమార్

విశాఖపట్నం కింగ్ జార్జి ఆస్పత్రిలో ఖాళీలున్న మాట వాస్తవమేనని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సభలో అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇతర సమస్యలపైనా దృష్టిపెట్టి, పరిష్కరిస్తామని తెలిపారు.

పది రోజుల్లో రైతులకు 674 కోట్లు

\- మంత్రి నాదెండ్ల

పది రోజుల్లో రైతులకు రూ.674 కోట్లు విడుదల చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం దాదాపు రూ.1,674 కోట్లు బకాయిలు పెట్టిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.1,000 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు.

జీవో 217 రద్దు చేస్తాం

\-మంత్రి అచ్చెన్నాయుడు

2014-19 మధ్యకాలం మత్స్యకారులకు స్వర్ణయుగమని, గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 217ను వెంటనే రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. రాబోయే కేబినెట్ సమావేశంలో జీవో రద్దుకు ప్రతిపాదనలు పెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా ఈ జీవో ఇచ్చిందని ఆరోపించారు. జీవో రద్దుతో పాటు ఉచితంగా చేపపిల్లల్ని పంపిణీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఇసుకాసురులను వదిలిపెట్టం

\- మంత్రి కొల్లు రవీంద్ర

ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడిన సంస్థలు, వ్యక్తులను వదిలిపెట్టబోమని గనుల మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. జేపీ వెంచర్స్ రూ.840 కోట్లు, జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రాలు రూ.288 కోట్ల బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని చెప్పారు. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, జేపీ వెంచర్స్ అక్రమాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు కోటి టన్నుల ఇసుక అవసరం ఉందని, అయితే ప్రభుత్వం వద్ద 37లక్షల టన్నులే ఉందని, మరో 75 లక్షల టన్నులను డీసిల్టింగ్ ద్వారా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు.

త్వరలోనే జాబ్ క్యాలెండర్

● మండలి ప్రశ్నోత్తరాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల
● సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం: మంత్రి నిమ్మల
● మిస్సింగ్ కేసుల పరిష్కారానికి కమిటీ: హోం మంత్రి అనిత
● రెండు బిల్లులకు మండలి ఆమోదం

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. దాదాపు 16 వేలకుపైబడి టీచర్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. జూన్ 2019 నాటికి దాదాపు 2,46,000 రెగ్యులర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఈ ఖాళీ పోస్టుల్లో కొన్నింటిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యక్తులు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరిమేశారని, ఇప్పుడు పరిశ్రమలు మళ్లీ రాష్ట్రంలో పెట్టుబడుల వరద వచ్చే రోజులొచ్చాయని తెలిపారు. అయితే, రాత్రికి రాత్రే అద్భుతాలు జరిగే అవకాశంలేదన్నారు. అంతలా జగన్ ఆర్థిక విధ్వంసం చేశారని, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం తాము రాత్రీపగలు కష్టపడతామని చెప్పారు.

• పీజీ ఫీజు బకాయిలు పరిష్కరిస్తాం: మంత్రి డోలా

గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ప్రైవేటు పీజీ విద్యార్థుల ఫీజు బకాయిలను కళాశాల యాజమాన్యాలతో చర్చించి పరిష్కరిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఆదేవిధంగా 2023-24.. 2వ, 3వ, 4వ త్రైమాసికాల ఫీజు బకాయిలను వీలైనంత త్వరగా విడుదల చేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని టీడీపీ సభ్యులు రామారావు, అనురాధ, చిరంజీవిరావు, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

• 18వేల కోట్ల బకాయిలు: మంత్రి నిమ్మల

ఐదేళ్లలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లలో 14 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని జగన్ అప్పుల పాల్జేశారన్నారు. జలవనరులశాఖలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు రూ.18 వేల కోట్లు బకాయిలను పెట్టి వెళ్లారన్నారు. మండలిలో పోలవరం, నీటిపారుదల రంగంపై సభ్యులు ప్రశ్నోత్తరాల్లో అడిగిన రెండు ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు.

• కోరం లేక మండలి 5 నిమిషాలు వాయిదా

బుధవారం మధ్యాహ్నం 3.43 గంటలకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సభను ప్రారంభించారు. అయితే కోరం లేదు. దీంతో సభను 5 నిమిషాలు వాయిదా వేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జకియా ఖానమ్ రావడంతో మళ్లీ సభను ప్రారంభించారు.

అధికారుల తీరుపై పవన్ అసంతృప్తి

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రశ్నలకు సంబంధించి అధికారులు తమకు ఇస్తున్న సమాచారం అసమగ్రంగా ఉండడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీల నిధులు దారి మళ్లించడంపై సభలో ప్రశ్న వచ్చింది. అధికారులు పొడిపొడిగా అవును...కాదు... ఉత్పన్నం కాదనే పద్ధతిలో సమాధానాలు తయారు చేసి పంపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ్యులకు ఇచ్చే సమాధానం ఆరకొరగా... పొడిపొడిగా ఉండాలన్న నిబంధన ఏదైనా ఉందా? సభ్యులు సమాచారం కోరినప్పుడు వివరంగా ఇస్తే ఇబ్బంది ఏవిటి? అనుబంధ పత్రాల్లో వివరాలు పెట్టడం కాకుండా సభ్యులకు ఇచ్చే సమాధానంలోనే వివరాలు ఉండేలా చూడండి' అని పవన్ ఆదేశించారు.

పారిశ్రామికీకరణ వల్లే విశాఖలో కాలుష్యం

దశాబ్దాలుగా విశాఖపట్నం గణనీయమైన పారిశ్రామిక అభివృద్ధిని చూడడం వల్ల, పర్యావరణ, కాలుష్య సమస్యలకు దారి తీసిందని డిప్యూటీ సీఎం పవన్ వివరించారు. బుధవారం అసెంబ్లీల్లో ప్రశ్నోత్తరాల సమయంలో జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

జగన్ ఇలాకాలో ఇళ్ల దందా!

- పులివెందుల లేఔట్‌లో 2,100 మంది అనర్హులకు ఇళ్లు
- మొత్తంగా దాదాపు 150కోట్ల ప్రజాధనం దుర్వినియోగం!
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఫిర్యాదుతో విచారణకు చంద్రబాబు ఆదేశం
- సెలవులో వెళ్లిపోయిన కడప జిల్లా హౌసింగ్ హెడ్

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మునిసిపాలిటీ పరిధిలోని హౌసింగ్ లేఔట్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 250 ఎకరాల విస్తీర్ణంలో 7వేలకు పైగా ఇళ్ల స్థలాలతో ఏర్పాటు చేసిన ఈ మెగా లేఔట్‌లో ఎక్కువ ఇళ్లు అనర్హులకు మంజూరు చేసి, రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ఇటీవల సీఎం చంద్రబాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాలపై గత ప్రభుత్వంలోనే తాము అనేక ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని తెలిపారు. పులివెందుల అర్బన్ హౌసింగ్ లేఔట్‌లో అనర్హులకు ఇళ్లు మంజూరు చేయడంలో కీలకపాత్ర పోషించిన అప్పటి కడప జిల్లా జేసీ, పులివెందుల మున్సిపల్ కమిషనర్, ఇతర బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడ ఇళ్లు పొందిన నకిలీ లబ్ధిదారులపై కూడా చర్యలు తీసుకోవాలని భూమిరెడ్డి తన ఫిర్యాదులో డిమాండ్ చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు విచారణకు ఆదేశించడంతో కడప జిల్లా కలెక్టర్ నేతృత్వంలో 10 బృందాలు సమగ్ర విచారణ చేపట్టాయి. ఈ లేఔట్‌లో పక్కా ఇళ్లు పొందిన లబ్ధిదారుల వివరాలు సేకరించగా.. మొత్తం 2,100 మంది అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లు తేలింది. వీటికి కేటాయించిన సెంటున్నర స్థలం విలువ రూ.3లక్షలు, ఇంటి నిర్మాణానికి ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీ రూ. 1.80 లక్షలు, లబ్ధిదారుని పేరు మీద అప్పుగా మంజూరు చేసిన మరో రూ.35వేలు, లేఔట్‌లో మౌలిక సదుపాయాల కోసం చేసిన ఖర్చును లెక్కిస్తే.. ఒక్కొక్క ఇంటికి రూ.7.15 లక్షలు అవుతుందని అంచనా. ఈ లెక్కన పులివెందుల అర్బన్ లే-అవుట్‌లో రూ.150 కోట్లకు పైగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఇంత అడ్డగోలుగా సాగిన అక్రమాలపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు కనీసం పట్టించుకోలేదు. ఏం చేసినా జగన్ రక్షిస్తాననే నమ్మకంతో బరితెగించి వ్యవహరించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం విచారణ చేపట్టడంతో బాధ్యులైన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ లేఔట్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టరు ఈ వారంలోనే ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా హౌసింగ్ ఉన్నతాధికారి ఇప్పటికే సెలవు పెట్టి వెళ్లిపోయారు. మరికొందరు అధికారులు కూడా అదే దారిలో ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు హౌసింగ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులూ లబ్ధిదారులే

ప్రధానమంత్రి అవాస్ యోజన కింద కేంద్రం మంజూరు చేసిన ఈ ఇళ్లను నిబంధనల ప్రకారం నిరుపేదలకు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ఐటీ చెల్లిస్తున్నవారికి, స్థానికేతరులకు స్థలాలు కేటాయించడమే కాకుండా.. వాటిలో పక్కా ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు కూడా విడుదల చేసేశారు. ఈ లేఔట్‌లో మొత్తం 7,008 ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ అధికారులు మ్యాపింగ్ చేయగా అందులో 6,738 ఆప్షన్-3 (ప్రభుత్వం కట్టించి ఇచ్చేవి) ఇళ్లు ఉన్నాయి. వాటిని నిర్మించి లబ్ధిదారులకు అప్పగించే కాంట్రాక్టును వైసీపీ అస్మదీయులకు చెందిన వినాయక కనస్ట్రక్షన్స్, డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకే కట్టబెట్టారు. ఈ లేఔట్‌లో ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నగదు రూపంలో రూ.57,62,56,963 విడుదల చేశారు. మరో రూ.23,93,18,998 విలువైన సిమెంటు, స్టీలు, ఇసుక తదితర మెటీరియల్స్‌ను అందజేశారు. మొత్తంగా ఈ ఒక్క లేఔట్‌లోని ఇళ్లకే దాదాపు రూ.82కోట్లు ఖర్చు చేయగా.. ఇప్పటి వరకు ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా పూర్తిచేయలేదు.

వ్యవస్థలను కుప్పకూల్చారు!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని.. పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పారు. 13.5 శాతం వృద్ధి రేటు సాధించిన రాష్ట్రంలో ఈ రోజు పరిస్థితి ఇలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన కంటే ఎక్కువ నష్టం గత ఐదేళ్ల వైసీపీ వైసీపీ పాలన వల్ల జరిగిందన్నారు. కేంద్రం ఆక్సిజన్ అందిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. 'కేంద్రం సాయం చేయడానికి ముందుకు రావడం మంచి పరిణామం. పోలవరం, అమరావతితో పాటు వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వడానికీ ముందుకొచ్చింది. రాయలసీమలో పారిశ్రామిక కారిడార్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది' అని తెలిపారు.

కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి..

తన హయాంలో తెచ్చిన పాలసీలన్నీ జగన్ పక్కన పడేశారని చంద్రబాబు తెలిపారు. 'నాడు ఈ-సేవ తెచ్చాం.. రియల్ టైం గవర్నెన్స్ తెచ్చాం. ఇలాంటి వ్యవస్థలన్నిటినీ మూలన పడేశారు. మీ మీ శాఖల్లో ఉన్న వ్యవస్థలను యాక్టివ్ చేయండి. అధికారులు కూడా సెన్సిటివ్‌గా పని చేయాలి. కేంద్రం ఏయే శాఖలకు ఎంత నిధులు ఇస్తుందో తెలుసుకోవాలి. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం వల్ల కేంద్ర పథకాలు కూడా ఉపయోగించుకోలేదు. నేను ఢిల్లీలో కేంద్ర మంత్రుల వద్దకు వెళ్తే.. గత ప్రభుత్వం కనీసం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీలు) కూడా ఇవ్వలేదని, నిధులు దారి మళ్లించారని చెప్పారు. అంటే గత ప్రభుత్వం ఎన్ని తప్పులు చేసిందో ఆలోచించాలి. నేను నాలుగో సారి ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్రంలో ఎప్పుడూ లేనన్ని సమస్యలు, భిన్నమైన పరిస్థితి ఇప్పుడు ఉన్నాయి' అని చెప్పారు. ఏడాదిలో కేంద్రం నుంచి ఎంత మేర నిధులు తేగలమో చూసి.. అవన్నీ తెచ్చేలా అధికారులు పని చేయాలన్నారు. కేంద్రం పెట్టిన కొత్త బడ్జెట్ ప్రకారం నిధులు తెచ్చుకోవడానికి ఉన్న అవకాశాలు పరిశీలించాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో చాలా కఠినంగా ఉంటామన్నారు. రౌడీలను అణచివేస్తామని.. గంజాయి అనేది లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులు సమర్థంగా పని చేయాలన్నారు. మద్యం, మైనింగ్‌లో భారీ అవినీతి చేశారని.. దీనిని వెలుగులోకి తీసుకొచ్చే పని ప్రారంభించామని చెప్పారు. 'పేదరికం లేని సమాజం అనేది మా ప్రభుత్వం లక్ష్యం. దీని కోసం పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాలసీలు పక్కాగా అమలు చేయడం ద్వారా పేదరికం తగ్గించవచ్చు. కలిసి ముందుకు వెళ్దాం. ప్రగతిశీల, ప్రభావాత్మక పాలన అందిద్దాం' అని అన్నారు. రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టి తదనుగుణంగా పని చేయాలని చెప్పారు. అమరావతికి మూడేళ్లలో ఒక రూపం తీసుకురావాలని నిర్ణయించామని.. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు.



బాబుతో ఆస్ట్రేలియన్ హైకమిషనర్ భేటీ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భారత్‌లోని ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఓమ్ బుధవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని సంస్కృతి, సంప్రదాయాలు, మంచి పర్యావరణ వ్యవస్థ, ఇక్కడ నెలకొన్న వ్యాపార అనుకూలతలు, బిజినెస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్ మీ కోసం వేచి ఉన్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి చొరవ చూపాలని ఆస్ట్రేలియా ప్రభుత్వాన్ని ఆహ్వానించానని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. అనంతరం ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్ మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోనూ సమావేశమయ్యారు.

అలాంటివారు మాకు వద్దు..

బదిలీల్లో భాగంగా అందరికీ మంచి శాఖలే ఇచ్చామని.. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని చంద్రబాబు అధికారులను కోరారు. 'జగన్ జమానాలో మాదిరిగా వ్యవహరిస్తాం.. పనిచేయబోమని అంటే.. నమస్కారం పెట్టి మీరే వెళ్లిపోండి. మాకు అవసరం లేదు.. అభివృద్ధిని పాడుచేయొద్దు' అని స్పష్టం చేశారు. వయబుల్ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కొన్ని స్కీములకు కేంద్రమే నిధులిస్తోందని.. దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం ఉండదని.. నిర్వహణ కూడా తేలికవుతుందని.. అలాంటి స్కీములపై దృష్టిపెట్టి నిధులు వచ్చేలా కృషిచేయాలని కోరారు.

ఏపీలో తలసరి ఆదాయం..

తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఎక్కువ తలసరి ఆదాయం పొందుతోందని.. నాడు తాను తీసుకున్న నిర్ణయాలు, తెచ్చిన పాలసీల వల్లే ఇది సాధ్యమైందని సీఎం చెప్పారు. 'అమెరికాలో కూడా భారతీయులే ఎక్కువ తలసరి ఆదాయం పొందుతున్నారు. వైట్ అమెరికన్స్ 65 వేల డాలర్లు పొందుతుంటే.. మనవాళ్ల తలసరి రాబడి 1.19 లక్షల డాలర్లుగా ఉంది. తెలుగు వాళ్లు ప్రపంచంలో, దేశంలో ముందుకెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తద్విరుద్ధమైన పరిస్థితి నెలకొంది' అని బాధపడ్డారు.

> ఓట్లు వేరు.. ప్రజలకు మంచి చేయడం వేరు. ప్రతి పనికీ రాజకీయ ప్రయోజనం ఉండకపోవచ్చు. కానీ మంచి చేశామనే ఒక తృప్తి ఉంటుంది. నా అరెస్టు సమయంలో అంత మంది రోడ్డెక్కడానికి.. అంతకుముందు నేను చేసిన మంచే కారణం. మంచి చేస్తే ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారు.
>
> అధికారులు బ్యూరోక్రటిక్ కోణంలో కాకుండా, మానవీయ కోణంతో పని చేయాలి. ప్రజలు సాయం కోరి వస్తే, ఆ సమస్య ఎలా పరిష్కరించాలో ఆలోచించాలి. కేవలం రూల్స్ గురించే ఆలోచిస్తే అందరికీ మంచి చేయలేం.
>
> - సీఎం చంద్రబాబు

నిశ్శబ్ద విప్లవం..

'మూడు పార్టీలుగా కలిసి పోటీ చేశాం. ఎన్నికల సమయంలో ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలని చెప్పాం. దానిని నిజం చేసి చూపించారు' అని చంద్రబాబు తెలిపారు. మొన్నటి ఎన్నికలు ఒక నిశ్శబ్ద విప్లవమన్నారు. ఈ ఫలితాలతో కొత్త చరిత్రకు నాంది పలికినట్లు చెప్పారు. 'మా కూటమికి 93 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది. 57 శాతం ఓట్ షేర్ వచ్చింది. గత ఐదేళ్లలో ప్రజలు పడిన కష్టాల కారణంగా వచ్చిన ఫలితం ఇది. గత ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లిన వాళ్లు, ఇతర దేశాల్లో ఉన్న వారు వచ్చి ఓట్లు వేశారు' అని వివరించారు.

భవిష్యత్‌లోనూ ఇలాగే ఆదుకోండి

- అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు వినతి

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యం ఇచ్చినందుకు కేంద్రప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లో కూడా ఇదే విధమైన సహాయ సహకారాలు అందించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. బుధవారం సాయంత్రం వారితో ఆయన ఫోన్లో మాట్లాడారు. రాష్ట్రం ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి, కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. ఏపీకి చేసిన కేటాయింపులతో ఎంతో మేలు జరుగుతుందని, రాష్ట్ర పునర్నిర్మాణంపై ప్రజలకు నమ్మకం కలిగించాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి తాము కూడా కట్టుబడి ఉన్నామని, భవిష్యత్‌లో మరింతగా సహకరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

హాస్టల్ నుంచి వెళ్లిపోయేందుకు.. తోటి విద్యార్థిపై పెట్రోలు పోసి అంటించాడు

- బాధితుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు
- ఏలూరు సెయింట్ జేవియర్ హైస్కూలులో ఘటన

ఏలూరు క్రైం, జూలై 24: ఏడో తరగతి చదువుతున్న ఆ విద్యార్థికి హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదు. ఎలాగైనా ఇంటికెళ్లిపోవాలని నిర్ణయించుకుని.. ఓ క్రూరమైన ఆలోచన చేశాడు. తోటి విద్యార్థిపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. ఏలూరు జిల్లా ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన ఒక విద్యార్థి మూడు వారాల క్రితం ఏలూరులోని సెయింట్ జేవియర్ హైస్కూలు (బాయిస్ కాన్వెంట్)లో 7వ తరగతిలో చేరాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన మరో విద్యార్థి రెండువారాల క్రితం అదే స్కూలులో 7వ తరగతిలో చేరి అదే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆ విద్యార్థికి హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదు. ఎలాగోలా ఇంటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. హోమ్‌సిక్ హాలీ డేస్‌కు వెళ్లిన ఆవిద్యార్థి తిరిగి వస్తూ పావు లీటర్ పెట్రోల్ తెచ్చుకుని దాచుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున హాస్టల్‌లో నిద్రిస్తున్న గుడివాకలంక గ్రామానికి చెందిన విద్యార్థిపై దాన్ని చల్లి నిప్పంటించాడు. ఈ విద్యార్థి కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది అప్రమత్తమై మిషనరీ ఆస్పత్రికి తరలించారు. బాధిత బాలుడి తండ్రికి వార్డెన్ ఫోన్ చేసి పిలిపించారు. మీఅబ్బాయి ఇంటిపై బెంగ పెట్టుకున్నాడని చెప్పడంతో ఆయన బుధవారం సాయంత్రం అక్కడకు చేరుకున్నారు. ఇంతజరిగితే తమకు మాట మాత్రమైనా చెప్పకపోవడంపై యాజమాన్యంపై ఆగ్రహించారు. పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి వారు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

వేతన బకాయి కోసం అంధ ఉద్యోగి దీక్ష

విడపనకల్లు, జూలై 24: అనంతపురం జిల్లా విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం ఎదుట అటెండర్ తిప్పేస్వామి బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. తనకు 11 నెలల వేతన బకాయి ఇచ్చి ఆదుకోవాలని విన్నవించారు. అంధుల కోటాలో 2003లో తనకు ఉద్యోగం వచ్చిందని తెలిపాడు. గత ఏడాది గుంతకల్లులో ఇన్‌చార్జి తహసీల్దారు రాము, ఆర్డీఓ రవీంద్రస్వామి తనపై అవినీతి కేసు పెట్టి, సస్పెండ్ చేయించారని వాపోయారు. ఆ కేసు హైకోర్టు కొట్టివేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి తిరిగి విధుల్లోకి తీసుకున్నారని, అప్పటి నుంచి వేతనాలు ఇస్తున్నారని, కానీ 11 నెలల బకాయి ఇవ్వడం లేదని వాపోయాడు.



ముమ్మరంగా విచారణ

- మదనపల్లెలో మూడో రోజూ కొనసాగింపు

రాయచోటి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. మూడోరోజూ బుధవారం ఉన్నతాధికారులు విచారణ కొనసాగించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మదనపల్లెలోనే మకాం వేసి విచారణను పర్యవేక్షిస్తున్నారు. సిసోడియా, ఫైర్ సర్వీసు డైరెక్టర్ పి.వెంకటరమణ కలిసి కీలక ఫైళ్లు కాలిపోయిన ప్రాంతంలో పరిశీలించారు. తొలుత అగ్గి ఎలా వ్యాపించింది.. దానికి గల కారణాలను ఫైర్ సర్వీసు డైరెక్టర్ విశ్లేషించారు. పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి బంధువులు, ముఖ్యస్నేహితుల ఇళ్లల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మదనపల్లెలో గతంలో పని చేసిన ఆర్డీవో మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్ కారు డ్రైవర్లుగా పనిచేసిన వారి ఇళ్లలోనూ పోలీసులు, రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. ఘటన జరిగిన రోజు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో వన్‌టౌన్ సీఐను వీఆర్‌కు పంపించారు. బీట్ కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కరయ్యను సస్పెండ్ చేశారు. ప్రమాదం జరిగిన మరుసటిరోజు సంఘటనా స్థలంలో సేకరించిన హార్డ్ డిస్కులు, సగం కాలిన ఫైళ్లపై ఉన్న నంబర్ల ప్రకారం అధికారులు విశ్లేషిస్తున్నారు. రెండు మూడేళ్లుగా మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని 11మండలాల్లోని భూసమస్యలపై ఫిర్యాదులు సేకరిస్తామని సిసోడియా తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి మదనపల్లెలో అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు.

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులను పోలీసులు విచారించారు. 22ఏ సెక్షన్‌లో ఏయే ఫైళ్లు పూర్తయ్యాయో అధికారులు విచారించారు. ప్రధాన అనుమానితుడు, పెద్దిరెడ్డి బినామీ మాధవరెడ్డి, ఆయన కొడుకు, భార్యల పేరిట ఏయే భూములు రిజిస్టర్ అయ్యాయో సబ్‌రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు.



కాలిపోయిన రికార్డులను పరిశీలిస్తున్న సిసోడియా

పోలీసుల అదుపులో నలుగురు!

సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆర్డీవో సీసీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను అదుపులోకి తీసుకుని పోలీసు అధికారులు విచారిస్తున్నారు. ఆర్డీవో సీసీ మణి కంప్యూటర్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఆయన అధికారులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ.. ఐదారేళ్లుగా సీసీగా వ్యవహరిస్తున్నారు. డీటీ అస్లాం... టైపిస్టుగా రెవెన్యూ శాఖలో చేరి డిప్యూటీ తహసీల్దార్ వరకు ఈ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్ నాలుగేళ్ల క్రితం పలమనేరు నుంచి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధుల్లో చేరారు. ఇటీవల సీనియర్ అసిస్టెంటుగా పదోన్నతి పొంది భూములకు సంబంధించిన రికార్డులు చూస్తున్నారు. మరో సీనియర్ అసిస్టెంట్ భరత్‌రెడ్డి మూడేళ్ల క్రితం జూనియర్ అసిస్టెంటుగా విధుల్లో చేరి ఇటీవల సీనియర్ అసిస్టెంటుగా పదోన్నతి పొందారు. గౌతమ్‌తేజ్‌తో కలిసి భూ రికార్డుల విభాగంలో పని చేస్తున్నారు. కాగా, బలవంతంగా తాము ఎవరినీ అదుపులో తీసుకోలేదని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వారిని విచారిస్తున్నట్లు తెలిపారు. మాధవరెడ్డితో పాటు మరో ఐదుగురు ముఖ్య వ్యక్తుల కదలికలను గమనిస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ కార్యాలయాల్లో సీసీకెమెరాలు: సీసీఎల్ఏ ఆదేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాలు, రికార్డు గదుల్లో సీసీటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్లను తగులబెట్టిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర రెవెన్యూ ఆఫీసులు అంటే.. కలెక్టరేట్, సబ్‌కలెక్టర్, ఆర్డీఓ, తహసిల్దార్ కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలతో ఆన్‌లైన్ నిఘాను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాలకు 24 గంటలూ భద్రత కల్పించాలని, కీలకమైన ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా ఉంచాలని, వీఆర్ఏల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. రికార్డు రూమ్‌లకు ప్రత్యేక భద్రత పెంచాలన్నారు.

అమరావతికి చుక్.. చుక్

(మొదటి పేజీ తరువాయి)

కొత్త లైన్లకు సంబంధించి 41 ప్రాజెక్టులు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ 56 కిలోమీటర్ల పరిధిలో రూ.2,047 కోట్లతో కొత్త రైల్వే ప్రాజెక్టును చేపడుతున్నామని, ఇది డీపీఆర్ దశలో ఉన్నదని చెప్పారు. నీతీఆయోగ్ కూడా దీనిని అనుమతించిందని తెలిపారు. అమరావతి రైల్వే లైన్‌మ్యాప్‌ను ఆయన విలేకరులకు చూపించారు. విజయవాడ-ఎర్రుపాలెం నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టు ద్వారా కృష్ణానదిని దాటి అమరావతి స్టేషన్‌కు, అక్కడి నుంచి నంబూరుకు ఈ లైను చేరుకుంటుందని తెలిపారు. కాగా, విశాఖ రైల్వేజోన్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ఇంతవరకూ భూమిని అప్పగించలేదని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గత ప్రభుత్వం ఇవ్వజూపిన స్థలం రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నందువల్ల బ్యాక్ వాటర్ సమస్యతో దాన్ని స్వీకరించలేదని, తర్వాత ఎన్నిసార్లు అభ్యర్థించినా తమకు భూమి కేటాయించలేదని చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల ఆ స్థలాన్ని సందర్శించారని, తనతో కూడా మాట్లాడారని తెలిపారు. త్వరలో భూమిని గుర్తించాలని సీఎం చంద్రబాబును కోరామని, భూమి కేటాయించగానే పనులు చేపడతామని చెప్పారు. ఏపీలో 2009-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 73 కొత్త రైల్వే లైన్ల నిర్మాణం జరగగా, తాము పదేళ్లలో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 151 కొత్త రైల్వే లైన్లను నిర్మించామన్నారు. అదే విధంగా యూపీఏ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కేవలం 37 రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగితే, తాము గత పదేళ్లలో 195 లైన్ల విద్యుదీకరణ జరిపామని ఆయన చెప్పారు. ఏపీలో రికార్డు స్థాయిలో 2014 నుంచి743 రైల్వే ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలను నిర్మించామని తెలిపారు ఈ ఏడాది 73 స్టేషన్లను 'అమృత్ స్టేషన్లు'గా అభివృద్ధి చేస్తున్నామని, అందులో విజయవాడ రైల్వేస్టేషన్ ఒకటి అని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

క్యూ కట్టిన వైసీపీ బాధితులు

- భూ సమస్యలపై అర్జీల వెల్లువ.. టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌తో కలిసి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిల్లో అత్యధిక భాగం గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన భూఆక్రమణలు, అక్రమాలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులే ఉన్నాయి. తమ భూములను ఆక్రమించుకున్నారంటూ పేదలు, మహిళలు, వృద్ధులు భారీ సంఖ్యలో వచ్చి ఫిర్యాదులిచ్చారు. తమ భూములను 22ఏ కింద చేర్చి అసైన్డ్ భూములు అంటున్నారని, న్యాయం చేయాలని మరి కొంతమంది కోరారు. గ్రామ సహాయకుల సంఘం ప్రతినిధులు మంత్రి అనగానిని కలిసి.. వైసీపీ ప్రభుత్వం తమకొస్తున్న డీఏను తొలగించిందని, చెల్లించిన మొత్తాలను కూడా రికవరీ చేసిందని, న్యాయం చేయాలని కోరారు. పిఠాపురంలో తనకున్న 4సెంట్ల భూమిని వైసీపీ నేత ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసి ఇబ్బంది పెడుతున్నారని రేపల్లె నియోజకవర్గం గూడవల్లికి చెందిన వాణిశ్రీ వాపోయారు. తనకు పసుపు కుంకుమ కింద వచ్చిన 33 సెంట్ల స్థలంపై వైసీపీ నేతల కళ్లు పడ్డాయని, ఆ భూమిని చౌకగా కొట్టేసేందుకు తనను అమ్ముకోనివ్వకుండా ఏడాది నుంచి ఇబ్బందులు పెడుతున్నారని మాచర్లకు చెందిన బత్తుల లక్ష్మి చెప్పారు. రేపల్లెలో తన పేరు మీద ఉన్న స్థలం, రెండస్తుల ఇల్లు అసైన్‌ల్యాండ్ జాబితాలో చేర్చారని, కానీ తాను 20ఏళ్ల నుంచి ఈ ఆస్తికి అన్ని రకాల పన్నులు కడుతున్నానని, తన వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని రేపల్లెకి చెందిన భారతి మంత్రికి తెలిపారు. వీటన్నింటినీ అధికారులకు పంపించి పరిష్కారం చూపిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ బాధితులకు హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై, వైసీపీ భూ ఆక్రమణలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులొస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన తర్వాత ఆయన మాట్లాడుతూ భూఆక్రమణలపై వచ్చిన వినతి పత్రాలలో అధికం వైజాగ్ ప్రాంతానివేనన్నారు. భూసమస్యలతో పాటు ఎలక్ట్రిక్ సిటీ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు.



బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో దివ్యాంగుడి కష్టాలు వింటున్న మంత్రి అనగాని

ప్రభుత్వ జీవోలన్నీ అప్‌లోడ్ చేస్తాం

- జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరిస్తాం
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్రప్రభుత్వం

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జీవోలన్నింటినీ జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. 2019కి ముందు ఉన్న జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు సంబంధించి చర్యలు ప్రారంభించిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలు నమోదు చేసిన ధర్మాసనం తదుపరి విచారణను 8వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. జగన్ ప్రభుత్వ హయాంలో.. జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టకపోవడం, ఏపీఈగెజిట్ వెబ్‌సైట్‌లో పరిమిత సంఖ్యలో అప్‌లోడ్ చేయడాన్ని సవాల్ చేస్తూ గుంటూరుకు చెందిన కోమటినేని శ్రీనివాసరావు, న్యాయవాది ఎస్ఆర్ ఆంజనేయులు, జీఎంఎన్ఎస్ దేవి, తెలుగువన్.కామ్ డిజిటల్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ కంఠంనేని రవిశంకర్ వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. అవి హైకోర్టు ముందు మరోసారి విచారణకు వచ్చాయి.

సుభాష్ ఎక్కడ?

- లొకేషన్ గుర్తించాలని విశాఖ అధికారులను కోరిన శాంతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారంలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ప్రభుత్వ మాజీ ప్లీడర్ (రెవెన్యూ) పోతిరెడ్డి సుభాష్‌తో తనకు 2020లోనే పెళ్లి జరిగిందని, ఆయనవల్లే తనకు బిడ్డ జన్మించినట్టు శాంతి చెబుతున్నారు. కానీ దీనిని ఆయన ధ్రువీకరించడం లేదు. ఇప్పటివరకు సుభాష్ ఎక్కడా తెర పైకి రాలేదు. కొన్ని టీవీ చానళ్లు ఆయన కోసం సంప్రదించినా స్పందించలేదు. ఆయనకు సన్నిహితుడైన విశాఖకు చెందిన ఓ న్యాయవాది శాంతి, మదన్‌మోహన్ దంపతుల వివాదం గురించి ప్రస్తావిస్తూ.. 'ఆ బిడ్డకు మీరే తండ్రి అని చెబుతున్నారు. దానికి ఏమంటారు?' అని ప్రశ్నించగా... తనకు సంబంధం లేదని సుభాష్ సమాధానం ఇచ్చారు. ఆ కాల్ ఆడియో రికార్డు పలు చానళ్లలో ప్రసారమైంది. అయితే ఇప్పటికీ తన భర్త సుభాషే అని శాంతి చెబుతుండగా,ఆయన మాత్రం నోరు విప్పడం లేదు. ఎక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు. కనీసం ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆమె తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. సుభాష్‌కు చెందిన 2ఫోన్ నంబర్లు ఇతరుల ద్వారా పోలీసులకు అందజేసి, తనకు ఆ నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ఎక్కడి నుంచి చేస్తున్నారో తెలుసుకొని చెప్పాలని ఆమె కోరారు. పోలీసులు ఆ నంబర్ల లొకేషన్ గుర్తించి ఆమెకు తెలియజేశారు. అయితే సుభాష్ తో కలిసి మాట్లాడే అవకాశం రాలేదు. కాగా బిడ్డ పుట్టినప్పుడు ఆస్పత్రిలో ఉన్నారని వార్తలు రావడంతో పాటు విల్లా రిజిస్ట్రేషన్ పత్రాల్లో తన పేరు రాయించుకున్న సుభాష్.. ఇప్పుడు శాంతికి ఎందుకు దూరమయ్యారో? ఆయన ప్రస్తావన మీడియాలో చర్చకు తేవద్దని శాంతి కోరడం వెనక కారణం ఏమిటో?



శాంతిని ట్రాప్ చేశారు

- వెయ్యి కోట్ల భూములు కాజేశారు
- ఇది సాయిరెడ్డి, సుభాష్ కుట్ర
- శాంతి భర్త మదన్ మోహన్ ఆరోపణలు

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విశాఖలో రూ.వెయ్యికోట్ల భూమిని కాజేసేందుకే దేవదాయశాఖ సహాయ కమిషనర్ అయిన తన భార్య శాంతిని ట్రాప్ చేశారని ఆమె భర్త మదన్ మోహన్ ఆరోపించారు. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి, అప్పటి ప్రభుత్వ లాయర్ పోతిరెడ్డి సుభాష్ ఈకుట్ర చేశారన్నారు. బుధవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జగన్ నిరసన శిబిరానికి వంద మీటర్ల దూరంలోనే... ఆయన ఆందోళన చేపట్టారు. "వైఎస్ జగన్ డౌన్ డౌన్.. విజయసాయి రెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి.. నా బిడ్డకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించి తండ్రెవరో తేల్చాలి" అంటూ నినాదాలు చేశారు. విజయసాయిరెడ్డిని పక్కనే పెట్టుకుని ధర్నా చేస్తున్న జగన్ తనకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ.. ఆయనను కలిసేందుకు వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డిపై మదన్ మోహన్ తీవ్రమైన విమర్శలు చేశారు. "నా భార్య శాంతి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా చేస్తోంది. అందుకే ఒక పథకం ప్రకారం ఆమెను ట్రాప్ చేశారు. రూ.1000కోట్ల భూములను కాజేయాలనే కుట్రతో మొదటి పోస్టింగ్ విశాఖలోనే ఇచ్చారు. శాంతిని మభ్య పెట్టి ప్రేమ సమాజంలోని భూములను 33 నుంచి 99 ఏళ్ల లీజులకు రాయించుకున్నారు. ఆమెను ప్రలోభ పెట్టి బిడ్డను కన్నారు. విజయసాయిరెడ్డి సలహా మేరకు.. నాతో విడాకులు తీసుకున్నట్టు ఫేక్ డాక్యుమెంట్ సృష్టించారు. భూ కుంభకోణం బయటికి వస్తుందనే భయంతో తప్పుల మీద తప్పులు చేస్తున్నారు. గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలుస్తాం. మాకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తాం" అని మదన్ మోహన్ పేర్కొన్నారు. విజయసాయి రెడ్డి ఏ తప్పూ చేయకపోతే డీఎన్ఏ పరీక్షకు ఎందుకు ఒప్పుకోవడం లేదని నిలదీశారు. తక్షణమే ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాయి రెడ్డి వల్ల తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

చినుకు పడితే ఛిద్రమే..!

వేసిన 4నెలలకే కానూరు ప్రధాన రోడ్డంతా గోతులమయం

- సూపర్‌విజ్ రోడ్డులో మోకాళ్లలోతు గుంతలు
- నవతా రోడ్డులో ప్రయాణం నరకప్రాయం
- అధికారుల వైఫల్యాలతో ప్రయాణికులకు అవస్థలు
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని ఆవేదన



కానూరు ప్రధాన రోడ్డులో ప్రయాణికుల అవస్థలు

పెనమలూరు, జూలై 24: కానూరు మెయిన్ రోడ్డుపై వర్షం చుక్కపడితే చాలు.. ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. రోడ్డు పొడవునా గుంతలతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా యూనియన్ బ్యాంకు వద్ద, కెనడీ పాఠశాల సమీపంలో రోడ్డు చిన్నపాటి వర్షాలకే పాడైపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత జనవరికి ముందు వర్షాలకు పాడైన గుంతల రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఈసమయంలో తాడిగడప మునిసిపాలిటీ ఇంజనీరింగ్ అధికారుల పనితీరు తూతూమంత్రంగా మారడంతో తిరిగి నెలలు తిరగకుండానే రోడ్డు ఛిద్రమైపోయింది. దీంతో ప్రయాణికుల కష్టాలు షరా మామూలైంది. రోడ్ల మరమ్మతుల్లో ఇంజనీరింగ్ అధికారులు నాణ్యత పాటించకపోవడంతో తరచుగా రోడ్డు పాడవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రెయిన్ల కంటే రోడ్డు డౌన్‌లో ఉండడం, రోడ్డుపై నిలిచిన నీళ్లు డ్రెయిన్లలోకి పోకపోవడంతో ఇబ్బందులు మామూలయ్యాయని తెలుస్తోంది. రోడ్డుపై మెరక వేయి డ్రెయిన్లను నిర్మించాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రోడ్డు మరమ్మతుల సమయంలో కాంట్రాక్టరు చేయించే పనులను పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో నాణ్యతా లోపాలతో రోడ్డు పాడవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటకాల్వ రోడ్డును వందడుగుల రోడ్డుతో అనుసంధానించే కానూరు సూపర్‌విజ్ రోడ్డు ప్రయాణికులకు నిత్యం నరకం చూపిస్తోంది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో క్లోజ్ డ్రైనేజీ అంచనాలతో అభివృద్ధి చేద్దామని అంచనాలు తయారు చేసి రోడ్డు పనులను ప్రారంభించగా వెంటనే వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులను నిధుల లేమితో అటకెక్కించింది. దీంతో సదరు రోడ్డు పాలకుల నిర్లక్ష్యంతో కునారిల్లుతోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. కానూరు ప్రధాన రోడ్డు, సూపర్‌విజ్ రోడ్లలో వాహనదారులు పదుల సంఖ్యలో ప్రమాదాలకు గురైన సంఘటనలు జరిగినట్టు స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే సదరు రోడ్డను శాశ్వత, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికుల కోరుతున్నారు.

ప్రధాన రోడ్డును అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ కమిషనర్

కానూరు ప్రధాన రోడ్డు, సూపర్‌విజ్ రోడ్డులోని గుంతలను పూడ్చి వర్షాకాలం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. కానూరులోని రోడ్ల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలు తయారు చేస్తున్నాం. నవతా రోడ్డులో ఆక్రమణలు తొలగింపునకు పోలీసుశాఖతో సమన్వయంతో కలిసి పనిచేస్తామని తాడిగడప మునిసిపల్ కమిషనరు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.



మురళీనగర్ వద్ద గోతులమయంగా మారిన రోడ్డు



ఆక్రమణలతో దారుణంగా మారిన నవతా రోడ్డు

నవతా రోడ్డులో ప్రయాణం దారుణం

కానూరు నవతా రోడ్డు వెంట ఆక్రమణలతో నిత్యం ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. కానూరును ఏలూరు రోడ్డు, ఆటోనగర్‌తో అనుసంధానించే ముఖ్యమైన నవతారోడ్డు ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. రోడ్డు వెంబడి ఉదయం, సాయంత్రం ఆక్రమణలతో వాహనదారులు తీవ్ర అవస్థల పాలవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న లారీ బాడీబిల్డింగ్ యూనిట్ల యజమానులు తమ లారీలను రోడ్డు చెంతనే ఉంచి తమ పనులు చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్డుకు కొంతమంది తమ కంపెనీల నుంచి వచ్చే చెత్తచెదారాన్ని అక్కడే డంపింగ్ చేస్తుండటంతో వర్షాలకు కుళ్లి రోడ్డుపైనే మురుగు ప్రవహించి దుర్వాసన వస్తోంది. రోడ్డువెంట ఆక్రమణలను నివారించాల్సిన పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో రోడ్డు త్వరలో కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఎన్టీఆర్ వద్ద పనిచేయడం మహాభాగ్యం

- శాసనసభలో ఎమ్మెల్యే గద్దె



అసెంబ్లీ వాయిస్

పటమట, జూలై 24: పేదలకు వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ నగరంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి చరిత్రలో నిలిచారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను కూడా ఎమ్మెల్యేగా పనిచేయడం మహాభాగ్యంగా భావిస్తున్నానన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వర్శిటీ ప్రారంభించి ఎన్టీఆర్ చరిత్రకారుడిగా నిలిస్తే, ఆయన పేరును తీసేసి చరిత్ర హీనుడిగా జగన్ చరిత్రలో నిలిచాడన్నారు. ఎన్టీఆర్ వర్శిటీ పేరుమార్పు బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో గద్దె మాట్లాడారు. నగరాన్ని విద్యాలవాడగా మార్చిన సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన సుమారు 57 ఎకరాల విలువైన భూములను ఎన్టీఆర్ ఆలోచనకు అనుగుణంగా ఆ విద్యాసంస్థల వారు ఉచితంగా ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక 2022లో వైఎస్ఆర్ వర్శిటీగా పేరును మార్చారని, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ పేరును మార్చాలని టీడీపీ ప్రభుత్వం ఎన్నడూ ఆలోచన చేయలేదన్నారు. తిరిగి ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయంగా పేరును మార్చాం కాబట్టి, దానిపై పోరాడిన వారిపై పెట్టిన కేసులను కొట్టివేసేందుకు ఆలోచనలు చేయాలని సీఎంను ఆయన కోరారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించండి

- మంత్రి అనగానికి లైసెన్స్ సర్వేయర్స్ వినతిపత్రం

ధర్నాచౌక్, జూలై 24: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ నేతలు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండలంలో అసిస్టెంట్ సర్వేయర్లుగా లైసెన్స్ సర్వేయర్లను నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని, తర్వాత అధికారంలోని వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని నిలుదల చేసి కొత్తగా గ్రామ సర్వేయర్లను నియమించి తమ నోట్లో మట్టి కొట్టిందని దీంతో తాము రోడ్డున పడ్డామని మంత్రికి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వారికి న్యాయం చేస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.మనోహర్, కిషోర్‌కుమార్, తాతారావు, అజయ్‌బాబు, రాంబాబు, శ్యామ్ లీలాకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో నిందితులకు మళ్లీ రిమాండ్

గన్నవరం, జూలై 24: టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో పోలీసులు తొలుత అరెస్టు చేసిన 15మందిని 14 రోజుల రిమాండ్ అనంతరం స్థానిక అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు బుధవారం హాజరు పరిచారు. జడ్జి శ్రీనివాస్ బాబు వారికి మళ్లీ 14 రోజులు రిమాండ్ విధించారు. పోలీసులు వారిని నూజివీడు సబ్ జైలుకు తరలించారు. అలాగే ఏ-1 18 నిందితుడు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కేంబూరి మోహన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అతడిని గన్నవరం సబ్ జైలుకు తరలించారు.



వైఎస్ ఏపీపీ రాష్ట్ర పదాధికారులు సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధ్యక్ష,కార్యదర్శులు

వైఎస్ ఏపీపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం

పటమట, జూలై 24: యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదాధికారుల సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక అధ్యక్షతన పటమట రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. శ్రీకాకుళం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శంకర్ ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా త్వరలో ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి యోగాసన పోటీలను నిర్వహించి, అక్టోబర్‌లో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర యోగాసన గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగాసన అసోసియేషన్ ద్వారా యోగా విద్యను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లడానికి ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు అనిల్‌కుమార్, డాక్టర్ వెంకటరమణ, దుర్గారావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

వైసీపీ దళిత నరమేథంపై విచారణ చేయాలి

ధర్నాచౌక్, జూలై 24: వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన దళిత నరమేధం, దళితుల భూముల కబ్జాలు, దాడులు, సహజ వనరుల దోపిడీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాలేటి మహేశ్వరరావు, పిల్లి సురేంద్ర బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రెస్‌క్లబ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ దళితుల హత్యలపై శ్వేతప్రతం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం మారగానే జగన్‌కు మానవ హక్కులు, చట్టం, న్యాయం, మాన, ప్రాణాలు గుర్తుకొచ్చాయని విమర్శించారు. దళితులకు శిరోముండనం చేసిన తోట త్రిమూర్తుల్ని ఎమ్మెల్సీ చేయలేదా, దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసిన అనంతబాబును కాపాడుతున్న దుర్మార్గుడు జగన్ కాదా అని మండిపడ్డారు. దళిత డాక్టర్ సుధాకర్ మరణానికి కారణం జగనేనన్నారు. పెద్దిరెడ్డిని ప్రశ్నించి హత్య కాబడిన దళితుడు ఓం ప్రతాప్ కుటుంబానికి ఏం సమాధానం చెబుతావన్నారు. అధికారం కోల్పోగానే రాజమహల్ నుంచి బయటకు వచ్చి ఇప్పుడే కొత్తగా ప్రపంచాన్ని చూస్తున్నట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గొల్లత వరప్రసాద్, వై.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ బస్సు ఢీకొని ఒకరి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూలై 24: కార్మాగారానికి వేతన కార్మికులను తరలించే బస్సు ఢీకొన్న ఘటనతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతి చెందడంతో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ మల్లవల్లి పారిశ్రామికవాడలోని మోహన్ స్పింటెక్స్ ఫ్యాక్టరీ ఎదుట మృతదేహంతో నిరసన చేపట్టిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. గొల్లపల్లి మాజీ ఉపసర్పంచ్ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లికి చెందిన నల్లగంగుల సుదర్శనరావు (49) తన పిల్లలను స్కూల్ తీసుకువెళ్లే క్రమంలో జూన్ 19న గొల్లపల్లి వద్ద మోహన్ స్పింటెక్స్‌కు చెందిన బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుదర్శనరావు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, మర్రిబంధం వద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడని బంధువులు తెలిపారు. మృతుడే ఆ కుటుంబానికి ఆధారమని, వారికి న్యాయం చేయాలని కోరుతూ బంధువులు మృతదేహాన్ని ఫ్యాక్టరీ మెయిన్‌గేటు వద్ద ఉంచి నిరసన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని మోహన్ స్పింటెక్స్ యాజమాన్యం హామీతో రాత్రి 8గంటలకు వారు నిరసన విరమించారు. ప్రమాదం జరిగిన వెంటనే నూజివీడు రూరల్ పోలీసస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు వీరవల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.

రాజధాని నిర్మాణానికి

విఘ్నాలు రాకుండా రక్షించాలి

- లేబర్‌కాలనీ మైదానంలో డూండీ గణేష్ విగ్రహ ఏర్పాట్లు
- భూమి పూజలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి



భూమిపూజలో పాల్గొన్న ఎంపీ శివనాథ్ సతీమణి జానకీలక్ష్మి

భవానీపురం, జూలై 24: రాష్ట్ర ప్రజలు ఆకాంక్ష అయిన రాజధాని అమరావతి నిర్మాణానికి ఈసారి ఎలాంటి విఘ్నాలు రాకుండా వినాయకుడు రక్షించాలని, రాజధాని నిర్మాణంపై ప్రజలందరిపై ఆ మహాగణపతి ఆశీస్సులుండాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకి లక్ష్మి ఆకాంక్షించారు. విద్యాధరపురం లేబర్‌కాలనీ మైదానంలో డూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 72 అడుగుల మహా గణపతి మట్టి విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ జరిగింది. జానకి లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని స్తంభం ఏర్పాటుకు పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ఎంపీ కేశినేని శివనాథ్ పార్లమెంట్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లడంతో తాను వచ్చినట్టు ఆమె వివరించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ డూండీ గణేశ్ సేవా సమితి పదేళ్ల నుంచి మట్టితో తయారు చేసిన భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన చోటే కరిగిపోయేలా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, డూండీ గణేష్ సేవా సమితి నిర్వాహకుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ ఖైరతాబాద్ తరహాలో భారీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నామని, ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డూండీ గణేష్ సేవా సమితి కార్యవర్గ సభ్యులు గడ్డం రవి, దర్శి సుబ్బారావు, ముక్తేశ్వరరావు, పేర్ల రవి, కె.దుర్గా శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది హజరత్తయ్య గుప్తా, టీడీపీ నేతలు చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, పొనుగుపాటి వెంకట సుబ్బయ్య, వై.రామయ్య, శివశర్మ పాల్గొన్నారు

కన్ను పడిందంటే ఇల్లు గుల్లే!

- తాళం వేసిన ఇళ్లే వాడి టార్గెట్
- అంతరాష్ట్ర దొంగను పట్టుకున్న కొత్తపేట పోలీసులు
- రూ.10.78 లక్షల విలువైన బంగారం, వెండి, రూ.1.27లక్షల నగదు స్వాధీనం



కేసు వివరాలు తెలియజేస్తున్న ఏసీపీ మురళీకృష్ణ, సీఐ గణేష్

చిట్టినగర్, జూలై 24: వాడి కన్ను పడిందంటే ఆ ఇల్లు గుల్లే.! పగలు వంటి పనిచేసి రాత్రి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దోచుకుంటాడు. ఇటీవల అంబాపురం పీ.నైనవరంలో జరిగిన చోరీలో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. దర్యాప్తులో అసలు గుట్టు బయటపడింది. అంబాపురం ఒక్కటే కాదు పలు స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన వాంబేకాలనీకి చెందిన ములకల నిరంజన్ (32) ఆలియాస్ చందు, అంతరాష్ట్ర దొంగగా పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి రూ.10.78లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, రూ.1.27లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో పశ్చిమ జోన్ ఏసీపీ మురళీకృష్ణ ఆ వివరాలను తెలిపారు. ఈ నెల 21న అంబాపురానికి చెందిన అల్లంపల్లి మణికంఠ సమీపంలోని తన తమ్ముడైన అనిల్ కుమార్ ఇంటికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. మరుసటి రోజు ఇంటికొచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని బంగారు నగలు, వెండి వస్తువులు, రూ.లక్షా 27 నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. ఈ దర్యాప్తులో కొత్తపేటతోపాటు ఏలూరు వన్‌టౌన్, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు చేసినట్టు తెలింది. నిందితుడి నుంచి బంగారు (148 గ్రాములు), వెండి వస్తువులు (613 గ్రాముల)తోపాటు రూ.1.27 లక్షల నగదు, సెల్‌ఫోన్స్, ఎస్.ఎల్.ఆర్ కెమెరా స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ తెలిపారు. 10ఏళ్లుగా నగరం, ఏలూరు పరిసర ప్రాంతాల్లో వివిధ పోలీస్‌స్టేషన్లలో 60పైగా దొంగతనాలు చేసినట్టు పోలీసులు తెలిపారు. కొత్తపేట సీఐ టీ.గణేష్, ఎస్ఐ. రాజనరేంద్ర, కానిస్టేబుల్స్ చక్రవర్తి పాల్గొన్నారు.

దుర్గగుడిలో వినాయకుడికి అర్చన



వన్‌టౌన్,జూలై 24: సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో బు ధవారం వినాయకుడికి అర్చకులు విశేష పూజాదికాలను నిర్వహించారు. అనంతరం దూర్వాయుగ్మం (గ రిక)తో పూజ నిర్వహించారు అనంతరం మూలమంత్ర జపం చేసి తర్పణ చేశారు. విఘ్నాలు తొలగించి సుఖ సంతోషాలతో ఉండేలా ప్రజలను దీవించాలని కోరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై ధర్మపథం వే దికపై ఖతార్‌లోని ఆంధ్రకళావేదిక నిర్వాహకుడు ఎ స్ విక్రమ్ ఆధ్వర్యంలోని బృందం భరతనాట్య ప్రదర్శన చేసింది. పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యం చేసి ఆహుతులను నాట్య బృందం అలరించింది.

పారిశ్రామికాభివృద్ధికి ఊతం: రాజమణి

లబ్బీపేట, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో పారిశ్రామిక రంగాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం శుభపరిణామమని దళిత్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.రాజమణి పేర్కొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లను కేటాయించడం వల్ల రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెంచడంతో చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయింపు, రైల్వేకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం శుభ పరిణామమన్నారు.

కౌలు రైతుల ప్రస్తావన లేని కేంద్ర బడ్జెట్

పాయకాపురం, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కౌలు రైతులకు మొండి చేయి చూపిందని, కౌలురైతులకు పంట రుణాల మంజూరులోను, తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీ కల్పించడం వంటి విషయాలపై ప్రస్తావనే లేదని రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు ఏ కాటమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరుతున్నా బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకపోవడం దుర్మార్గమన్నారు. సాగులో ఉన్న కౌలు రైతుల దామాషా ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది పెట్టుబడి సాయం కింద ఇచ్చే రూ.60వేల కోట్లలో కౌలు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. వడ్డీ రాయితీ కింద ప్రతి ఏడాది ఖర్చు చేసే నిధుల్లోనూ కౌలు రైతులకు పైసా దక్కడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతనంగా ప్రవేశపెట్టిన నీతి అయోగ్య చేసిన కౌలుచట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పంట రుణాలు, పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పరిహారాలు, వ్యవసాయ పరికరాలు అందించేలా సమగ్ర విధానాన్ని తేవాలని కోరారు.

నిందితులు, వారి కుటుంబాల గ్రామ బహిష్కరణ!

- హత్యతో చెడ్డపేరు తెచ్చారంటూ గ్రామస్థుల ఆగ్రహం
- శ్రీసత్యసాయి జిల్లా వెల్దుర్తి గ్రామంలో ఘటన



గ్రామస్థులు నిప్పు పెట్టడంతో దహనమైన నిందితుల దుకాణం

చెన్నేకొత్తపల్లి, జూలై 24: హత్య చేసి ఊరికి చెడ్డపేరు తెచ్చారంటూ ఆగ్రహించిన జనం.. నిందితులను, వారి కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారు. నిందితుల దుకాణాన్ని దహనం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తికి చెందిన ఆటో డ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ ఈ నెల 20న ధర్మవరం మండలం సీసీ కొత్తకోట వద్ద దారుణ హత్యకు గురయ్యారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆస్తి కోసం బంధువులే ఆయనను హత్య చేసినట్లు గుర్తించారు. దీంతో సూర్యనారాయణ బావమరిది మల్లికార్జున, ఆయన కుమారుడు రాము, అల్లుడు రాజు, బంధువు లక్ష్మీనారాయణలను ఈ నెల 22న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ నేపథ్యంలో నిందితులు గ్రామంలో ఉండటానికి వీల్లేదంటూ గ్రామస్థులంతా ఏకతాటిపైకి వచ్చి తీర్మానించారు. హత్య చేసి గ్రామానికి చెడ్డపేరు తెచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద ఉన్న నిందితుల దుకాణాన్ని ధ్వంసం చేసి తగలబెట్టారు. నిందితుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబసభ్యులను గ్రామం నుంచి బయటకు పంపించేశారు. ఇకపై గ్రామంలోకి రానివ్వబోమని తేల్చి చెప్పారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు గ్రామానికి వచ్చి గ్రామస్థులతో చర్చించారు. సంయమనం పాటించాలని సూచించారు. హత్య కేసు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

నిరాశ కలిగించిన కేంద్ర బడ్జెట్: ఏఐవైఎఫ్

ధర్నాచౌక్, జూలై 24: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ సామాన్య ప్రజలకు నిరాశ కలిగించిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. స్థానిక దాసరిభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వదేశీ, విదేశీ సంస్థల కోసం కార్పొరేట్ పన్నులు భారీగా తగ్గించారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎంఎస్‌పీ చట్టపరమైన హామీ నేటికీ కలగానే మిగిలిపోయిందని వాపోయారు. రక్షణ రంగానికి రూ. 4,54,773 కోట్లు కేటాయించగా వ్యవసాయ రంగానికి రూ.1,51,851 కోట్లు, విద్యారంగానికి రూ.1,25,638 కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. 500 పరిశ్రమల్లో 4కోట్ల ఉద్యోగాలనడం నిరుద్యోగ యువతను మోసగించడమేనన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు సృష్టి మోదీ హామీ ఇప్పటికి అబద్ధాల మాటగానే మిగిలిందన్నారు. జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, శిగంశెట్టి మోహన్ ప్రసాద్, హరీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై వైసీపీ నాయకుడి లైంగిక దాడి

- మూడ్రోజుల తర్వాత వెలుగులోకి, పోక్సో కేసు నమోదు

టంగుటూరు, ఆగస్టు 23: బాలికపై వైసీపీ నాయకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా టంగుటూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు.. పదో తరగతి చదువుతున్న బాలిక తరచూ తన బంధువుల ఇంటికి వెళ్తుంటుంది. అదే మార్గంలో నివాసం ఉండే వాణీనగర్‌కు చెందిన వైసీపీ నేత ఇత్తడి విజయ్‌కుమార్ ఆమెపై కన్నేశాడు. మూడు రోజుల క్రితం ఆ బాలిక బంధువుల ఇంటికి వెళ్తుండగా మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు విజయ్‌కుమార్‌ను పట్టుకొని దేహశుద్ధి చేశారు. అక్కడి నుంచి బాలికను పంపించేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు అదేరోజు బాధితురాలి తల్లిదండ్రులను పిలిచి ప్రశ్నించగా అత్యాచారం విషయాన్ని ధ్రువీకరించలేదు. అయితే బాలిక అనారోగ్యానికి గురవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోక్సో కేసు నమోదు చేశారు.

పాలిటెక్నిక్ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్టు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గుమ్మల గణేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఖాళీ సీట్ల జాబితాను ప్రదర్శిస్తారని, 31 నుంచి అడ్మిషన్ల భర్తీ ప్రారంభమవుతుందన్నారు.



సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి మొక్కలను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

సీడ్ యాక్సెస్ రోడ్డుకు పూర్వవైభవం

విజయవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి గ్రాండ్ ఎంట్రన్స్ సీడ్ యాక్సెస్ రోడ్డుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. బుధవారం సీడ్ యాక్సెస్ రోడ్డును పరిశీలించిన ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి.. గ్రీనరీ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి 15 మీటర్ల మేర పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన బఫర్ జోన్‌ను ఆమె పరిశీలించారు.

జగన్ బెయిళ్లను రద్దు చేయండి

- బెజవాడలో టీడీపీ నేత బుద్దా వెంకన్న ర్యాలీ



విజయవాడలో ర్యాలీ చేస్తున్న బుద్దా వెంకన్న, టీడీపీ శ్రేణులు

విజయవాడ(వన్‌టౌన్), జూలై 24: మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌కు వివిధ దశల్లో ఇచ్చిన బెయిళ్లను రద్దు చేసేలా చూడాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విజయవాడలో ర్యాలీ నిర్వహించారు. మినీవ్యాన్‌పై చంద్రబాబు, మహాకాళి కటౌట్‌ను ర్యాలీలో ప్రదర్శించారు. వన్‌టౌన్‌లోని తన నివాసం నుంచి దుర్గగుడి ఘాట్‌రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ కొలువైన కామధేను అమ్మవారికి మొక్కుకున్నారు.

వైవీ సుబ్బారెడ్డికి 4 వారాలు 2+2 భద్రత

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి 2+2 భద్రతను నాలుగువారాల పాటు కొనసాగించాలని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. నోటీసులివ్వకుండా తనకున్న భద్రతను కుదించడాన్ని సవాల్ చేస్తూ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. కాగా, సుబ్బారెడ్డికి ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ నిర్ధారించిందని, అందుకే భద్రతను 1+1కి తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పై ఆదేశాలు జారీ చేశారు. విచారణను 3 వారాలకు వాయిదా వేశారు.

పొన్నవోలు భద్రతపై రివ్యూ కమిటీ నివేదిక ఇవ్వండి

మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ)) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి భద్రత విషయంలో సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదికను కోర్టు ముందుంచాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆయనకు 2+2 భద్రత కొనసాగించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఆదేశాలిచ్చారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రాణహాని ఉందనేందుకు పిటిషనర్ ఎలాంటి వివరాలు సమర్పించలేదని, ఆయనకు ప్రాణహాని లేదని రివ్యూ కమిటీ నిర్ధారించిందని.. దాని నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టు ముందుంచుతామని తెలిపారు.

డబులింజన్ సర్కార్‌తోనే ఏపీ ప్రగతి: యామిని

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో ముందుకెళ్లాలంటే డబులింజన్‌తోనే సాధ్యమన్న ఎన్డీఏ నేతల వ్యాఖ్యలు నరేంద్ర మోదీ బడ్జెట్‌తో నిజమయ్యాయని రాష్ట్ర బీజేపీ నాయకురాలు సాధినేని యామినీ శర్మ అన్నారు. మహిళలు, బాలికల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో మూడు లక్షల కోట్లు కేటాయించిన ప్రధాని మహిళా పక్షపాతి అని మహిళా మోర్చా నాయకురాలు చాగర్లమూడి గాయత్రి అన్నారు.

'మదనపల్లి' సూత్రధారుల్ని శిక్షించాలి: రమేశ్

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో మంట పెట్టిన వారెవరైనా ఉపేక్షించకుండా అసలైన కుట్రదారులు, సూత్రధారుల్ని ప్రభుత్వం చట్టపరంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు.

'30 ఏళ్లు' అంటూ కలలు..: సీపీఐ రామకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 24: రాష్ట్రంలో మద్యనిషేధం చేస్తామని చెప్పి అదే మద్యంపై ఏకంగా రూ.46 వేల కోట్లు అప్పు తీసుకొచ్చిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. బుధవారం కర్నూలులో సీపీఐ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ 30 సంవత్సరాలు అధికారంలో ఉంటానని కలలుగన్నాడని, ఆ ధీమాతోనే అనుమతులు లేకుండా ప్యాలెస్‌లు నిర్మించాడని చెప్పారు.

ఆయకట్టు వివరాలు సేకరించాలి: పీడీఎఫ్

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టు వివరాలను మండలాల వారీగా లెక్కతీయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం జీవో 72 ద్వారా ఉన్నత విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసిందని, దాన్ని పునరుద్ధరించాలని మండలిలో కోరినట్లు చెప్పారు.

ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ ఐడీతో గాలం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు 22 లక్షలు టోకరా

ఎండాడ (విశాఖపట్నం), జూలై 24: ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి ఓ కిలాడీ లేడీ ఏకంగా రూ.22 లక్షలు దోచేసింది. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియ అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసింది. విశాఖ నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుంది. అందమైన అమ్మాయిల ఫొటో పంపి చాటింగ్ చేసింది. డబ్బులు అత్యవసరమంటూ అతని నుంచి రూ.22 లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకుంది. ఆ తర్వాత ఆమె ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోవడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వన్యప్రాణుల దాడిలో నష్ట పరిహారం పెంపు

- మనుషుల మరణానికి ఇకపై రూ.10లక్షలు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పులులు, ఇతర వన్యప్రాణుల దాడిలో మనుషులు, పశువులు మరణించినా, ఆస్తులు, పంట నష్టం జరిగినా ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు పరిహారం చెల్లింపుల సవరణ ఉత్తర్వులను బుధవారం జారీ చేసింది. వన్యమృగాల దాడిలో మనిషి చనిపోతే.. ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారు. గాయపడితే ఇచ్చే రూ.75వేల నుంచి రూ.2లక్షలకు పెంచారు. స్వల్పగాయాలకు గతంలో వైద్య ఖర్చులు ఇవ్వగా, ఇక నుంచి వాస్తవ ఖర్చు లేదా రూ.20వేలు చెల్లించనున్నారు.

ర్యాంకింగ్ ద్వారానే జిల్లాలకు నిధులు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాలకు డెల్టా ర్యాంకింగ్ ఆధారంగానే నిధుల కేటాయింపు ఉంటుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు గణాంకాలు, కార్యక్రమాల అమలు, సాంస్కృతికశాఖల మంత్రి రావ్ ఇంద్రజిత్‌సింగ్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నీతిఆయోగ్ ద్వారా అదనపు నిధులు లభించవని చెప్పారు. ఏపీకి కేంద్రం బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించిందని తెలిపారు.

అమరావతి నిర్మాణాలపై నిపుణుల అధ్యయనం



- సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాలకు గతంలో రికార్డు స్థాయిలో కాంక్రీటు పునాది వేశాం
- ఐదేళ్లుగా నీటిలో నానుతున్నా అవి చెక్కుచెదరలేదు
- పిల్లర్ల నాణ్యత తనిఖీ బాధ్యతలు చెన్నై ఐఐటీకి
- వివిధ నివాస భవనాల పటిష్ఠతను పరీక్షించనున్న హైదరాబాద్ ఐఐటీ నిపుణులు
- ఈ నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ
- నిర్మాణాల కోసం మళ్లీ కొత్తగా టెండర్లు: మంత్రి నారాయణ



ఇది చేపల చెరువో... నదో కాదు. నీటికి ఆవలి పక్కన కనిపిస్తున్నవి అమరావతి రాజధానిలో సచివాలయ టవర్ల నిర్మాణానికి వేసిన పునాదులు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొన్నేళ్లుగా ఇలా నీళ్లు నిలిచిపోయాయి. దాంతో స్థానికులు ఈ నీటిలో వలలు వేసి చేపలు పడుతున్నారు. (ఇన్‌సెట్‌లో) ఈ నీటిలో పట్టిన చేపలు ఇవే.

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గతంలో నిర్మించిన నిర్మాణాల పటిష్ఠత ప్రస్తుతం ఎలా ఉందన్న అంశంపై ఐఐటీలకు చెందిన నిపుణులతో అధ్యయనం చేయిస్తున్నామని మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాల కోసం రికార్డు స్థాయిలో కాంక్రీట్ పునాది వేశాం. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఈ ఐదేళ్లూ ఆ పునాదులు నీళ్లలో నానుతూ ఉండిపోయాయి. మేం చేయించిన అధ్యయనం ప్రకారం కాంక్రీట్ పునాది చెక్కుచెదరలేదు. కానీ దానిపైన వేసిన పిల్లర్ల నాణ్యత ఎలా ఉందన్నది మరోసారి తనిఖీ చేయించాలని భావించాం. ఆ పనిని చెన్నై ఐఐటీకి అప్పగించాం. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో వివిధ రకాల నివాస భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ ఐదేళ్లూ వాటిని పట్టించుకొన్న నాథుడు లేడు. వాటి పటిష్ఠతను పరీక్షించే పనిని హైదరాబాద్ ఐఐటీ నిపుణులకు అప్పగించాం. వారి నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ చేపడతాం' అని మంత్రి వివరించారు. రాజధాని నిర్మాణాల కోసం గత టీడీపీ ప్రభుత్వం టెండర్ల ద్వారా అప్పగించిన పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయడానికి మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించామని చెప్పారు. రాజధాని లోపలకు రాకపోకలకు మొత్తం మూడు ప్రధాన రహదారులు నిర్మించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. 'కృష్ణానది కరకట్ట పక్కన నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు మరికొంత భాగం పూర్తి చేయాల్సి ఉంది. రైతుల నుంచి భూమి సేకరించాల్సి ఉంది. దీనికి కొంత సమయం పడుతుంది. దీనితోపాటు మరో రెండు రోడ్లకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ రెండు రోడ్లు మంగళగిరి సమీపంలోని ఎయిమ్స్ ఆస్పత్రికి రెండువైపులా వస్తాయి. అక్కడనుంచి చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారితో అనుసంధానం అవుతాయి. సీడ్ యాక్సెస్ రహదారి మాదిరిగా ఇవి కూడా విశాలమైన రోడ్లుగా వస్తాయి. దీనికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం' అని మంత్రి నారాయణ తెలిపారు.

రాజధాని పనులపై సాంకేతిక కమిటీ

- పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ చైర్మన్‌గా ఏడుగురు సభ్యులతో ఏర్పాటు
- ఆగిన పనులు ఎక్కడినుంచి ప్రారంభించాలన్నదానిపై అధ్యయనం
- 9 అంశాలపై నెల రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం

అమరావతి/విజయవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాజధానిలో నిలిచిపోయిన పనులపై సాంకేతిక కమిటీని ఏర్పాటుచేస్తూ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నిలిచిపోయిన పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ఈ కమిటీ సిఫారసులు చేయనుంది. అమరావతి కేపిటల్ సిటీలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సూచనలు చేస్తుంది. పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ చైర్మన్‌గా మొత్తం ఏడుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఏపీసీఆర్‌డీఏలో పనులకు సీఈ రేడీఏ సీఈ కన్వీనర్ గాను, ఏడీసీఎల్ పనులకు కన్వీనర్‌గా ఏడీసీఎల్ సీఈ ఉంటారు. కమిటీలో సభ్యులుగా ఆర్అండ్‌బీ, వీసీఎం, ఏపీసీపీడీసీఎల్, ఏపీపీఆర్డీఏ, ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక ప్రతినిధి ఉంటారు. మొత్తం 9 అంశాలపై నెలరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని నిర్మాణంలో పనుల ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసి, 2019 మే నుంచి నిలిచిపోయిన వివిధ భవనాల పటిష్ఠతను అంచనా వేయనుంది. దీనికోసం గుర్తింపు పొందిన సాంకేతిక నిపుణుల నుంచి సలహాలు తీసుకోనున్నారు. రాజధానిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా కోసం వేసిన పైప్‌లైన్లు, విద్యుత్, కమ్యూనికేషన్ పనులకు జరిగిన నష్టాన్ని కమిటీ అంచనా వేయనుంది. రాజధానిలోని పలు ప్రాంతాల్లో మిగిలి ఉన్న మెటీరియల్ నాణ్యతను పరిశీలించి, పైప్‌లు, ఇనుము, ఇతర మెటీరియల్ సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. అవసరమైన చోట కొత్తగా పరికరాలు అమర్చడంపై పలు సూచనలు చేస్తుంది. వివిధ గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థల నుంచి వచ్చే విజ్ఞప్తులను అధ్యయనం చేసి సిఫారసులు చేయనుంది. గురువారం నుంచే సాంకేతిక కమిటీ రాజధాని నిర్మాణ పనుల పరిస్థితిని అధ్యయనం చేయనుంది. రాజధాని ప్రాంతంలో భవనాల పటిష్ఠతపై చెన్నై ఐఐటీ, వరంగల్ ఎన్ఐటీ వంటి సంస్థలతో అధ్యయనం చేయించాలని సీఆర్‌డీఏ ఇప్పటికే నిర్ణయించింది. వీటి సూచనలను కూడా కమిటీ పరిగణనలోకి తీసుకుని సీఆర్‌డీఏకు, రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించనుంది.

అసెంబ్లీ ఎగ్గొట్టడానికే
జగన్ ఢిల్లీ ధర్నా

- హోం మంత్రి అనిత



అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'ఏపీలో సినిమా అయిపోయి, ఉనికి కోసం జగన్ ఢిల్లీలో ధర్నా చేస్తున్నారు. ఏపీలో ధర్నా చేస్తే జనం తంతారని అక్కడ డ్రామాలాడుతున్నారు' అని హోంమంత్రి అనిత మండిపడ్డారు. బుధవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ 'వినుకొండలో జరిగిన హత్య రాజకీయ ప్రేరేపితం కాదని షర్మిల చెప్పినా.. జగన్ అసెంబ్లీ ఎగ్గొట్టడానికి ఢిల్లీలో ధర్నా చేసి, నెలన్నర కూటమి పాలనలో అరాచకాలు జరిగినట్లు ఫొటోఎగ్జిబిషన్ పెట్టారు. అదంతా ఫేక్ ప్రచారం. కూటమి వచ్చాక 36హత్యలు జరిగాయంటాడు. దమ్ముంటే ఆ చనిపోయిన 36మంది వివరాలతో నాతో చర్చకు రావాలి. ప్రభుత్వంపై తప్పుడు చేస్తే వారిపై తప్పకుండా చర్యలుంటాయి' అని అనిత వ్యాఖ్యానించారు.

స్వచ్ఛమైన ఉత్పత్తుల
ఎగుమతికి కృషి: అచ్చెన్న

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ప్రకృతి సేద్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుని, స్వచ్ఛమైన ఉత్పత్తుల ఎగుమతులు వృద్ధి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వడం కూటమి ప్రభుత్వ విజయానికి సంకేతమని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

జగన్ గురించి మాట్లాడడం వేస్ట్: మంత్రి సవిత

అమరావతి, జూలై 24(ఆంధ్రజ్యోతి): జగన్ తన ఉనికిని, తన పార్టీని కాపాడుకోవడం కోసమే ఢిల్లీలో ధర్నా చేస్తున్నారని మంత్రి సవిత అన్నారు. ప్రతిపక్ష హోదాకు కూడా పనికిరాడని జనం పక్కన పెట్టిన జగన్ గురించి మాట్లాడి మా సమయాన్ని వృథా చేసుకోమని అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండలో రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదంలో ఓ రౌడీ ప్రాణాలు కోల్పోతే.. టీడీపీపై నింద లేయం సిగ్గుచేటన్నారు. జగన్ శవరాజకీయాలు చేస్తున్నాడని ఢిల్లీ వెళ్లి ధర్నా చేయడానికి సిగ్గుండాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మండిపడ్డారు. అధికారమదం తలకెక్కి పాలించిన జగన్‌రెడ్డిని జనం ఛీ కొట్టినా ఇంకా సిగ్గురాలేదని టీడీపీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మండిపడ్డారు.

అప్పుడే అంత ఏడుపా?: జేసీ

అనంతపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర కూడా కాలేదని, అప్పుడే జగన్‌కు అంత ఏడుపెందుకు అని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఐదేళ్లు సాగించిన అరాచక పాలన మరిచావా జగన్ అంటూ చురక అంటించారు. 'మీరు అధికారంలో ఉన్నప్పుడు తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి నా ఇంట్లోకి మారణాయుధాలతో చొరబడిన విషయం గుర్తుకు రాలేదా జగన్‌రెడ్డీ?' అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చంద్రబాబును క్షమాపణ అడుక్కోవాలని సూచించారు.

'అనంత'లో ఈడీ సోదాలు

- బీజేపీ మహిళా మోర్చా నేత సుమతి భర్త ఇంట్లో అధికారుల తనిఖీలు
- కర్ణాటక వాల్మీకి కార్పొరేషన్ నిధుల మళ్లింపు కేసులో దర్యాప్తు
- ఆ అక్రమాల్లో శ్రీనివాసులు పాత్రపై అనుమానాలు
- పలు పత్రాలు, రికార్డుల పరిశీలన.. ఇల్లు సీజ్
- తక్షణమే గౌహతిలో విచారణకు రావాలని నోటీసులు
- తమ అనుమతి లేకుండా తలుపులు తీయొద్దని ఆదేశం

అనంతపురం క్రైం, జూలై 24: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమతి సురతాని భర్త శ్రీనివాసులు ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఆయన అనంతపురం మారుతి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకి కార్పొరేషన్ నిధులను దారి మళ్లించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఇక్కడకు వచ్చారు. కార్పొరేషన్ నుంచి సుమారు రూ.187 కోట్లు పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. ఆ నిధులను కర్ణాటకలోని వివిధ జిల్లాలు, హైదరాబాద్, ఏపీలోని పలు బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే కర్ణాటక మాజీ మంత్రి నాగేంద్రతో పాటు 16 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని ఓ కో-ఆపరేటివ్ బ్యాంకు నుంచి 270 ఖాతాలకు ఈ డబ్బు బదిలీ అయినట్లు తేలింది. ఇందులో శ్రీనివాసులు పాత్ర ఉన్నట్లు భావిస్తున్నారు. బుధవారం ఉదయం బెంగుళూరు నుంచి రెండు వాహనాల్లో వచ్చిన పది మంది ఈడీ అధికారుల బృందం ఆ ఇంట్లో సోదాలు నిర్వహించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంట్లో పలు పత్రాలు, రికార్డులు పరిశీలించినట్లు తెలిసింది. అనంతరం ఇంటికి తాళం వేసి సీజ్ చేశారు. గౌహతిలోని ఈడీ జోనల్ కార్యాలయం-1లో తక్షణమే విచారణకు హాజరు కావాలని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ రామ్ పేరిట నోటీసులు అతికించారు. తమ అనుమతి లేకుండా ఇంటి తలుపులు తీయొద్దని ఆదేశించారు.

ఎవరీ సుమతి...?

అనంతపురం నగరంలో ఈడీ సోదాలు కలకలం రేపాయి. సుమతి సురతానిపై అనేక ఆరోపణలున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ బీజేపీ నేతతో కలిసి టెక్స్‌టైల్ మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పలు అక్రమాలకు పాల్పడ్డారని ప్రచారం ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయకుండానే ఉన్నట్లు చూపించి నిధులు స్వాహా చేయడంలో వీరిది అందెవేసిన చేయని అంటున్నారు. రూ.కోటికి పైగా లబ్ధి చేకూరే పథకాలున్న పరిశ్రమలను మంజూరు చేయించుకోవడం, వాటికి రుణాలు తీసుకోవడం, రాయితీలు పొందడం, ఇన్సూరెన్స్ కట్టడం, నష్టం జరిగినట్లు చూపించి క్లెయిమ్ చేసుకోవడం.. ఇలా పెద్ద మొత్తంలోనే లబ్ధిపొందినట్లు తెలిసింది. కేంద్రంలోని పెద్దల పక్కన నిలబడి ఫొటోలు దిగి, వాటిని చూపించి పనులు చేయించుకున్నట్లు సమాచారం. అదే క్రమంలో బ్లాక్‌మెయిలింగ్‌కూ పాల్పడినట్లు తెలిసింది. పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాలు ఏర్పాటుచేసి.. కీలకమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల స్థానంలో తమ వారిని నియమించుకుని.. యాజమాన్యాల నుంచి డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

టీడీఆర్ బాండ్లలో భారీ స్కాం

- విశాఖ, తణుకు, గుంటూరు, తిరుపతిలో అక్రమాలు
- రూ.వందల కోట్లలో అవినీతి: మంత్రి నారాయణ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా టీడీఆర్ బాండ్ల జారీలో పెద్ద స్కాం జరిగిందని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సచివాలయంలో పట్టణ ప్రణాళికా విభాగంలోని అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాండ్లలో అక్రమాలు చూస్తే, ఇలాంటి స్కాంలు కూడా చేస్తారా అనిపించిందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో గత ఐదేళ్లలో పరిస్థితి దారుణంగా ఉందని చెప్పారు. విశాఖపట్నం, తణుకు, గుంటూరు, తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో భారీగా అక్రమాలు జరిగాయని మంత్రి చెప్పారు. తణుకులో 29 బాండ్లను జారీచేస్తే అన్నీ అక్రమమేనని తేలిందన్నారు. ఈ అక్రమాలపై వేసిన అధికారుల కమిటీ ప్రాథమిక నివేదిక అందిందని, దీనిపై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తామని చెప్పారు. బాండ్ల జారీలో ఎకరాల ప్రకారం విలువ కట్టాల్సి ఉన్నప్పటికీ చదరపు గజాల ప్రకారం భూమి విలువ కట్టి అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఒక చదరపు గజానికి రూ.4500 ఉండగా రూ.22 వేలుగా లెక్క కట్టినట్లు చెప్పారన్నారు. 1:200 ఇవ్వడానికి బదులు 1:400గా ఇచ్చారన్నారు. స్థలం కోల్పోతున్న సమీపంలో ధర కంటే ఎక్కడో 1.40 కి.మీ దూరంలోని భూమి విలువను పరిగణనలోకి తీసుకుని బాండ్లు జారీచేయడం పెద్ద స్కాం అన్నారు. తణుకులో బాండ్ల జారీలో అక్రమాలకు పాల్పడ్డ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు. మొత్తంగా రూ.వందల కోట్లు అక్రమాలు జరిగాయని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

రాజధాని రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం..

సీఎం చంద్రబాబు అడగ్గానే భూములిచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, త్వరలోనే కౌలు విడుదల చేస్తామని చెప్పారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్ల నిధులతో అమరావతి వేగంగా ముందుకెళ్తుందన్నారు. అమరావతిలో నిర్మాణాల పటిష్ఠత అధ్యయనానికి ఐఐటీ చెన్నై, ఐఐటీ హైదరాబాద్ సంస్థలను ఉపయోగించుకున్నట్లు మంత్రి చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగులకు
పాత పద్ధతిలోనే వైద్య సేవలు

- ప్రభుత్వానికి పలిశెట్టి దామోదరరావు విజ్ఞప్తి

తణుకు, జూలై 24: ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీనం పేరుతో ఆర్టీసీ ఉద్యోగులకు దశాబ్దాలుగా ఉన్న అలవెలెన్సులను, ఇన్సెంటివ్ స్కీమ్‌లను గత ప్రభుత్వం ఏకపక్షంగా తొలగించిందన్నారు. 2019లో ఉద్యోగ భద్రతకు సంబంధించి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ నెం.1-2019ని అమలు చేయకుండా కొందరు అధికారులు ఉద్యోగులపై తీవ్ర క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారని దామోదరరావు తెలిపారు. ఈ విధానాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. వీటిని కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. కండక్టర్లు, డ్రైవర్లు, తదితర సిబ్బంది పోస్టులకు వేల సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయని.. వాటిని భర్తీ చేసి ఆర్టీసీని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్న నమ్మకం ఆర్టీసీ ఉద్యోగుల్లో ఉందన్నారు.

అప్పన్న సన్నిధిలో అమరావతి రైతులు

సింహాచలం, జూలై 24: సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామిని అమరావతి ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది రైతులు బుధవారం దర్శించుకున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు విజయం సాధించి, సీఎం కావాలని మొక్కుకున్నామని, అది తీర్చుకునేందుకు స్వామివారిని దర్శించుకున్నట్టు వారు తెలిపారు. గురువారం అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నారు.

ప్రేమను కాదన్నందుకు..!

- ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ఆమె చిరునామాకు 100 ఆర్డర్లు

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను నిరాకరించిందన్న కారణంగా ఓ బాలికపై పగపట్టాడో బాలుడు. రకరకాల పేర్లతో వివిధ యాప్‌ల ద్వారా ఆ బాలిక ఇంటికి సుమారు వంద ఆర్డర్లు పంపించాడు. ఆర్డరుకు 'క్యాష్ ఆన్ డెలివరీ' అని పెట్టడంతో ఆ వ్యయం భరించలేని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం బయల్పడింది. దీంతో ఆ బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. చెన్నైలో జరిగిన ఈ ఘటన వివరాలిలా వున్నాయి... స్థానిక పెరియమేట్‌లో ట్యూషన్‌కు వెళుతున్న కళాశాల విద్యార్థినికి, 17 ఏళ్ల బాలుడికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇటీవల ఈ విషయం ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియడంతో ఆమె ఆ బాలుడికి దూరంగా ఉంటుంది. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలుడు ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు ఆసుపత్రిలో చేర్పడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. కానీ తనకు దూరంగా వుంటున్న విద్యార్థినిపై పగ పెంచుకున్నాడు. ఇందులో భాగంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీ, జుమాటో తదితర యాప్‌ల ద్వారా పలు ఆర్డర్లు చేసి, విద్యార్థిని ఇంటి చిరునామా ఇచ్చాడు. ఆ యాప్‌లో 'క్యాష్ ఆన్ డెలివరీ' అని పెట్టాడు. దీంతో, ఆర్డరు చేసిన వస్తువులతో డెలివరీ బాయ్స్ ఆమె ఇంటికి వెళ్లగా, తాను ఆర్డరు చేయలేదని ఆ బాలిక చెప్పడం, డెలివరీ బాయ్స్ వాదనకు దిగడం పరిపాటి అయింది. అంతేగాక ఆమె పేరుతో కాల్ టాక్సీలను కూడా బుక్ చేసి పంపించాడు. ఈ టార్చర్ తట్టుకోలేని బాలిక తండ్రి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అతను మైనర్ కావడంతో బాలుర ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కోర్టు సూచనలతో బాలుడికి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి, ఇంటికి పంపించారు.

నీట్‌ను వ్యతిరేకిస్తూ బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా, జూలై 24: నీట్‌ను వ్యతిరేకిస్తూ మరో రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ ఈ మేరకు తీర్మానం చేయగా.. తాజాగా పశ్చిమ బెంగాల్ ఆ జాబితాలో చేరింది. నీట్ స్థానంలో మునపటిలా రాష్ట్రాలే పరీక్ష నిర్వహించుకునే విధానాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం పశ్చిమబెంగాల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ తీర్మానం సందర్భంగా జరిగిన చర్చలో విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసు మాట్లాడుతూ.. కేంద్రం నీట్ ప్రతిపాదన చేసినప్పుడే తాము వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీ కోర్టు సమన్లు

న్యూఢిల్లీ, జూలై 24: పరువు నష్టం కేసులో ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. ముంబై బీజేపీ అధికార ప్రతినిధి సురేశ్ ఖరంషీ నఖువా ఈ పిటిషన్ దాఖలు చేశారు. జూలై 7న ధ్రువ్ రాఠీ తన యూట్యూబ్ చానెల్‌లో 'గోడీ యూట్యూబర్లకు నా జవాబు' పేరిట ఓ వీడియో పోస్టు చేశాడు. హింసావాదులు, దూషణలతో ట్రోల్ చేసే అంకిత్ జైన్, సురేశ్ నఖువా, తాజిందర్ బగ్గా వంటి వారిని కూడా ప్రధాని మోదీ తన అధికారిక నివాసంలో కలిశారని అందులో పేర్కొన్నాడు. దీనిపై సురేశ్ నఖువా కోర్టును ఆశ్రయించారు.

ప్రతీకారం తీర్చుకునేలా పాలన వద్దు: స్టాలిన్

చెన్నై, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రతీకారం తీర్చుకునేలా పరిపాలన వద్దు. రాజకీయంగా మీ ఇష్టాయిష్టాల ప్రకారం ప్రభుత్వాన్ని నడిపితే మీరు ఒంటరి అవుతారు' అంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి హితవు పలికారు. ఈ మేరకు ఆయన బుధవారం సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఆర్థిక నివేదికలో కొన్ని రాష్ట్రాలు మినహా పలు రాష్ట్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయంటూ 'ఇండియా' కూటమి ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. "ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు దేశం గురించి ఆలోచించాలంటూ మోదీయే అన్నారు. కానీ, నిన్నటి బడ్జెట్ మీ పాలనను కాపాడుతుందే కానీ, దేశాన్ని కాదు. సాధారణంగా ప్రభుత్వాన్ని నడపండి" అంటూ స్టాలిన్ పేర్కొన్నారు.

కెనడాలో ఖలిస్తాన్‌వాదుల దుశ్చర్య

- స్వామి నారాయణ్ మందిర్‌పై భారత వ్యతిరేక రాతలు

న్యూఢిల్లీ, జూలై 24: ఖలిస్తాన్‌వాదులు మరోసారి దుశ్చర్యకు తెగబడ్డారు. కెనడాలోని ఎడ్మాంటన్‌లో ఉన్న బీఏపీఎస్ స్వామి నారాయణ్ మందిర్ గోడలను భారత వ్యతిరేక రాతలతో నింపేశారు. ప్రధాని మోదీ, భారత మూలాలున్న కెనడా ఎంపీ చంద్ర ఆర్యలను బెదిరిస్తూ రాతలు రాశారు. మరోవైపు, చంద్ర ఆర్య, ఆయన మద్దతుదారులు తక్షణం భారత్‌కు తిరిగి వెళ్లాలని ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ హెచ్చరించాడు. ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశాడు. కెనడాలోని కాల్గరిలో జూలై 28న ఖలిస్తాన్ రిఫరెండమ్‌కు సంబంధించి వోటింగ్ జరగనున్నట్లు అందులో ప్రకటించాడు. ఖలిస్తాన్‌వాదుల విద్వేష చర్యలను ఖండించినందునే తనకు పన్నూన్ హెచ్చరికలు జారీ చేశాడని చంద్ర ఆర్య పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● గురువారం 25 జూలై 2024

diksuchi@andhrajyothy.com

ఐఐటీ ఢిల్లీలో ఈవీ డిజైనింగ్ కోర్సు



ప్రస్తుత వాతావరణ మార్పుల యుగంలో కర్బన ఉద్గారాలను తగ్గించడం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని నియంత్రించడంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ), హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికిల్స్(హెచ్ఈవీ) క్రియాశీల పాత్ర పోషించనున్నాయి. వాతావరణంలో గ్రీన్ హౌజ్ వాయువులను తగ్గించడమే కాకుండా మరింత మెరుగైన రవాణా సదుపాయాలను ఈ విద్యుత్ వాహనాలు సమకూరుస్తున్నాయి. పర్యావరణ స్థిరత్వాన్ని ప్రోత్సహించడంలో, గ్లోబల్ వార్మింగ్ ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో ఈ సాంకేతికతల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఢిల్లీ... 'హైబ్రిడ్ వెహికిల్స్ డిజైన్'లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ని ప్రవేశపెట్టింది.

ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో పనిచేయాలనుకునే ఇంజనీర్లు, ప్రొఫెషనల్స్‌కు ఈ కోర్సును ఉద్దేశించారు. సంప్రదాయ ఆటోమోటివ్ ఇంజనీరింగ్, త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న విద్యుత్ వాహనాల మధ్య ఉండే సంబంధం, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి అవసరమయ్యే పరిష్కారాలను ఈ కోర్సులో అధ్యయనం చేయవచ్చు.

భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదే..!

కార్ ఎడ్జ్ రిపోర్ట్-2024 ప్రకారం భారతదేశంలో 2023లో 1.53 మిలియన్ విద్యుత్ వాహనాలు విక్రయించారు. 'జేఎంకే రీసెర్చ్ అండ్ అనలిటిక్స్' వార్షిక నివేదిక ప్రకారం... కేవలం ఒక్క 'ఈ-కార్' సెగ్మెంట్‌లోనే 2022తో పోల్చితే 2023లో వీటి అమ్మకాలు 150 శాతం పెరిగాయి. ఈ ఏడాది వీటి విక్రయాలు 66 శాతం అధికంగా ఉండొచ్చని 'కౌంటర్ పాయింట్ రిపోర్ట్-2024' అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగానే దేశీయ వాహన కంపెనీలు, స్టార్టప్‌లు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) అభివృద్ధి, విడుదలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. వచ్చే రెండు, మూడేళ్లలో పెద్ద ఎత్తున ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ ఓఈఎం(ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్) భారత్‌లో తమ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నాయి. దీంతో మధ్య, దీర్ఘకాలంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరగనుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2023 నాటికి రోడ్లపై నడిచే ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్లో 80 శాతం; వాణిజ్య వాహనాల్లో 70 శాతం; కార్లలో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటాయని భావిస్తున్నారు.

కరికులమ్

త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఆధునిక విద్యుత్ వాహనాల సాంకేతికను విద్యార్థులు అవగాహన చేసుకోవడం, వాటిలో తలెత్తే సంక్లిష్టతలను అధిగమించడం ప్రధాన లక్ష్యంగా ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సుకు రూపకల్పన చేసింది. భవిష్యత్తులో వాహన రంగంలో చోటు చేసుకోబోయే పరిణామాలకు అనుగుణంగా మరిన్ని సుస్థిర రవాణా సౌకర్యాల కల్పన వైపునకు దారి చూపేలా కరికులమ్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన FAME (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్(హైబ్రిడ్ అండ్) ఎలక్ట్రిక్ వెహికిల్స్' స్కీమ్ లక్ష్యం నెరవేరడంలో ఈ కోర్సు దోహదకారిగా ఉపయోగపడుతుంది. మరో విధంగా చెప్పాలంటే ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీని పెంచి, పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. ఇక బోధన విషయానికొస్తే..ఐఐటీ ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలాజీ(సీఏఆర్‌టీ) ఫ్యాకల్టీ పాఠ్యాంశాలను బోధిస్తారు.

పాఠ్యాంశాలు: ఎలిమెంటరీ థర్మో డైనమిక్స్, ఇంటర్నల్ కంబ్యూసన్ ఇంజిన్స్(ఐసీఈ), ఆటోమోటివ్ హైబ్రిడైజేషన్ అండ్ ఎలక్ట్రిఫికేషన్(ఏహెచ్ఈ), ఎలక్ట్రిక్ మెషిన్స్ ప్రొపల్షన్ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ అండ్ బ్యాటరీ మోడల్లింగ్ అండ్ టెస్టింగ్

వీటిని నేర్చుకుంటారు

- డిజైన్ పారామీటర్స్‌ని గుర్తించడం, ఆపరేటింగ్ క్యారెక్టరిస్టిక్స్ - కంబ్యూసన్ ఇంజన్ పనితీరు కొలమానాలు
- హైబ్రిడైజేషన్ అండ్ ఎలక్ట్రిఫైయింగ్ వెహికిల్స్ మధ్య వ్యత్యాసాలు
- హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ అవసరాలు, వాటి పనితీరుపై అవగాహనతో పాటు... వీటి మధ్య భిన్న సాంకేతికతలను సమీకృత పరచడం.
- ఎలక్ట్రిక్ వెహికిల్స్, హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ వల్ల ఉపయోగాలు
- ఎలక్ట్రిక్, హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌లలో సాధారణంగా ఉపయోగించే పవర్ ఎలక్ట్రానిక్స్ డ్రైవ్ సిస్టమ్స్‌ని కనుగొనడం

ప్రోగ్రామ్ హైలెట్స్

- లైవ్ ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ
- ఐఐటీ ఢిల్లీ ఫ్యాకల్టీ మెంటార్‌గా వ్యవహరిస్తున్న 'క్యాప్‌స్టోన్ ప్రాజెక్టు'లో పాల్గొనే అవకాశం ఉంటుంది. తద్వారా అభ్యర్థులు చేసే పరిశోధనకు నిపుణుల మార్గదర్శకత్వం, సహాయసహకారాలు లభిస్తాయి.
- ఈ ప్రోగ్రామ్ కీలక విభాగం క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్. కాబట్టి విద్యార్థులు తాము నేర్చుకున్న నైపుణ్యాలను అనువర్తింప చేయడానికి, హెచ్ఈవీ డిజైనింగ్ రూపకల్పనలో వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ ప్రాజెక్టు ద్వారా అవకాశం లభిస్తుంది.
- యూకేలోని ఫోర్డ్, డైసన్ వంటి దిగ్గజ వాహన పరిశ్రమల సహకారంతో రెండేళ్లు విజయవంతంగా కోర్సును నిర్వహించిన డైరెక్టర్ల పర్యవేక్షణలో నైపుణ్యాలను మెరుగుపర్చుకునే అవకాశం లభిస్తుంది.
- ఆటోమోటివ్ ఇండస్ట్రీలోని ప్రొఫెషనల్స్ నెట్‌వర్క్‌తో అనుసంధానం ఏర్పడుతుంది

కోర్సులో ఎవరు చేరొచ్చు?

- మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమోటివ్‌లో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసి ఈవీ/హెచ్ఈవీ రంగంలో మంచి కెరీర్‌ను ఆశించేవాళ్లు.
- ట్రెడిషనల్ ఇంటర్నల్ కంబ్యూసన్ ఇంజన్ టెక్నాలజీ నుంచి ఈవీ/హెచ్ఈవీ టెక్నాలజీకి షిఫ్ట్ కావాలనుకునే వారు.
- ఈవీ/హెచ్ఈవీలో మరింతగా ఎదగాలనుకునే ప్రొఫెషనల్స్

ముఖ్య సమాచారం

- **కోర్సు వ్యవధి:** ఆరు నెలలు. లైవ్ ఆన్‌లైన్ క్లాసులు
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,10,000(జీఎస్‌టీ సహా)
- **అర్హత:** మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమోటివ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ/కనీసం 40 శాతం మార్కులతో డిప్లొమా హోల్డర్స్
- **టెక్నికల్ ఓరియెంటేషన్:** 2024 సెప్టెంబరు 29
- **తరగతులు ప్రారంభం:** 2024 అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** https:// iit-delhi.emeritus.org/



పారామెడికల్‌లో డిప్లొమా కోర్సులు



విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్(ఏపీఎస్ఏహెచ్‌పీసీ)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు అందిస్తున్న వివిధ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఒక్కో డిప్లొమా కోర్సు వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం 1002 సీట్లు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లోని సీట్ల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రభుత్వ కళాశాలల్లో నిర్దేశిత జిల్లాల(లోకల్) అభ్యర్థులకు 85 శాతం సీట్లు, ఇతర జిల్లాల(నాన్ లోకల్) అభ్యర్థులకు 15 శాతం సీట్లు ప్రత్యేకించారు. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం గవర్నమెంట్ కోటా సీట్లు, 40 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిగా నింపి ప్రింట్ తీసుకోవాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలకు అప్లయ్ చేసుకొనేవారు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు, ప్రైవేట్ కళాశాలలకు దరఖాస్తు చేసుకొనేవారు సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయానికి తమ దరఖాస్తులు పంపాలి.

పారామెడికల్ డిప్లొమా కోర్సులు

- డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ(డీఎంఐటీ)
- డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్(డీఓఏ)
- డిప్లొమా ఇన్ డయాలసిస్ టెక్నాలజీ (డీడీఐఏఎల్‌వై)
- డిప్లొమా ఇన్ రెస్పిరేటరీ థెరపీ(డీఆర్‌ఈఎస్‌టీ)
- డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ(డీఎంఎస్‌టీ)
- డిప్లొమా ఇన్ పెర్ఫ్యూజన్ టెక్నాలజీ (డీఈఆర్ఎఫ్‌యూ)
- డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్ కోర్సు (డీఓటీ)
- డిప్లొమా ఇన్ రేడియోథెరపీ టెక్నాలజీ(డీఆర్‌టీటీ)
- డిప్లొమా ఇన్ రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ (డీఆర్‌జీఏ)
- డిప్లొమా ఇన్ డార్క్ రూం అసిస్టెంట్(డీడీఆర్ఏ)
- డిప్లొమా ఇన్ కార్డియాలజీ టెక్నీయన్ కోర్సు (డీకార్డియో)
- డిప్లొమా ఇన్ క్యాత్ ల్యాబ్ టెక్నాలజీ(డీసీఎల్‌టీ)
- డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ కోర్సు (డీఈసీజీ)
- డిప్లొమా ఇన్ అనెస్థీషియా టెక్నీషియన్ కోర్సు (డీఏఎన్ఎస్)
- డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మేల్) కోర్సు(డీఎంపీహెచ్ఏ)

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్(బైపీసీ/ఎంపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇతర గ్రూప్‌ల అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. బైపీసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఎంపీసీ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇంకా సీట్లు ఉంటే ఇతర గ్రూప్‌ల అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. లాంగ్వేజ్‌లు మినహా గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 6
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు; ఆధార్ కార్డ్; కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలు
- **కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు:** ఆగస్టు 19
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన కౌన్సిల్ ఫీజు:** రూ.200
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 18 నుంచి
- **వెబ్‌సైట్:** apsahpc.co.in

ప్రభుత్వ వైద్య కళాశాలలు-సీట్లు-నిర్దేశిత జిల్లాలు

- విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో 141 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు వస్తాయి.
- కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో 101 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు వస్తాయి.
- విజయవాడలోని సిద్దార్థ మెడికల్ కాలేజీలో 70 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి కృష్ణా జిల్లా వస్తుంది
- గుంటూరు మెడికల్ కాలేజీలో 115 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి గుంటూరు, ప్రకాశం జిల్లాలు వస్తాయి.
- తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో 60 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాలు వస్తాయి.
- కడపలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 120 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి వైఎస్సార్ కడప జిల్లా వస్తుంది
- కర్నూలు మెడికల్ కాలేజీలో 121 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి కర్నూలు జిల్లా వస్తుంది.
- అనంతపురంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 72 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి అనంతపురం జిల్లా వస్తుంది.
- శ్రీకాకుళంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో 205 సీట్లు ఉన్నాయి. దీని పరిధిలోకి శ్రీకాకుళం జిల్లా వస్తుంది.

కోర్టు రూముల నుంచి క్లాస్ రూమ్స్‌కు సింధూర రెడ్డికి రైస్ వర్సిటీ స్కాలర్‌షిప్

హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది చెరుకు సింధూర రెడ్డి అమెరికాలోని రైస్ యూనివర్సిటీకి చెందిన జోన్స్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. ప్రముఖ ఫోర్బ్స్ మేగజైన్ 'న్యూ ఐవీస్' జాబితాలోని వర్సిటీలలో రైస్ యూనివర్సిటీ ప్రముఖమైనది. సింధూర రెడ్డికి ఈ యూనివర్సిటీ ఎంబీఏ కోర్సులో చేరేందుకు ఫుల్ స్కాలర్‌షిప్‌ని మంజూరు చేసింది. ఆమె జీఆర్ఈలో మంచి స్కోరు సాధించారు. దీనితోపాటు ఆమె వృత్తి నేపథ్యం, మంచి అకడమిక్ రికార్డు, నాయకత్వ స్థాయి సామర్థ్యాలు వంటి అంశాలు సింధూర రెడ్డి స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేయడంలో దోహదపడ్డాయి. అయినప్పటికీ ఇంటర్వ్యూ ప్రక్రియ కొంత కఠినంగానే కొనసాగింది. లా నుంచి బిజినెస్ వైపునకు మారడానికి గల తన ఆకాంక్షను ప్రభావపూరితంగా వివరించడంతో ఇంటర్వ్యూ విజయవంతంగా పూర్తయ్యింది. నాయకత్వ పటిమను పెంచుకోవడానికి, బిజినెస్ వ్యవహారాలను సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి తనకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. ఎంబీఏ చదవాలనుకునే విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను ముందుగానే మొదలు పెట్టాలని, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)లో ప్రామాణికతను కొనసాగించాలని, పూర్వ విద్యార్థులతో ప్రస్తుత విద్యార్థులు నెట్‌వర్క్‌ను కొనసాగించాలని, అవసరమైతే అలూమ్నీ సహకారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు లింక్డ్ఇన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానని సింధూర రెడ్డి తెలిపారు.



నిమ్స్‌లో ఎమ్మెస్సీ జెనెటిక్ కౌన్సెలింగ్



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- ఎమ్మెస్సీ(జెనెటిక్ కౌన్సెలింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ(లైఫ్ సైన్సెస్/నర్సింగ్/హ్యూమన్ జెనెటిక్స్/హ్యూమన్ బయాలజీ/మెడికల్ బయోటెక్నాలజీ/మాలిక్యులర్ బయాలజీ)/బీటెక్(బయోటెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్/బయో మెడికల్ ఇంజనీరింగ్/బయలాజికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎన్ఎంసీ గుర్తింపు ఉన్నవారు, బీడీఎస్ ఉత్తీర్ణులై డీసీఐ గుర్తింపు పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 35 ఏళ్లు మించకూడదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్

ఈ పరీక్షలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. లైఫ్ సైన్సెస్, బేసిక్ జెనెటిక్స్, సెల్ బయాలజీ అండ్ డివిజన్, సైటోజెనెటిక్స్, మాలిక్యులర్ జెనెటిక్స్, రీసెర్చ్ మెథడాలజీ, పాపులేషన్ జెనెటిక్స్, సైకోసోషల్ అండ్ ఎథికల్ ఇష్యూస్ ఇన్ మెడిసిన్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 10
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **ఈ మెయిల్/లాగిన్ అకౌంట్ ద్వారా హాల్ టికెట్‌లు పంపే తేదీ:** ఆగస్టు 16
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 20
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 21న
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

చిట్టి




కోటి రూపాయల కుండలు


ధర్మపురంలో కేశవయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతని వద్ద ఒక ముసలి ఏనుగు ఉండేది. ఆ ఊరి జనం పండగలు, పెళ్లిళ్లు, తిరునాళ్లు, ఊరేగింపులకు ఆ ఏనుగును అద్దెకు తీసుకొని, కేశవయ్యకు డబ్బు చెల్లిస్తూ ఉండేవారు. ఒక రోజు రామయ్య తన కొడుకు పెళ్లి అని ఆ ఏనుగును అద్దెకు తీసుకున్నాడు. ఊరేగింపు జరిగినంత సేపూ ఏనుగు బాగానే ఉండి, చివరలో అనారోగ్యానికి గురై కిందపడి, అక్కడే చనిపోయింది. రామయ్య ఈ విషయం వెంటనే కేశవయ్యకు చెప్పి, దాని ధర ఎంతో చెల్లిస్తాననీ, ఏనుగు అంత్య క్రియలు కూడా తానే చేస్తాననీ, ఎంత చెప్పినా కేశవయ్య వినకుండా, దానిని నేను చాలా ఇష్టంగా పెంచుకున్నాను. నాకు నా ఏనుగును తెచ్చివ్వు లేదా నీ ఆస్తి మొత్తం నాకు రాసివ్వు అని గొడవ చేసాడు. చుట్టూ ఉన్నవారు ఈ విషయం పంచాయితీ పెద్దకు ఫిర్యాదు చేయడం మంచిది అని సలహా ఇచ్చారు. అలాగే అని కేశవయ్య వెళ్లి పంచాయితీలో విషయమంతా చెప్పాడు అంతా విన్న పంచాయితీ పెద్ద, కేశవయ్యను వెళ్లి రామయ్యను వెంటనే పిలుచుకొస్తే విచారణ చేస్తాననీ, చెప్పి పంపాడు. కేశవయ్య రామయ్య ఇంటికి వచ్చి, తలుపు గడియ వేసి లేకపోవడంతో తలుపును ఒక్కసారిగా తోశాడు. ఆ దెబ్బతో తలుపుకు ఆనుకుని ఉన్న కుండల దొంతర కిందపడి కుండలన్నీ పగిలి పోయాయి. పగిలిన కుండలను చూసుకుంటూ రామయ్య ఇవి నాకెంతో ఇష్టమైన కుండలు, ఇపుడు నీ వల్ల పగిలి పోయాయి. 'వీటికి కోటి రూపాయలు నష్ట పరిహారం కట్టు' అని గొడవ చేసాడు ఆ మాటలకు కేశవయ్య 'ఏమిటీ కుండలకు కోటి రూపాయలా? ఇదేమన్న న్యాయంగా ఉందా?' అని అడిగాడు. 'మరి ముసలి ఏనుగుకు నా ఆస్తి మొత్తం రాసిమ్మనడం మాత్రం న్యాయంగా ఉందా కేశవయ్యా?' అన్నాడు రామయ్య. వెంటనే కేశవయ్యకు విషయం అర్థమైపోయి, రామయ్య ఇచ్చిన సొమ్ము తీసుకుని, ఏనుగు విషయం వదలివేశాడు.

10 తేడాలను గుర్తించండి?









సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 367

		6	3		
					5
	1		2		
		4		5	
4					
		3	1		

సుడోకు - 366 సమాధానం

8	3	1	6	7	5	4	9	2
6	7	4	9	3	2	1	5	8
5	2	9	1	8	4	3	7	6
1	6	5	3	4	8	7	2	9
3	9	8	7	2	1	6	4	5
7	4	2	5	6	9	8	1	3
2	8	3	4	5	7	9	6	1
4	1	6	2	9	3	5	8	7
9	5	7	8	1	6	2	3	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.